
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 28.04.2025 | సంపుటి : 11 సంచిక : 279 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV



## తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే
# మొదటి శత్రువు

### ఇకపై బయటకు వస్తా.. ప్రజల తరపున పోరాడుతా..

- ఎన్నో పథకాలు అమలు చేశాం
- 2014కు ముందు పరిస్థితులు మళ్లీ వచ్చాయి
- తెలంగాణ తొలిదశ ఉద్యమాన్ని కాంగ్రెస్‌పార్టీ నిరంకుశంగా అణచివేసింది
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు

"పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే తెలంగాణను నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చేవరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. రైతుల నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. రైతుకు మేలు చేసిన వాళ్లు లేరు. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతుబంధు పథకం తీసుకువచ్చాను. రైతులు ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకుంది."
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



- పదేండ్లలో తెలంగాణను ధగధగలాడించాం.. అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం
- మూగబోయిన తెలంగాణ నినాదానికి జీవం పోసింది ఈ 'గులాబీ' జెండానే..
- నయవంచక కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైంది
- భారాస రజతోత్సవ వేడుక సభలో పార్టీ అధినేత కేసీఆర్



**వరంగల్ ప్రతినిధి,హన్మకొండ(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం బయల్దేరిన సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను

మిగతా 2లో..

# కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయింది



### ఆయన ప్రసంగం మొత్తం కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదు
### మంత్రులు పొంగులేటి, జూపల్లి, పొన్నం, సీతక్క

**హైదరాబాద్(జనంసాక్షి):** కేసీఆర్‌మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు.

మిగతా 2లో..

# కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు



### భారీగా ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధి కారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది.సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థికశాఖ బాధ్యతలను

మిగతా 2లో..

## మావోయిస్టులను సామాజిక,ఆర్థిక,రాజకీయ
# సమస్యగానే చూస్తాం

### శాంతి చర్చలపై సహచరులతో చర్చిస్తా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రికి శాంతి చర్చల కమిటీ నేతల విజ్ఞప్తి



**హైదరాబాద్(జనంసాక్షి):** మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి శాంతి చర్చల కమిటీ నేతలు విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని సీఎంను కోరారు. ఈ మేరకు శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలోనే చూస్తుందన్నారు. శాంతి భద్రతల అంశంగా పరిగణించదని చెప్పారు. నక్సల్స్‌తో చర్చలు జరిపిన అనుభవం జానారెడ్డికి ఉందన్నారు. ఈ అంశంపై జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకొని, మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# ఆపరేషన్ కగార్ ఆపివేయండి

### మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి
### దీనిపై తీర్మానం చేసి ఢిల్లీకి పంపుదాం
### భారాస రజతోత్సవ సభలో కేసీఆర్



**ఎల్కతుర్తి(జనంసాక్షి):** భాజపా వైఖరి అంతా భ్రభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బల గాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వా మ్యం అనిపిం చుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం" అని పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.

## పహల్గాం ఉగ్రదాడి కేసు
# ఎన్ఐఏ చేతికి



### కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ.. పలు కీలక ఆధారాలు సేకరణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడి ఘటనపై భారత భద్రతా బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు.. సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నాయి.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు తాజాగా ఈ కేసును జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ అధికారికంగా తీసుకుంది. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఎన్ఐఏ బృందాలు పహల్గాంలో విచారణను ప్రారంభించాయి. ఘటన జరిగిన సమయంలో ఉగ్రవాదులను చూసిన పర్యాటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటన సమయంలో ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పహల్గాంలోకి ప్రవేశించే, నిష్క్రమించే ప్రాంతాల్లో ఫోరెన్సిక్ బృందం సహాయంతో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.బైసరన్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ముష్కరులు కాల్పులు జరిపిన విషయం తెలుసుకొని తొలుత సీఆర్పీఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్ స్పందించింది. 25 మంది కమాండోలతో కూడిన బృందం రాళ్లు, బురద మార్గంలో దాదాపు 40-45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి ఘటనాస్థలానికి చేరుకుంది. వెంటనే పహల్గాం

మిగతా 2లో..

## నియంత్రణ రేఖ వెంట పాక్ మరోసారి కాల్పులు

### మరో ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్ల పేల్చివేసిన భారత సైన్యం

**శ్రీనగర్(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు దిగింది. వరుసగా మూడోరోజు నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు తెగబడింది. జమ్మూకశ్మీర్‌లోని తుత్మారి గలి, రాంపూర్

మిగతా 2లో..

## జమ్మూకాశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే
# ఉగ్రదాడి..



- ఈ ఘటన నన్ను ఎంతగానో కలచివేసింది
- ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడు
- బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు
- కారకులకు అత్యంత కఠినమైన శిక్ష విధిస్తాం
- 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమం 121వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి తనను ఎంతగానో కలచివేసిందని.. ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడని అన్నారు. దేశంలో ఎన్నో మతాలు, కులాలు, భాషలు ఉన్నప్పటికీ.. ప్రజలంతా బాధితులకు అండగా నిలిచారని.. ఇదే భారత్‌లో ఉన్న గొప్పదనమని కీర్తించారు. జమ్మూకశ్మీర్ సాధిస్తున్న అద్భుత పురోగతిని చూసి ఓర్వలేకే.. ఉగ్రవాదులు అమాయకులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "జమ్మూ కశ్మీర్‌లో శాంతిని స్థాపించేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తోంది. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్నాయి. యువత ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యాటకం పెరుగుతోంది. ఇదంతా చూసి మన శత్రువులు ఓర్చుకోలేకపోయారు. కశ్మీర్‌ను మరోసారి నాశనం చేయాలనుకున్నారు" అని మోదీ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని.. దాడికి పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధిస్తామని ప్రధాని పునరుద్ఘాటించారు.ఉగ్రవాదంపై చేస్తున్న యుద్ధంలో దేశ ఐక్యత, 140 కోట్లమంది ప్రజల మద్దతు భారత సైన్యానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. మనలో ఉన్న ఐక్యతను ప్రపంచానికి చాటి

మిగతా 2లో..

# మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### బైక్‌ను ఢీకొట్టి బావిలో పడ్డ కారు... 11మంది మృతి

**భోపాల్(జనంసాక్షి):** మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకెళ్తున్న వ్యాన్ ఒక బైక్‌ను ఢీకొట్టాక అదుపు తప్పి బావిలో పడిపోయింది. ఆదివారం నారాయణ్ ఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కచారియా గ్రామంలో జరిగిన ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తితో పాటు బావిలో పడ్డ వారిని రెస్క్యూ చేయబోయిన వ్యక్తి కూడా చనిపోయారు.రత్లాం రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) మనోజ్ సింగ్ కథనం ప్రకారం, రత్లాం జిల్లా తాల్‌కు చెందిన 13 మంది మంద్ సౌర్ జిల్లా అంతారి మాతాజీ గ్రామంలో ఉన్న మాతా మందిరం సందర్శనకు వ్యాన్‌లో బయలుదేరారు. కచారియా గ్రామంలోని చౌపట్టి వద్దకు చేరుకోగానే ఆ వ్యాన్‌పై డ్రైవర్ అదుపు కోల్పోయాడు.

మిగతా 2లో..





జూబ్లీహిల్స్ లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు

## కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు

నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**భారీగా ఐఏఎస్‌ల బదిలీలు**

మరోవైపు, రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్ – శశాంక్ గోయల్,ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో– జయేశ్ రంజన్,పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి– సంజయ్ కుమార్,ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ – స్మితా సబర్వాల్,కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – దానకిశోర్,పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి (హెచ్ఎండీఏ వెలుపల)– టీకే శ్రీదేవి,పట్టణాభివృద్ధి కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి) – ఇలంబర్తి,జీహెచ్ఎంసీ కమిషనర్ – ఆర్వీ కర్ణన్,ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ – కె.శశాంక,జెన్‌కో సీఎండీ – ఎస్. హరీశ్,రాష్ట్రమానవ హక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో – నిఖిల,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ – సంగీతం సత్యనారాయణ, దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో – ఎస్. వెంకటరావు,సెర్ప్ అదనపు సీఈవో – పి. కాత్యాయనీదేవి,ఇండస్ట్రీ, ఇన్వెస్టిమెంట్ సెల్ అదనపు సీఈవో – ఈవీ నర్సింహారెడ్డి,జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ – హేమంత్‌సహదేవ్ రావు,టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ – ఫణీంద్రారెడ్డి,పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ – కధిరవన్,హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) – విద్యాసాగర్,హెచ్ఎండీఏ సెక్రటరీ – ఉపేందర్ రెడ్డి

## క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగా గుర్తించం

**కీవ్(జనంసాక్షి):**రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా, క్రిమియాపై రష్యా నియంత్రణను అమెరికా గుర్తించిందని..ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. తాజాగా ఈ విష యంపై ఉక్రెయిన్ స్పందిస్తూ..అమెరికా చేసిన శాంతి ప్రతిపాదనలో క్రిమియాపై రష్యా అధికారం ఉంటుందని పేర్కొనడం తమను షాక్‌కు గురిచేసిందని పేర్కొంది. క్రిమియాను తామెన్నటికీ రష్యాలో భాగంగా గుర్తించమని..అమెరికా ప్రతిపాదనను అంగీకరించబోమని తేల్చిచెప్పింది. అమెరికా ప్రతిపాదనకు అసలు అర్థమే లేదని జెలెన్‌స్కీ పార్టీ శాసనసభ్యుడు ఒలెక్సాండర్ మెరెజ్కో? అన్నారు. క్రిమియాను రష్యా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని..దానిని ఆ దేశానికి పూర్తిగా ఇచ్చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. దీనికి తమ దేశ రాజ్యాంగంలో మార్పులు చేయాల్సి ఉంటుందని.. దేశవ్యాప్తంగా ప్రజల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. క్రిమియాను వదులుకోవడం అంటే తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి రాజకీయ ఆత్మహత్యతో సమానమని అన్నారు. దీనివల్ల ఆయన భవిష్యత్తులో ఎన్నో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అంతే కాకుండా దీనిని తమ దేశంలో రాజద్రోహంగా పరిగణిస్తారని..ఉక్రెయిన్ ప్రభుత్వం ఎప్పటికీ అటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు..ఉక్రెయిన్ ప్రభుత్వం రాజకీయంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తాము ఈ పోరాటాన్ని ఎన్నటికీ ఆపబోమని ఉక్రెయిన్ సైనిక అధికారులు పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయారని..వారి త్యాగాలకు ఫలితం కచ్చితంగా తమ దేశ ప్రజలకు దక్కాలని అన్నారు.దక్షిణ ఉక్రెయిన్‌లో నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా వ్యూహాత్మక ప్రాంతం. 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడిన ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని చెప్పారు. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్ (%ూబ్‌అఅ%)కు సూచించారు. శనివారం వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన అనంతరం ట్రంప్ రష్యా అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. పుతిన్‌కు యుద్ధం ఆపాలన్న ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదన్న విషయం తనకు అర్థమవుతోందని అన్నారు.

## యాంటీ షిప్ మిస్సైల్స్‌ను పరీక్ష విజయవంతం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగానే అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో సన్నద్ధతను పరీక్షించుకునేందుకు వీటిని ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా.. ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ సిద్ధమని ప్రకటించింది.మూడ్రోజుల క్రితమే భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్–ఎస్ఏఎం)తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించింది. గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పేర్కొంటారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీడీఎస్ భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్–పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ (%ుఇఅఫ్ఞ రాఅఅస్త్రష్ణ%)తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలు, సరిహద్దులో ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం. మరోవైపు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌధరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. సరిహద్దులో పాక్ బలగాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వేళ ఈ వరుస భేటీలకు ప్రాధాన్యం సంతరించుకుంది.ఇదిలాఉంటే,



పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. వీటిని జీర్ణించుకోలేని పాక్ నేతలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇదే సమయంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాక్ సైన్యం.. నియంత్రణ రేఖ వెంట దాడులకు పాల్పడుతోంది. వీటిని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఇలా సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పారామిలిటరీ, సైన్యానికి ఇచ్చిన సెలవులు రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు వెళ్లాయి. అటు జమ్మూ కశ్మీర్‌లోనూ భారీగా సైన్యాన్ని మోహరించారు.

# తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే మొదటి శత్రువు



దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం""సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు"

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

"రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం"

**తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?**

"ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు""ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 80–90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరఫున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా**

"ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసా గించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా..భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్‌సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 20–30శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

## కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయింది

మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో భారాస అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగంపై మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరును తప్పుబట్టారు."గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు.కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది.యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారని అని పొంగులేటి అన్నారు.

అధికారం పోయిందని అక్కసు: సీతక్క

అధికారం పోయిందనే అక్కసును మాజీ సీఎం కేసీఆర్ వెళ్లగక్కారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయిన తర్వాత ఆయన కుటుంబంలో చీలికలు వస్తున్నాయని బాధపడుతున్నారు తప్ప.. ప్రజల కోసం కాదని అన్నారు. '

కేసీఆర్ గర్వం ఇంకా తగ్గలేదు: జూపల్లి

ప్రజలు ఓడించి ప్రతిపక్షంలో కూర్చుబెట్టినా.. కేసీఆర్‌లో ఇంకా గర్వం తగ్గలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. పార్టీ రజతోత్సవ వేదికపై కేసీఆర్ మినహా ఒక్క నేత అయినా మాట్లాడకుండా నిరంకుశంగా వ్యవహరించారని అన్నారు.

కేసీఆర్ అవకాశవాది: పొన్నం ప్రభాకర్

కేసీఆర్ అవకాశవాదిలా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. " సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అనలేదా?ఇవాళ విలన్ అంటున్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి ఆ సభా వేదికపై ఎందుకు నివాళి అర్పించలేదు. పార్టీ పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎవరికైనా ఇచ్చారా" అని నిలదీశారు.

## కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకే ఉగ్రదాడి..

చెప్పాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ దాడిని భారత ప్రజలు ఒకే గొంతుతో వ్యతిరేకించడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయన్నారు. భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. దేశంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాల్సిన సమయం వచ్చిందని మోదీ అన్నారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని బయటకు లాగుతామని.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని హెచ్చరించారు.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

దీంతో వ్యాన్ అదుపు తప్పి ఓ బైక్‌ను ఢీకొట్టి, నేరుగా వెళ్లి బావిలో పడిపోయింది. వ్యాన్ వేగంగా ఢీకొనగానే బైక్ నడుపుతున్న వ్యక్తి చనిపోయాడు. ఇక బావిలో వ్యాన్ పడటాన్ని చూసిన స్థానికుడు మనోహర్ సాహసం చేసి బావిలోకి దూకాడు. వ్యాన్‌లోని వారిని కాపాడేందుకు యత్నించాడు. అయితే అతడు కూడా బావి నీటిలో మునిగి చనిపోయాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే మల్హార్‌గఢ్ ఎస్‌డీఓపీ నరేంద్ర సోలంకి, అదనపు ఎస్పీ గౌతమ్ సోలంకి సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని మొత్తం 13 మందిలో నలుగురిని రక్షించగా, తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. బావిలో నుంచి అన్ని మృతదేహాలను వెలికి తీశారు. మరొక మృతదేహాన్ని బయటికి తీసేందుకు రెస్క్యూ వర్క్ కొనసాగుతోంది. "మృతదేహాలను పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి పంపాం. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం అదే ఆస్పత్రికి తరలించాం" అని మల్హార్‌గఢ్ ఎస్‌డీఓపీ నరేంద్ర సోలంకి వెల్లడించారు. "గాయపడిన వారికి ప్రస్తుతం మా ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది" అని జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ డీకే శర్మ తెలిపారు. సహాయక చర్యల్లో జాతీయ విపత్తు స్పందన దళం తో పాటు ఇతరత్రా భద్రతా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం, మల్హార్‌గఢ్ ఎమ్మెల్యే జగదీశ్ దేవ్డా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు.

# పహల్గాం ఉగ్రదాడి కేసు ఎన్ఐఏ చేతికి

చుట్టూ సీఆర్పీఎఫ్ యూనిట్ చెక్‌పోస్టులు, ఘటనాస్థలానికి సమీపంలో సురక్షిత పాయింట్లను ఏర్పాటు చేసింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని పర్యాటకులను ఇతర ప్రాంతాలకు తరలించారు.

కీలక ఆధారం ఎన్ఐఏ చేతికి

పహల్గాం దాడికి సంబంధించిన అత్యంత కీలక ఆధారమైన ఓ వీడియో ఇప్పుడు ఎన్ఐఏ చేతికి వచ్చింది. బైసరన్‌కు వచ్చే టూరిస్టుల కోసం రీల్స్‌ను చిత్రీకరించే ఓ స్థానిక వీడియో గ్రాఫర్ ఈ దాడి మొత్తాన్ని కెమెరాలో బంధించాడు. దాడి జరిగే సమయంలో అతడు ఓ చెట్టుపై దాక్కొని మొత్తాన్ని చిత్రీకరించాడు. ఆ వీడియోల ఆధారంగా జరిగిన దారుణాన్ని ఓ వరుసక్రమంలో తెలుసుకొనేందుకు జాతీయ దర్యాప్తు సంస్థకు కీలకంగా మారాయి.ఉగ్రవాదులు రెండు గ్రూపులుగా విడిపోయి లోయలో వేర్వేరు దిక్కుల నుంచి కాల్పులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. తొలుత ఇద్దరు ఉగ్రవాదులు సందర్శకులను ముస్లిం మతాచారాన్ని పాటించమని బెదిరించారు. ఆ తర్వాత దాదాపు నలుగురిని కాల్చి చంపారు. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు మొదలయ్యాయి. సందర్శకులు తలోదిక్కులకు పారిపోగా.. జిప్‌లైన్ అనే ప్రదేశం నుంచి మరో ఇద్దరు ఉగ్రవాదులు బయటకు వచ్చి కాల్పులు మొదలుపెట్టారు."ఈ ఫొటోగ్రాఫర్ ప్రాణాలు కాపాడుకోవడానికి పరిగెత్తి.. తూటాలను తప్పించుకోవడానికి చెట్టు కొమ్మపై దాక్కొన్నాడు. ఆ తర్వాత మొత్తం చిత్రీకరించాడు" అని ఓ సీనియర్ అధికారి వెల్లడించాడు. జాతీయ దర్యాప్తు సంస్థ అతడిని ప్రశ్నించి ఆధారాలు సేకరించింది. ఉగ్రవాదులు, వారికి సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్లను గుర్తించేందుకు ఈ వీడియో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉగ్రవాదులు స్థానికుల నుంచి రెండు ఫోన్లు కూడా లాక్కొనట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. వీటిల్లో ఒకటి సందర్శకుడిది కాగా.. రెండోది స్థానికులది. ఇప్పుడు వాటిని ట్రాక్ చేసేందుకు యత్నిస్తున్నారు. వీటి ఆధారంగా ఉగ్రవాదుల ప్రస్తుత లొకేషన్లు కూడా కనుగొనే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దాడి తర్వాత నుంచి అవి స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించారు. ఇక ఘటనా స్థలం నుంచి ఏకే–47, ఎం4 రైఫిల్ ఖాళీ తూటాలను గుర్తించారు.

## నియంత్రణ రేఖ వెంట పాక్ మరోసారి కాల్పులు

సెక్టార్లలో ఈ ఘటన చోటు చేసుకుంది. శత్రువుల దాడిని భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంటోంది. పాక్ సైన్యం కాల్పులకు దీటుగా బదులిస్తోంది. శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారులు ఆదివారం వెల్లడించారు.నియంత్రణ రేఖ వెంబడి పలు పోస్టుల నుంచి పాక్ ఆర్మీ కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించారు. కాగా గత మూడు రోజులుగా పాక్ ఎల్ఓసీ వద్ద కాల్పులు జరుపుతోంది. దీంతో భారత సైన్యం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. పహల్గాం దాడి జరిగిన వెంటనే దాయాదితో ఉద్రిక్తతలను అంచనా వేసిన భారత అధికారులు పారామిలిటరీ సైన్యానికి ఇచ్చిన సెలవులను సైతం రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని మోహరించారు. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామాల వేళ సరిహద్దుల్లో వరుస కాల్పులు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

**పహల్గాందాడి..**

**మరో ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్ల పేల్చివేత**

**శ్రీనగర్(జనంసాక్షి):** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. లష్కరే తోయిబా ఉగ్ర ముఠాతో సంబంధం ఉన్న ఉగ్రవాదుల, అనుమానితుల ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే భద్రతా బలగాలు మరో ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లను పేల్చివేశాయి.



ఉగ్రవాదులు ఫరూఖ్ అహ్మద్ తద్వా, జమీల్ అహ్మద్ షీర్ అమీర్ నాజిర్, అద్నాన్ సఫీ, జాకీర్ అహ్మద్ ఇళ్లను శనివారం రాత్రి ధ్వంసం చేశాయి.దీంతో ఇప్పటి వరకు పది మంది ఉగ్రవాదుల ఇళ్లను పేల్చి వేశామని.. మిగిలిన వారిపైనా ఇటువంటి చర్యలే తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఉగ్ర స్థావరాలను గుర్తించడానికి శ్రీనగర్‌లోని 60కి పైగా ప్రదేశాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులు పన్నే కుట్రలను నిర్వీర్యం చేయడానికి సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. వారి ఇళ్లల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఆయుధాలు మొదలైన వాటిని స్వాధీనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. దేశంలో హింస, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడాలనుకునే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని..వారంతా కఠినమైన పరిస్థితులు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.పహల్గాం దాడి అనంతరం ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు జరపడానికి భద్రతా బలగాలు వెళ్లగా.. దాడికి పాల్పడిన ముష్కరుల్లో ఒకడైన ఆదిల్ హుస్సేన్ థోకర్, మరో ఉగ్రవాది ఆసిఫ్ షేక్ ఇళ్లల్లో అప్పటికే బాంబులు యాక్టివేట్ అయి ఉన్నట్లు గుర్తించి త్రుటిలో తప్పించుకున్నారు. దీంతో ఇతర ఉగ్రవాదుల ఇళ్లను కూడా అధికారులు పేల్చివేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం లష్కరే తోయిబా కమాండర్ షాహిద్ అహ్మద్, యాక్టివ్ టెర్రరిస్టులు జాహిద్ అహ్మద్, అహ్సన్ ఉల్ హక్, హారీస్ అహ్మద్ ఇళ్లను పేల్చివేశారు. శనివారం జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని గుర్తించి.. ఐదు ఏకే 47 తుపాకులు, భారీ సంఖ్యలో తూటాలు, పిస్తోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## భారత్‌పై దాడికోసం 130 అణు బాంబులు రెడీ

### పాక్ మంత్రి బెదిరింపులు

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**భారత్‌పై దాడి చేసేం దుకే 130 అణుబాంబులు సిద్ధంగా ఉంచినట్లు పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగ బెదిరింపులకు దిగారు. వీటితోపాటు ఘోరీ, షహీన్, ఘజ్నవి క్షిపణులు కూడా ఉన్నాయన్నా రు. భారత్ సింధూ జలాలను నిలిపివేస్తే.. పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. పాక్ వద్ద ఉన్న అణ్వా యుధాలు దేశంలోని వివిధ రహస్య ప్రాంతాల్లో భద్రపర్చామని.. భారత్ కవ్విస్తే దాడికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. "మా వద్ద ఉన్న ఆయుధాలు, క్షిపణులు ప్రదర్శన కోసం కాదు. అణ్వాయుధాలను ఎక్కడ ఉంచామో ఎవరికీ తెలియదు. మా బాలిస్టిక్ క్షిపణులు భారత్‌ను లక్ష్యంగా చేసుకొం టాయి" అని అబ్బాసీ పేర్కొ న్నారు.పాకిస్థాన్ నుంచి ఎదురుకానున్న తీవ్ర పరిణా మాలను న్యూదిల్లీ ఇప్పటికే అర్థం చేసుకుంటోందని అబ్బాసీ వ్యాఖ్యానించారు. రెండ్రోజులు గగనతలం మూసేస్తేనే భారత వైమానిక రంగం తీవ్ర గందరగోళంలో కూరుకుపోయిందన్నారు. మరో 10 రోజులు ఇలానే చేస్తే ఏకంగా భారత విమానయాన సంస్థలు దివాలా తీస్తాయని చెప్పారు. అంతేకాదు.. ఇబ్బందులు ఎదుర్కోవడానికి తామూ సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందురోజే పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసీఫ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఉగ్రవాదులకు మద్దతు, శిక్షణ, ఉగ్రసంస్థలకు ఆర్థిక సహకారం వంటి చెత్త పనులన్నీ పశ్చిమదేశాల కోసం చేశామని అంగీకరించారు. ఇది పొరపాటేనని, ఆ పర్యవసానాలతో తమ దేశం ఇబ్బందులకు గురవు తోందని వాపోయారు. జమ్మూకశ్మీర్ పహల్గాంలోని బైసరన్‌లో ఉగ్రదాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్' మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా "ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకా లంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటి?" అని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి ఖవాజా బదులిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు

- మే మొదటి వారం నుంచి ప్రారంభం
- 12 రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు
- విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు



**హైదరాబాద్ (జనం సాక్షి) :** విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా సమ్మర్ క్యాంపులను ప్రారంభించనున్నారు. ఇంతవరకు హైదరాబాద్, మరికొన్ని పాత జిల్లా కేంద్రాల్లోని బాల భవన్‌లలో మాత్రమే సమ్మర్ క్యాంపులు నిర్వహించేవారు. ఈసారి తెలంగాణలోని పలు ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 15 నుంచి 20 రోజుల పాటు సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే విషయమై ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కొద్ది రోజుల్లో వాటిని ప్రారంభించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం పిల్లల భద్రత, ఇతర అంశాలపై ఉమ్మడి మార్గదర్శకాలను జారీ చేయనుంది. పలువురు కలెక్టర్లు 'యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్' అని పేరు పెట్టగా మరికొందరు 'తెలంగాణ రైజింగ్' అని ప్రతిపాదించారు.

### 12 రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు

వచ్చే నెల మొదటి వారం నుంచి సమ్మర్ క్యాంపులు ప్రారంభిస్తారు. ఎన్ని శిబిరాలు నిర్వహిస్తాం, ఎలాంటి అంశాలను నేర్పుతాం, ఎంతమేర నిధులు అవసరం, తదితర వివరాలతో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదనలు అందజేశారు. ఉదాహరణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ మధ్యలో 12 రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, 15,000 మంది ప్రయోజనం పొందుతారని, అందుకు సుమారు రూ.50 లక్షలు ఖర్చు అవుతాయని ప్రతిపాదించారు. కొందరు కలెక్టర్లు చొరవ తీసుకొని ఇప్పటికే కార్యక్రమాలు స్టార్ట్ చేశారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్టూడెంట్స్ చేతిరాత మెరుగుపడటంతో పాటు డ్రాయింగ్ కోసం సీఎస్ఆర్ నిధులతో 3, 4, 5 తరగతుల విద్యార్థులు 17,000 మందికి రెండేసి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లాల్లో ఉన్న కోచ్‌లు, వనరులు ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఏమేం నేర్పవచ్చో కలెక్టర్లు ప్రతిపాదించారు. క్యారమ్స్, చదరంగం, లూడో, స్కిప్పింగ్, వైకుంఠపాళి తదితర ఆటలు, పెయింటింగ్ సాధన, డ్రాయింగ్, కాగితాలతో బొమ్మలు తయారు చేయడం, చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు, యోగా, కర్రసాము, డ్రాయింగ్, చదరంగం, నృత్యం, సంగీతం, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్? తదితర అంశాలను నేర్పుతామని ప్రతిపాదించారు.



# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతిని నెలకొల్పాలి

**నల్లగొండ (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్ కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను ఆపివేసి, శాంతిని నెలకొల్పాలని వామపక్ష పార్టీల నాయకులు, సామాజిక ప్రజా సంఘాల నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బలగాలను వెనక్కి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ మారణకాండకు వ్యతిరేకంగా స్థానిక నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, సిపి(ఐ)ఎం పార్టీ ప్రతినిధి చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పనిగట్టుకొని హింసకు తెరలేపడం సరైంది కాదన్నారు. ఈ దేశంలోని అడవులలో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆదివాసులను అంతం చేయడానికి పూనుకున్నదని విమర్శించారు. అడవులను కాపాడుతున్న ఆదివాసీలను ఏరివేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. దేశ సంపదను కాపాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు దుర్మార్గమన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడగు నాగార్జున మాట్లాడుతూ మేధావులు, బుద్ధి జీవుల సూచన మేరకు సాయిధ పోరాటాన్ని ఎంచుకున్న మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.

# కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం

- రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ శ్రీనివాస్

**ఏటూరునాగారం, ఏప్రిల్ 27(జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తనతో కలిసి పనిచేసిన ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గంట ఠాగూర్ ను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన కమిటీ యువ అధ్యక్షుడు ఠాగూర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయనను పరామర్శించి రూ 7వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, కష్టాలల్లో ఉన్న పార్టీలోని ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సర్దార్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రియాజ్, తిప్పనపల్లి రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి వాసం రాంబాబు, మండల యూత్ కోశాధికారి పొలం వెంకటేష్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



# గంపెడాశతో గంగపుత్రులు





**కాళేశ్వరం, ఏప్రిల్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం లోని కాళేశ్వరం వద్ద నదిలో పడవలను నడుపుతూ ఇరు రాష్ట్రాల ప్రయాణికులను గమ్యం చేరుస్తూ తమ జీవనం కొనసాగించిన గంగపుత్రులు అంతరాష్ట్ర వంతెన నిర్మాణం తర్వాత వారి ఆదాయాన్ని కోల్పోయారు. గత సరస్వతి పుష్కరాలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి గా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో పర్యాటక శాఖ రాయితీ తో ఒక బోటు ను గంగపుత్రులకు అందించారు. తదుపరి గంగపుత్రులు ఏకమై కొన్ని స్పీడ్ బోట్లను కొనుక్కొని తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. దాదాపు 80 కుటుంబాల వారు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. మిగతా వారు ఇతర పనులు చేస్తున్నారు. వీరు ప్రతి సంవత్సరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాలలో దేవుని పల్లకి మోస్తూ ఇతర పనులలో కూడా ఆలయానికి సహకరిన్తున్నారు. మహిళలు ఆలయం లో జరిగే ఉత్సవాలలో ప్రసాద తయారీ, అలంకరణ ఇతర పనులలో పాల్గొంటారు. ప్రస్తుతం వీరు కుంభమేళా తరహాలో కాళేశ్వరం లో జరగబోవు సరస్వతి పుష్కరాలలో తమకు లాభం చేకూరుతుందని గుప్పెడంత ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే ప్రతి పుష్కరాలకు ఈ పడవలను అధికారులు తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. ఈ సంవత్సరం జరగబోవు పుష్కరాలలో అయిన తమకు పడవలు నడుపుకొనే అవకాశం కల్పించాలని వారు ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా గంగ పుత్రులు పిట్టల బాబు, ముంగి శ్రీనివాస్, గారే లక్ష్మయ్య, సడవలి తదితరులు జనం సాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ ప్రతి పుష్కరాలకు తమ పడవలు నిలిపివేసి తమ ఆదాయాన్ని అధికారులు గండి కొడుతున్నారని, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సరస్వతి పుష్కరాలలో నైనా తమకు పడవలు నడిపే అవకాశం కల్పించాలని , కుంభమేళా తరహాలో ఇక్కడ కూడా యాత్రికులను, భక్తులను స్నాన ఘట్టాలకు చేరవేసి తమ ఆదాయాన్ని పెంచుకునే విధంగా అధికారులు, ప్రభుత్వం, స్థానిక మంత్రి తమకు సహకరించాలని వారు కోరుతున్నారు.

# దొడ్డు వడ్లను కాంటాలు వేయండి

- రైతులు నిరాశ



**పర్వతగిరి, ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ యందు నవచైతన్య సంఘం ఐకెపి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఈనెల 18న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటి నుండి కేవలం సన్న వడ్లను మాత్రమే కొనుగోలు చేస్తూ కాంటాలు నిర్వహిస్తున్నారని, దొడ్డు వడ్లను కాంటాలు నిర్వహించకుండా పట్టించుకోవడంలేదని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 1010 రకం వరి ధాన్యాన్ని పండించామని, తాలు లేకుండా, తేమ శాతాన్ని చూసుకున్న తర్వాతనే కళ్ళం నుండి మార్కెట్ యార్డ్ యందు దాదాపు 2500 బస్తాల వరకు నిలువ చేసుకొని ఉన్నామని, అకాల వర్షాలకు భయభ్రాంతులకు గురవుతున్నామని, ఐకెపి వారు ఇచ్చిన నల్ల పరదాలను కప్పుకొని భద్రపరచామని, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి దొడ్డు వడ్లు కొనుగోలు కేంద్రాలకు మిల్లులను అలాట్మెంట్ చేసి సకాలంలో రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ విషయంలో ఐకెపి ఎపిఎం తోట కృష్ణమూర్తిని వివరణ కోరగా ప్రస్తుతానికి సన్న వడ్లకు మాత్రమే మిల్లులు అలాట్మెంట్ అయ్యాయని, దొడ్డువడ్లకు మిల్లు అలాట్మెంట్ అయిన వెంటనే కాంటాలు నిర్వహిస్తామని, మండల కేంద్రంతో పాటు అన్నారం షరీఫ్ గ్రామంలో కూడా రైతులు దొడ్డు వడ్లను కంటాలు వేయాలని కోరుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో అక్కల కిష్టయ్య కొమ్ము శ్రీనివాస్ ఫైండ్ల రవి సకినాల విజయ్ కుమార్ వర్ధిని పాపారావు చిదురు వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# పుష్కరాలలో ప్లాస్టిక్‌పై నియంత్రణ సాధ్యమేనా?



**కాళేశ్వరం (జనంసాక్షి) :** ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే సరస్వతి నది పుష్కరాలు ఈ సంవత్సరం తెలంగాణలోని ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం లో జరగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఈ పుష్కరాలలో ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమేనా అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరిగిన కుంభమేళాలో ప్రపంచ నలుమూలల నుండి కోట్ల మంది భక్తులు పాల్గొనగా ప్లాస్టిక్ వినియోగం పై అవగాహన కల్పించి వాటి వాడకాన్ని తగ్గించారు అక్కడి అధికారులు . అలాగే పుష్కరాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ అధికారులు పలుమార్లు ఉత్తరప్రదేశ్ ను సందర్శించి అక్కడి అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్లాస్టిక్ నియంత్రణ చర్యలను పూర్తిస్థాయిలో జరిపేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. అయితే ఇప్పటికే దేవాలయంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషేధం లో ఉండగా అది పూర్తి స్థాయిలో కొనసాగడం లేదు. గతంలో జరిగిన గోదావరి, ప్రాణహిత పుష్కరాలలో అధికారులు అన్ని షాపుల యజమానులకు అవగాహన కల్పించి ముందుగానే ప్లాస్టిక్ కవర్ల వినియోగం పై తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ పుష్కరాలకు కూడా అధికారులు ప్లాస్టిక్ వినియోగం పై భక్తులకు ,గ్రామస్తులకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆలయం లో కూడా ప్లాస్టిక్ కవర్ల నిషేధం పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి వాటిని నియంత్రించాలని ప్రజలు ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బంజారాహిల్స్‌లో 1.5 కేజీల గంజాయి స్వాధీనం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని ఉదయ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బి.రఘు(25) సమీపంలోని స్టార్ ఆస్పత్రిలో కార్డియాలజీ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవల రఘుకు మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన షేక్ అమ్జాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను గంజాయి తీసుకువచ్చి ఇస్తానని, దాన్ని కస్టమర్లకు అమ్మితే భారీగా లాభాలు వస్తాయని అమ్జాద్ చెప్పడంతో గత కొంతకాలంగా రఘు గంజాయి విక్రయిస్తున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెం 13లోని శ్మశానవాటిక, అంబేద్కర్ నగర్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న హెచ్ న్యూ విభాగం సిబ్బంది, బంజారాహిల్స్ పోలీసులు నిఘా పెట్టారు. నిందితుడు శ్మశానవాటికలోకి రాగానే అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించగా బ్యాగులో 1.5 కేజీల గంజాయి లభ్యమయింది. అదుపులోకి తీసుకుని విచారించగా తాను అమ్జాద్ వద్ద నుంచి గంజాయి కొని చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి అమ్ముతున్నానని, రూ.250 నుంచి రూ. 300 చొప్పున విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడు రఘు వద్దనుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు రఘుతో పాటు షేక్ అమ్జద్ మీద ఎన్డీపీఏఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితుడు రఘును అరస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.




పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్ నుంచి రవీంద్ర భారతి వరకు యునిటీ మార్చ్ నిర్వహించారు.
- హైదరాబాద్, ఏప్రిల్ 27 (జనంసాక్షి)

# యువ వికాసం యూనిట్లకు బ్యాంకు లింకేజీ

- తప్పనిసరి చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు నిర్ణయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాయితీ పోను మిగతా వాటా భరించేందుకు లబ్ధిదారు సిద్ధంగా ఉన్నా, యూనిట్లు మంజూరు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం అమల్లో పారదర్శకత పెంచేందుకు, నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఇటీవల ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన తరువాత అర్హుల జాబితాను బ్యాంకర్లకు పంపించి, ఆ యూనిట్లకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి చేయాలని సూచనలు చేసింది.

### బ్యాంకు లింకేజీ తప్పనిసరి

రాజీవ్ యువ వికాసం పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేటగిరీ-1 కింద రూ.50,000 విలువైన యూనిట్‌కు నూరు శాతం రాయితీ ఉంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఈ రుణాన్ని అమలు చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేటగిరీ-2, 3, 4లలో యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, లబ్ధిదారు వాటా కింద బ్యాంకు రుణం తీసుకోవాలి. కేటగిరీ-2 కింద యూనిట్ వ్యయం రూ.లక్షలో 10 శాతం, కేటగిరీ-3 కింద రూ.లక్ష - రూ.2 లక్షల వరకు 20 శాతం, కేటగిరీ-4 కింద రూ.2 లక్షలు-రూ.4 లక్షల వరకు 30 శాతం చొప్పున బ్యాంకు లింకేజీ తప్పనిసరి.

### బ్యాంకు రుణం ఇవ్వాలని ఆదేశాలు

గతంలో బ్యాంకు రుణాలు సకాలంలో మంజూరు కాకపోవడం, తప్పనిసరిగా లబ్ధిదారు ఇచ్చే రుణానికి పూచీకత్తు పెట్టాలని చెప్పడంతో కొందరికి యూనిట్లు మంజూరు అయినా, రాయితీ విడుదల అయినా పథకం అమలు కాలేదు. ఈ తరహా పరిస్థితులను అధిగమించేందుకు యూనిట్ వ్యయంలో రాయితీ తీసివేయగా, మిగతా మొత్తాన్ని సొంతంగా భరిస్తే యూనిట్ మంజూరు చేయాలన్న చర్చ జరిగింది. ఈ తరహా విధానంతో పథకం లక్ష్యం నెరవేరదని, స్వయం ఉపాధి పథకాలు పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం భావించింది. పథకం కింద ఎంపిక అయిన వారికి తప్పనిసరిగా బ్యాంకు రుణం ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల బ్యాంకర్లను ఆదేశించారు. రుణం కింద బ్యాంకులు రూ.1,600 కోట్లు భరిస్తే దాదాపు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు అవుతాయని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటికే బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కల్యాణ లక్ష్మి, ఉపకారవేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,639.81 కోట్లు విడుదల చేసింది. కల్యాణ లక్ష్మికి రూ.2,173 కోట్లు, బీసీ, ఈబీసీ విద్యార్థుల పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలు, బోధన ఫీజుల కోసం రూ.2,386 కోట్లు, బీసీ విదేశీ విద్యా నిధి పథకానికి రూ.80 కోట్లు ఇచ్చింది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
28 ఏప్రిల్ 2025
తెలంగాణ

# ప్రభుత్వాలనే ధిక్కరించే కార్పొరేట్ దిగ్గజాలు

## కొమ్ములు వంచిన ఈయూ

ప్రపంచంలో గత కొన్ని సంవత్సరాలుగా ఓ అవాంఛనీయ పరిస్థితులు తలెత్తాయి. కొన్ని కార్పొరేట్ దిగ్గజ సంస్థలు,ఆయా దేశాల్లో ప్రభుత్వాల నుండి అనేక రాయితీలు పొందుతున్నాయి. కొద్దికాలం లోనే అవి లక్షల కోట్ల డాలర్లకు పడగలెత్తాయి.ఈ పరిణామాలు సంతోషించ తగ్గవే. అయితే ఈ కార్పొరేట్ సంస్థలు ఆ ప్రభుత్వ చట్టాలకు లోబడాల్సి ఉంటుంది.నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.కానీ ఈ కార్పొరేట్ శక్తులు ఆర్థికంగా, రాజకీయంగా బలపడి చివరికు ఆ ప్రభుత్వాలనే శాసించే స్థితికి చేరుకున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా టెక్ దిగ్గజాలైన యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లపై డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘన కారణంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ) భారీగా జరిమానాలు విధించింది. కొంత ధైర్యాన్ని చూపినట్టు చెప్పాలి. యాపిల్‌పై 570 మిలియన్ డాలర్లు (రూ.4,868 కోట్లకు పైగా) జరిమానా విధించగా, మెటాపై దాదాపు 230 మిలియన్ డాలర్లు (రూ.1,965 కోట్లు) జరిమానా విధించింది. వచ్చే జూన్ చివరినాటికి యాపిల్ తన యాప్ స్టోర్ నిబంధనలను ఈయూ చట్టాలకు అనుగుణంగా వెంటనే మార్చకపోతే ప్రతి రోజు వారీగా జరిమానాలు పడతాయని ఈయూ హెచ్చరించింది. గత సంవత్సరం నోటీసులు అందిన తర్వాత మెటా యాప్ స్టోర్‌లో మార్పులు చేసినందున, పాత తప్పులకు మాత్రమే ఇది జరిమానా విధించింది. అయితే, ఈయూ తమపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని యాపిల్, మెటా ఆరోపించాయి. వాస్తవానికి, ఈ జరిమానాలు కూడా తక్కువగానే ఉన్నాయని యూరప్ ప్రజల్లో భావన ఉంది.

గత సంవత్సరం, మ్యూజిక్ స్ట్రీమింగ్ రంగంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు యాపిల్‌పై 2.05 బిలియన్ డాలర్లు (రూ.17,500 కోట్లకు పైగా), మెటాపై 900 మిలియన్ డాలర్లు (రూ.7,685 కోట్లు) జరిమానాలు విధించనున్నట్లు ఈయూ ప్రకటించింది. సంస్థల వివరణలు పరిశీలించిన తరువాతే తుది తీర్పు వెలువరించింది. అయినప్పటికీ, ఈ తీర్పును అన్యాయంగా అభివర్ణిస్తూ కంపెనీలు భూమి-ఆకాశం కంపించేలా గగ్గోలు పెడుతున్నాయి.

ప్రస్తుత గ్లోబల్ పరిస్థితుల్లో ఈ స్థాయి జరిమానాలు విధించడానికి కొంత ధైర్యం కావాల్సి ఉంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా




బాధ్యతలు చేపట్టిన తరువాత అమెరికా తోపాటు ప్రపంచం మొత్తంగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

అమెరికన్ కంపెనీలకు అడ్డు వచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరిస్తున్నాడు. ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బహిరంగ విమర్శలు చేశారు. డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ) వంటి చట్టాలు భారీ సంస్థల అభివృద్ధికి అడ్డుగా మారుతున్నాయని, యూరప్ ఎక్కువ నియంత్రణలతో అభివృద్ధిని అడ్డుకుంటుందని వాన్స్ ఆరోపించారు. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) పైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈయూరపియన్ నియంత్రణలు వ్యాపార విస్తరణకు, లాభదాయకతకు అడ్డుగా ఉన్నాయని అమెరికన్ కంపెనీలు గవర్నమెంట్‌కు ఫిర్యాదులు చేస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఈయూ తాజా నిర్ణయం యొక్క నేపథ్యం స్పష్టంగా కనిపిస్తుంది.

అమెరికా తన భారీ కార్పొరేట్ సంస్థలను ప్రేమించుకోవచ్చు. కానీ ఇతర దేశాలలో ఆ కంపెనీలు ప్రజలను దోచుకుంటున్నా, ప్రజాధనం పీల్చి పిప్పి చేస్తున్నా ఎవరూ ప్రశ్నించకూడదని అనడం భావ్యం కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో మ్యూజిక్ యాప్స్ తదితర అంశాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు భావించిన వినియోగదారులు ప్రత్యక్షంగా కొనుగోలు చేయగల మార్గాన్ని బహిర్గతం చేయకుండా అభివృద్ధికి దారులను నిరోధిస్తోంది. మరోవైపు, మెటా తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాప్స్ ఉపయోగించాలంటే వ్యక్తిగత డేటాను ఉపయోగించేందుకు అనుమతి ఇవ్వాలని వినియోగదారులపై ఒత్తిడి తెస్తోంది. అంగీకరించనివారికి యాప్‌లో కమర్షియల్ ప్రకటనలు చూపించడం, లేదంటే... నెలవారీ చందా డిమాండ్ చేస్తూ తోంది. ఆధునిక సాంకేతిక యుగంలో, భారీ సంస్థలు ప్రజలను తమ మీద ఆధారపడేలా చేసి, డబ్బు చెల్లించాలా లేక చనిపోవాలా అన్నట్టుగా ప్రవర్తిస్తున్నాయి.

ఇలాంటి సమయంలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం గట్టి హెచ్చరికలు ఇచ్చింది. సంస్థలు నిబంధనలు ఉల్లంఘిస్తే వారి గ్లోబల్ టర్నోవర్‌లో 10 శాతం జరిమానాగా, పునఃరావృతం అయితే 20 శాతం జరిమానాగా విధించాలని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. ట్రంప్ కోపాన్ని ఎదిరించి, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను గౌరవించడం మధ్య సమతుల్యత సాధించేందుకు యూరోపియన్ యూనియన్ ప్రయత్నిస్తోంది. ప్రజలకూ చర్యలు తీసుకుంటున్నట్లు చూపించాలనుకుంటోంది. అయినా, ఈయూ మన కంటే మెరుగ్గానే ఉంది. భారత్‌లో కార్పొరేట్ అరాచకాలను నియంత్రించాల్సిన పోటీ సంఘం (సీసీఐ) పెద్దగా గట్టి చర్యలు తీసుకోలేకపోతోంది. గూగుల్ మీద కొన్ని చర్యలు తీసుకున్నా, అది సరిపోదు. ప్రభుత్వాలు వినియోగదారుల హక్కులను, స్థానిక పరిశ్రమలను కాపాడే విధంగా కఠినమైన చట్టాలు తీసుకురావాలి. అస్పష్ట వ్యాపార ధోరణులపై గట్టి చర్యలు తీసుకోవాలి. కంపెనీలు భారీ లాభాలను కొల్లగొట్టి ప్రభుత్వాలను కూడా ప్రభావితం చేసే స్థాయికి చేరడం ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. అందుకే, యూరోపియన్ యూనియన్ చర్యలకు అంతా స్వాగతం పలకాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### సంస్కృతాన్ని అమలుపరిస్తే

# తెలుగు కనుమరుగవుతుందా?



తెలంగాణ రాష్ట్రంలో ఈమధ్య తెలుగు భాషా పండితులు, ఆచార్యులు మాధ్యమిక విద్యలో సంస్కృతాన్ని అమలుపరిస్తే తెలుగు కనుమరుగు అవుతుందని విస్తృత ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు కోట్ల 85 లక్షల మంది ప్రజలు తెలుగు భాషను మాట్లాడుతున్నారు. ఇందులో ఇంటర్ మొదటి సంవత్సరంలో నాలుగు లక్షలు, రెండవ సంవత్సరం ఐదు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కలిపితే 9 లక్షల మంది విద్యార్థులు , ఇందులో తెలుగు అరబిక్ హిందీ ద్వితీయ భాషలను అభ్యసించే విద్యార్థులు కాక మిగిలిన వారు సంస్కృతాన్ని ఎన్నిక చేసుకుంటారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు సంస్కృతాన్ని ఎంపిక చేసుకుంటారు. 5 లక్షల మంది విద్యార్థులు సంస్కృతాన్ని ఎంపిక చేసుకుంటే తెలుగు భాష కనుమరుగు అవుతుందని చెప్పడం శోచనీయం. తెలుగు పత్రికలు, దూరదర్శన్, సినిమాలలో తెలుగు భాష ఎంత ఉంది? ఆ రంగాలలో సంస్కృతం లేదు కదా, మరి తెలుగు ఎందుకు రావడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో ఎక్కడ కూడా పదవ తరగతి వరకు సంస్కృతాన్ని బోధించరు. మరి పదవ తరగతి విద్యార్థులకు తెలుగు ఎందుకు రావడం లేదు? ప్రభుత్వం తెలుగు మీడియం పాఠశాలలను మూసి వేస్తున్నప్పుడు నోరు మెదపని మేధావులు, తెలుగు కనుమరుగు కావడానికి ఆంగ్ల మీడియం కారణమని తెలుసుకో లేకపోవడం విచిత్రం. డీమ్డ్ యూనివర్స్ సిటీలలో భారతీయ భాషలను అధ్యయనం చేయకుండానే డిగ్రీలను తీసుకుంటున్న విద్యార్థులు ఉన్నారు. తెలుగు భాష కనుమరుగు కావడానికి కారణాలను అన్వేషించకుండా, తెలుగు భాషకు పరిపుష్టిని కలిగించే సంస్కృతాన్ని ద్వేషించడం ఎంతవరకు సమంజసం. మేధావుల, తెలుగు భాష పండితుల వాదనలు గమనిస్తే వారికి ఉన్నది సంస్కృతం పై ద్వేషం తప్ప, తెలుగును రక్షించాలనే తపన కనబడడం లేదు. ఇక మార్కుల విషయానికి వస్తే ఒక ప్రసిద్ధ పండితుడు తెల్ల కాగితం నల్లగా చేస్తే మార్కులు వస్తాయని చెప్పడం, ఉపాధ్యాయ లోకాన్ని అవమానపరచడమే. పదవ తరగతి వరకు తెలుగు రాని విద్యార్థి సంస్కృతాన్ని వద్దనుకుంటే ఫ్రెంచి, జర్మనీ భాషలను ఎంపిక తీసుకుంటాడు తప్ప , తెలుగును కచ్చితంగా తీసుకుంటాడనే నమ్మకం లేదు. ప్రభుత్వ కళాశాలలలో ఆర్థిక స్తోమత లేనివారే చదువుతున్నారు. వారికి సంస్కృతాన్ని అధ్యయనం చేసే అవకాశం లేకపోవడంతో వారు ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థుల కంటే వెనుక ఉండడం జరుగుతుంది. సంస్కృతాన్ని వ్యతిరేకించే మేధావులు ఎవరి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం విద్యారంగం అంతా ప్రైవేట్ రంగంలోనే ఉంది. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్యాయం చేయడం తగదు. సంస్కృతాన్ని బోధించే అధ్యాపకులకు కూడా మాతృభాష తెలుగే అని గ్రహించాలి. తమిళనాడులో తమిళం ప్రథమ భాషగా ఉంది. అదేవిధంగా తెలంగాణలో తెలుగును ప్రథమ భాషగా చేయాలనే లక్ష్యంతో, చిత్తశుద్ధితో తెలుగు భాషా మేధావులు, పండితులు, సంఘాలు ప్రయత్నాలు చేస్తే తప్ప తెలుగు భాష మనుగడ ఉండదని గ్రహించి ఆ దిశగా అడుగులు వేయాలని, భాషా పండితులు, విద్యార్థుల మధ్య భాష ద్వేషాలు పెంచడం సమాజానికి హితం కాదని గ్రహించాలి.

వేదాంతం హరికుమార్
కాకతీయ విశ్వవిద్యాలయం


## ప్రణామాలు



భూగోళం భగభగ మండిపోతున్నది
రసాయనాలను భరించలేకున్నది
తాను శ్వాసించలేక జంకుతున్నది
కృత్రిమ ఎరువులతో సతమతమవుతున్నది
ప్లాస్టిక్ భూతాలతో సారాన్ని కోల్పోయింది
పసలేని పెంటలతో రోగగ్రస్తురాలైనది
వసుధ సహజ పంటలను అందించలేక
నిస్సారమైనది
మన ఆరోగ్యాలకు భరోసా కానంటున్నది
భూమిగా తరువైన మేరువైన
భారమని భావించనంటున్నది
అఖిల విశ్వానికి బంగారు వేదిక నేనన్నది
సహనంలో తనను మించిన దేవతలే
లేరంటున్నది
మూలికలకు సుగంధ ద్రవ్యాలకు నేలతల్లి
నన్నది
అవనిగా మానవ మనుగడకు జీవనాధార
మన్నది
కురిసే వర్షానికి మట్టి ముద్దగా మారుతున్నది
కమ్మని వాసనలతో మనని రంజింప చేస్తున్నది
మేలైన పంటల నిచ్చే ధరణిగా
విలసిల్లుతున్నది
పుడమిని గౌరవించడం మన బాధ్యత
సకల జీవరాసులకు నివాస ప్రాణదాత
పచ్చని ప్రకృతిని ప్రసాదించే కారుణ్య మాత
విధ్వంసాన్ని అరికట్ట లేకపోతే మాసిపోనుంది
చరిత
భూమిని కాపాడుకుందాం కలుషిత వ్యర్థాలను
తగుల బెట్టుదాం
పర్యావరణానికి ప్రమాణాలు పలుకుదాం
విశ్వంభరాన్ని శాంతింప చేద్దాం

రచన..
నామిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చెల్

# నిజజీవితంలో హీరోలకు విలువేది!



ఏ రంగంలోనైనా నిజజీవితంలో హీరోలకు నిజమైన మనుషులకు విలువేది. సాటివాని పట్ల కనీసం సానుభూతి లేని, స్వచ్ఛందంగా మనసుతో చేసే సేవకు ఏ మాత్రం గుర్తింపు లేదు ఇక్కడ సేవా భావం అనేది గుర్తింపు కోసం కానప్పటికీ వారి పట్ల నిర్లక్ష్యం సమాజం భరించలేని పరిస్థితి ఉన్నది రాజకీయాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నది ఎంతోకాలంగా ఆ పార్టీలో పని చేస్తూ సర్వం కోల్పోయిన తర్వాత కూడా వారి సేవకు విలువలేదు దేశం లో దాదాపు అన్ని రంగాలలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉన్నదంటే అతిశక్తి కాదు నిజానికి రియల్ హీరోలు మీరే అవుతారు. వీరి కోసం ప్రత్యేకంగా ఏప్రిల్ 28 తేదీని నిర్ధారించి ఉన్నారు రోజు ఇలాంటి రియల్ హీరోలు కోసం సభలు సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు కష్టాల్లో ఉన్న పరిణి వారిని ఆదుకోవడం తోపాటు వివిధ దేశంలో ఆపత్తు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారికి సహాయం అందించడం అలాగే తమ తమ అసోసియేషన్ల ద్వారా ఒక కష్టాల్లో ఉన్న సమూహానికి సహాయం చేయుట అందించడమే పరమావధిగా పెట్టుకుంటారు అలాంటి వారికి కూడా ఈ సందర్భంగా రియల్ హీరో లా పేరిట సన్మాన కార్యక్రమం నిర్వహించి వారు చేసే సేవకు గుర్తింపును సమాజంలో ఇవ్వడం జరుగుతుంది. నిజానికి సాటివారి పట్ల కొద్ది గొప్ప సానుభూతితో ప్రేమతో సహాయం అందించే వారి కన్నా మెచ్చినవారు ఎవరుంటారు రాజకీయ పార్టీల స్వార్థం కోసం ఎన్నికల కోసం ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసే సహాయ కార్యక్రమం సమాజానికి ఎందుకో సమో తెలియనిది కాదు కాబట్టి ఇలాంటి వారికి అప్పుడప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా సన్మానం చేస్తూ ఉంటుంది పలు అవార్డులు రివార్డులు కూడా ఇస్తూ ఉంటారు అందరూ భాగంగా నే ఇప్పుడు ప్రభుత్వం కూడా రియల్ హీరోలను గుర్తిస్తున్నా యి. రచయితలు కవులు కతకులు ప్రతి ఒక్కరికి నిజమైన సేవకులు గా గుర్తింపును ఇవ్వక తప్పడం లేదు ఎందు కంటే సమాజం ఊరుకోవడం లేదు క్రీడారంగం లోను ఇలాంటివారు ఉన్నారు కూడా ఇలాంటివారు ఉన్నారు జర్నలిస్టులో కూడా ఇలాంటివారు ఉన్నారు సమాజానికి నిజమైన సేవ చేసే వారిని తప్పనిసరిగా గుర్తించి విలువలు ఇవ్వాల్సి ఉన్నది ఇప్పుడు కొత్తలో కొంతైనా రానున్న రోజు లలో ఇలాంటి నిజమైన సేవ కలిగే వారిని గుర్తించే అవకాశం ఉంది కొన్ని చోట్ల వీరిని ముందు పెట్టు కొని రాజకీయ పార్టీలు అవసరాలు తీసుకుంటు న్నాయి. అయితే రియల్ హీరోలు ఇప్పుడు వారి వెంట వెళ్లాలా వద్దా అనేది వారిని నిర్ణయించుకోవాలి అంతేగాని రాజకీయ నాయకుల ప్రయోజనా లకు లొంగుకున్నా నిర్ణయం తీసుకోవాల్సింది వారే ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రయోజనాల సంగతి పక్కన పెడితే సమాజంలో స్వచ్ఛంద సేవలకు గతంలో చేసిన వారి నిస్వార్థ పనులకు విలువ ఉండకుండా పోతుంది కాబట్టి ఇలాంటివారు రాజకీయ నాయకుల ఉచ్చులో పడకుండా జాగ్రత్తపడాలి. నిజజీ వితంలో నిజమైన సేవకుల కు ఈనెల 28 న రియల్ హీరోల దినోత్సవం శుభాకాంక్షలు.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# రైతు సామాజిక ఉద్యమం- వ్యవసాయ విధానంతో ముడిపడి ఉంది!

రైతు ఉద్యమం అనేది వ్యవసాయ విధానంతో ముడిపడి ఉన్న ఒక సామాజిక ఉద్యమం, ఇది రైతుల హక్కులను ప్రకటిస్తుంది. మానవ చరిత్ర అంతటా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన అనేక రైతు తిరుగుబాట్లకు గుర్తుగా రైతు ఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. భారతదేశంలో రైతు ఉద్యమాలు రైతులు సామాజికంగా, ఆర్థికంగా దిగజారిపోతున్నారని ఉద్యమించారే తప్ప రైతు ఏనాడు ఎవరిని మోసం చేయలేదు తన రెక్కల కష్టం మీదనే ఆధారపడి జీవించడమే రైతు యొక్క ప్రధాన ఉద్దేశం. కడుపుకు అన్నం పెట్టే రైతు కడుపు మండి ఉద్యమిస్తున్నాడే తప్ప ఎవరికి వ్యతిరేకంగా చేసే పోరాటం కాదు. రైతు పెట్టిన పెట్టుబడి తిరిగి రాక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా, ఏ ప్రభుత్వం కూడా రైతుల పట్ల సానుభూతి చూపెట్టిన దాఖలాలు లేవు.

భారతదేశంలో రైతు ఉద్యమానికి చాలా సుదీర్ఘ చరిత్ర ఉంది, అది నేటి వారి సామాజిక, ఆర్థిక స్థితిని పెద్ద ఎత్తున తీర్చిదిద్దింది. దీని మూలాన్ని వలసరాజ్యాల యుగం నుండి గుర్తించవచ్చు, దేశవ్యాప్తంగా రైతులు తమపై జరిగిన దురాగతాలకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికి పెద్ద సంఖ్యలో సమీకరించారు. అధిక పన్ను విధానం, స్పష్టమైన దోపిడీ, చెల్లింపులు తక్కువగా ఉండటం మరియు వారి భూమిపై హక్కులను కోల్పోవడం వంటి సమస్యలపై వారు తిరుగుబాటు చేశారు. చంపారన్ (1917), ఖేడా సత్యాగ్రహం (1918), బార్డోలి సత్యాగ్రహ ఉద్యమం (1925), తేభాగ ఉద్యమం (1946-1947) మరియు దక్కన్ అల్లర్లు (1875) వంటి అనేక రైతు ఉద్యమాలు జరిగాయి. ఈ ఉద్యమాలు 1947లో భారతదేశ స్వాతంత్ర్యానికి దారితీసిన మొత్తం జాతీయవాద ఉద్యమంలో రైతులను సమీకరించాయి. ప్రారంభ రైతు ఉద్యమాలు సాధారణంగా భూస్వామ్య, అర్ధ భూస్వామ్య సమాజాలు, ఫలితంగా హింసాత్మక తిరుగుబాట్లు ఏర్పడ్డాయి. సామాజిక ఉద్యమాల నిర్వచనాలకు తగిన ఇటీవలి ఉద్యమాలు సాధారణంగా చాలా తక్కువ హింసాత్మకంగా ఉంటాయి, వాటి డిమాండ్లు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు, వ్యవసాయ కార్మికులకు మెరుగైన వేతనాలు, పని పరిస్థితులు , వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంపై కేంద్రీకృతమై ఉన్నాయి.

వలస భారతదేశంలో, కంపెనీ పాలన కాలంలో యూరోపియన్ వ్యాపారులు , ప్లాంటర్ల ఆర్థిక విధానాలు రైతు తరగతిపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి, భూస్వాములు , వడ్డీ వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నప్పుడు వారిని రక్షించాయి. రైతులు అనేక సందర్భాల్లో ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. బెంగాల్‌లోని రైతులు ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకుని నీలిమందు పండించాలనే బలవంతానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.రాజకీయ శాస్త్రవేత్త ఆంథోనీ పెరీరా రైతు ఉద్యమాన్ని "రైతులతో (చిన్న భూస్వాములు లేదా పెద్ద పొలాల్లోని వ్యవసాయ కార్మికులు) కూడిన సామాజిక ఉద్యమంగా నిర్వచించారు, సాధారణంగా ఒక దేశం లేదా భూభాగంలో రైతుల పరిస్థితిని మెరుగుపరచాలనే లక్ష్యంతో ప్రేరణ పొందింది". వలసరాజ్యాల కాలంలో భారతదేశంలో అనేక రైతు ఉద్యమాలు తలెత్తాయిహ్రా వివిధ బ్రిటిష్ వలస పాలనా పరిపాలనల ఆర్థిక విధానాలు సాంప్రదాయ చేతివృత్తుల పరిశ్రమల క్షీణతకు దారితీశాయి. ఈ విధానాలు భూములలో యాజమాన్య మార్పు, భూమి రద్దీ, భారతదేశంలోని రైతు వర్గాలలో అప్పుల పెరుగుదలకు దారితీశాయి. ఇది వలసరాజ్యాల కాలంలో రైతు తిరుగుబాట్లకు, వలసరాజ్యాల అనంతర కాలంలో రైతు ఉద్యమాల అభివృద్ధికి దారితీసింది.1929లో బీహార్ ప్రావిన్షియల్ కిసాన్ సభ (బిపికేఎస్)ను ఏర్పాటు చేసిన స్వామి సహజానంద్ సరస్వతి నాయకత్వంలో కిసాన్ (రైతు) సభ ఉద్యమం బీహార్‌లో ప్రారంభమైంది, ఆయన తమ ఆక్రమణ హక్కులపై జమీందారీ దాడులకు వ్యతిరేకంగా రైతుల మనోవేదనలను సమీకరించారు.1938లో, తూర్పు ఖండేష్‌లోని పంటలు భారీ వర్షాల కారణంగా నాశనమయ్యాయి.తరువాతి సంవత్సరాల్లో, ఈ ఉద్యమం కాంగ్రెస్ నుండి వైదొలగడంతో సోషలిస్టులు, కమ్యూనిస్టుల ఆధిపత్యం పెరిగింది, 1938 హరిపుర కాంగ్రెస్ సమావేశం నాటికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన, చీలిక స్పష్టంగా కనిపించింది, మే 1942 నాటికి, జూలై 1942లో అప్పటి ప్రభుత్వం చివరకు చట్టబద్ధం చేసిన భారత కమ్యూనిస్ట్ పార్టీ, బెంగాల్‌తో సహా భారతదేశం అంతటా ఏఐకేఎస్ ను స్వాధీనం చేసుకుంది, అక్కడ దాని సభ్యత్వం గణనీయంగా పెరిగింది. డిడి కోశాంబి, ఆర్ఎస్ శర్మ ,డేనియల్ థోర్నర్‌తో కలిసి, రైతులను మొదటిసారిగా భారత చరిత్ర అధ్యయనంలోకి తీసుకువచ్చారు.పోలిష్ రైతు ఉద్యమం పోలిష్ రైతుల జీవితాల్లో మెరుగుదలలు, రాజకీయాల్లో వారిని శక్తివంతం చేయడంపై దృష్టి పెట్టింది. ఇది 19వ శతాబ్దం మధ్య నుండి 20వ శతాబ్దం మధ్యకాలం వరకు బలంగా ఉంది. జాతీయ స్థాయిలో సాపేక్షంగా తక్కువ మద్దతు ఉన్నప్పటికీ, పోలిష్ పీపుల్స్ పార్టీ అనేక స్థానిక పార్లమెంటులలో కొంత బలమైన స్థానాన్ని నిలుపుకుంది.

అయినప్పటికీ, ఈ విషయంపై జాతీయవాద ,రివిజనిస్ట్ పండిత వివరణల మధ్య వ్యతిరేక సిద్ధాంతం ఉంది. యుద్ధంలో గెరిల్లాల మావోయిస్టు భావజాలం, శ్వేతజాతి వలస రాష్ట్రంలో రైతుల మనోవేదనల మధ్య పరస్పర సంబంధం ఉందని వాదించడం ద్వారా జాతీయవాద చరిత్రకారులు రైతుల పాత్ర యొక్క అద్భుతమైన వివరణను ముందుకు తెస్తున్నారు. గెరిల్లా చొరబాటుకు ముందు రైతులు చాలా కాలంగా ఆగ్రహంతో ఉన్నారని, అందువల్ల, గెరిల్లాలు వచ్చినప్పుడు, వారి ఆలోచనలు సారవంతమైన నేలపై పడ్డాయని హేతుబద్ధం చేయడం ద్వారా వారు ఈ వాదనను సమర్థిస్తారు. అద్భుతమైన వివరణకు విరుద్ధంగా, రైతులు ఎల్లప్పుడూ ఇష్టపూర్వకంగా గెరిల్లాలకు మద్దతు ఇచ్చారని సూచించడం తప్పుదారి పట్టించేది అని రివిజనిస్ట్ చరిత్రకారులు వాదించారు, ఎందుకంటే అటువంటి వైఖరి గెరిల్లా క్రమశిక్షణా రాహిత్యం, సమాజాలలో స్థానిక పోరాటాలు, ప్రజలను సమీకరించడానికి ఒక మార్గంగా గెరిల్లా బలవంతం వంటి ఇతర కీలక అంశాలను విస్మరిస్తుంది. గెరిల్లా యుద్ధం ప్రజల సహకారంతో వృద్ధి చెందిందని వాదించడం వాస్తవం.

**2.శ్రీకాకుళం రైతు తిరుగుబాటు.**

శ్రీకాకుళం రైతు తిరుగుబాటు 1967 నుండి 1970 వరకు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో జరిగింది. 1960లలో నక్సలైట్ ఉద్యమం ప్రారంభంలో జరిగిన నక్సల్బరీ తిరుగుబాటు ఈ తిరుగుబాటుకు ప్రేరణనిచ్చింది. 1946, 1947 మధ్య జరిగిన తెలంగాణ తిరుగుబాటు భారతదేశంలో జరుగుతున్న కమ్యూనిస్ట్ ఉద్యమంపై లోతైన ముద్ర వేసింది. దీని ఫలితంగా అంతర్గత చర్చ "ఆంధ్ర సిద్ధాంతం" సూత్రీకరణ జరిగింది, దీనిలో ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన కమ్యూనిస్టులు భారత విప్లవం కొరకు కమ్యూనిస్ట్ ఉద్యమం చైనాలోని కమ్యూనిస్ట్ ఉద్యమ శైలిని అనుసరించాలని కోరారు. జూన్ 1948లో, దీర్ఘకాలిక ప్రజా యుద్ధం మావోయిజం



ఆధారంగా కొత్త ప్రజాస్వామ్యం యొక్క వ్యూహాన్ని నొక్కి చెప్పే "ఆంధ్ర లేఖ" వ్యక్తీకరించబడింది.

1968 నవంబర్ 25న, 250 మంది గిరిజన రైతులు ఒక భూస్వామి ఇంటిపై దాడి చేసి, ఆహార ధాన్యాల నిల్వలను లాక్కొని, రూ.20,000 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు , అనేక పత్రాలను తగలబెట్టారు.

1968 డిసెంబర్ 20న, బెల్లెరెగూడ గ్రామంలో 500 మంది గిరిజన రైతులతో కూడిన గెరిల్లా దళాలు 500 మంది పోలీసు అధికారులపై ఆకస్మిక దాడి చేసి, తీవ్ర నష్టాన్ని కలిగించాయి.

**3.2020-2021 భారత రైతుల నిరసన**

2020%-2021% భారత రైతుల నిరసన అనేది సెప్టెంబర్ 2020లో భారత పార్లమెంట్ ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన నిరసన.వ్యవసాయ బిల్లులు అని పిలువబడే ఈ చట్టాలను అనేక రైతు సంఘాలు, ప్రతిపక్షానికి చెందిన రాజకీయ నాయకులు "రైతు వ్యతిరేక చట్టాలు"గా అభివర్ణించారు, ఎందుకంటే రైతు-వ్యాపారి వివాదాలను న్యాయ వ్యవస్థకు బదులుగా ఎస్డిఎంకి తీసుకెళ్లినందున ఇది రైతులను "కార్పొరేట్ల దయ" వద్ద వదిలివేస్తుందని అన్నారు. కార్పొరేట్లు ధరలను నియంత్రించలేరని నిర్ధారించుకోవడానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) బిల్లును రూపొందించాల ని నిరసనలు డిమాండ్ చేశాయి .అయితే, రైతులు తమ ఉత్పత్తులను నేరుగా పెద్ద కొనుగోలుదారులకు విక్రయించడానికి చట్టాలు సులభతరం చేస్తాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది, నిరసనలు తప్పుడు సమాచారంపై ఆధారపడి ఉన్నాయని పేర్కొంది.సంబంధిత స్థానిక వారసత్వ సమస్యలలో రైతు ఆత్మహత్యలుహ్రా తక్కువ రైతు ఆదాయాలు ఉన్నాయి. భారతదేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఎక్కువగా స్వయం సమృద్ధిగా ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలను కలిగి ఉన్నప్పటికీ, ఆకలి, పోషకాహారం తీవ్రమైన సమస్యలుగా మిగిలిపోయాయి, ఆహార భద్రతా పారామితులలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత చెత్త దేశాలలో ఒకటిగా నిలిచింది. మునుపటి డిమాండ్లు నెరవేరకపోవడంతో 2024 భారత రైతుల నిరసన ఫిబ్రవరి 13, 2024న ప్రారంభమైంది.

1970లలో ఉద్భవించి 1980లలో మరింత ఊపందుకున్న భారతదేశంలోని రైతు ఉద్యమం భారత వ్యవసాయ సమాజంలోని కొన్ని కొత్త వైరుధ్యాలను బహిర్గతం చేసింది. వివిధ భారతీయ రాష్ట్రాల మధ్యతరగతి , ధనిక రైతులు ఎక్కువగా పాల్గొన్న ఈ రైతు ఉద్యమం భారతదేశంలో వ్యవసాయ అశాంతి చరిత్ర, సంప్రదాయంలో ఒక ప్రత్యేక దశను సూచిస్తుంది. జమీందార్లు భూస్వాములకు వ్యతిరేకంగా భూమిలేని వ్యవసాయ కార్మికులతో పాటు చిన్న, సన్నకారు రైతుల మునుపటి సమీకరణల మాదిరిగా కాకుండా, గ్రామీణ సమాజంలోని ఉన్నత స్థాయి డిమాండ్లతో ఎక్కువగా ఆందోళన చెందుతున్న రైతు ఉద్యమం, రైతుల సమీకరణ యొక్క సాపేక్షంగా దీర్ఘకాలిక సంప్రదాయం గురించి కొన్ని ఆసక్తికరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. రైతు ఉద్యమం భారతదేశంలోని రైతు ఉద్యమాల పర్యవసానమా లేదా మరింత అభివృద్ధి చెందిన దశనా లేదా గ్రామీణ సమాజంలోని భూస్వామ్య ప్రభువులకు వ్యతిరేకంగా రైతుల సమీకరణను వర్ణించే ప్రాథమిక డైనమిక్స్ యొక్క తిరస్కరణ లేదా తిరస్కరణగా పరిగణించవచ్చా అనే ప్రశ్నలు తలెత్తుతాయి.ఇక్కడ రైతులు, రైతులు అనే రెండు పదాల మధ్య వ్యత్యాసంపై ఒక గమనిక భావనాత్మక స్పష్టత కోసం అవసరం అనిపిస్తుంది. భారతదేశంలో రైతు ఉద్యమం, రైతు ఉద్యమం మధ్య వ్యత్యాసం లేదా సారూప్యతలకు సంబంధించిన చర్చల పరిధిని అర్థం చేసుకోవడానికి ఇది మరింత అవసరం. ఘనశ్యామ్ షా (1990: 32) 'రైతు' అనే పదం అస్పష్టంగా ఉన్నప్పటికీ, కుటుంబ కార్మికుల చే నిర్వహించబడే చిన్న కమతాలతో సజాతీయంగా ఉండే వ్యవసాయదారులకు, ప్రధానంగా తన కుటుంబ ప్రయోజనం కోసం ఉత్పత్తి చేసేవారికి దీనిని ఉపయోగిస్తారు అని వాదించారు. అయితే, వ్యవసాయంలో నిమగ్నమైన అన్ని తరగతుల ప్రజలను సూచించడానికి ఈ పదాన్ని విస్తృతంగా ఉపయోగించడానికి ఇష్టపడే కొంత మంది పండితులు ఉన్నారు. కానీ వివిధ తరగతుల వ్యవసాయదారులను వర్గీకరించడంలో ఇటీవలి ధోరణులను పరిశీలిస్తే, 'రైతు' అనే పదాన్ని 'ఒక పొలాన్ని కలిగి ఉన్న లేదా నిర్వహించే' మార్కెట్ కోసం ఉత్పత్తి చేసే వ్యక్తిని సూచించడానికి ఉపయోగిస్తాము. మరో మాటలో చెప్పాలంటే, రైతు అనే పదాన్ని గ్రామీణ సమాజంలోని ఆస్తిపాస్తులు మరియు బాగా స్థిరపడిన వ్యవసాయ వర్గాలను సూచించడానికి ఉపయోగిస్తారు.భారత రైతుల నిరసన అనేది ఫిబ్రవరి 13, 2024న రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలోని రైతులు ప్రారంభించిన నిరంతర నిరసనలు, రోడ్డు దిగ్బంధనాల రెండవ రౌండ్, ఇది ప్రధానంగా పంజాబ్‌లోని శంభు సరిహద్దులోఉంది .నిరసనల ప్రధాన అభ్యర్థనలలో అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పి) కోసం చట్టపరమైన హామీని పొందడం, అందరు రైతులకు రుణాలను పూర్తిగా మాఫీ చేయడం ఉన్నాయి. ఏది ఏమైనా ఈ దేశంలో రైతాంగ ఉద్యమం ఒక తాటిపై ఉద్యమిస్తే తప్ప రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే వ్యవస్థ ఇప్పటికీ లేదని చెప్పాలి. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం రైతు తాను నమ్ముకున్న భూమిని వదులుకోవడానికి సిద్ధపడుతున్నాడు అంటే రైతు ఏ మేరకు కష్టాలు ఎదుర్కొంటున్నాడు అన్న విషయాన్ని గమనించాలి. రైతు పంట పండించడం మానుకుంటే భవిష్యత్తులో ఆహార కొరత తప్పదు ప్రభుత్వాలు ఈ విషయాన్ని గమనించాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# సౌతాఫ్రికాలో బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలు

- పేదలకు బీఆర్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో వింటర్ బ్లాంకెట్ డ్రైవ్!







**హైదరాబాద్, ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** సౌతాఫ్రికాలో బీఆర్ఎస్ శాఖ బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు గుర్రాల నాగరాజు బీఆర్ఎస్ సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో జొహ్యానెస్బర్గ్ లో జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రతి చలికాలములో సౌత్ ఆఫ్రికా లోని వివిధ ప్రాంతాలలో దుప్పట్ల పంపిణీ చేస్తారు. ఈ సంవత్సరం కూడా సౌత్ ఆఫ్రికా బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో సౌత్ ఆఫ్రికా పోలీస్ సర్వీసెస్ మిడిరాండ్ పోలీస్ స్టేషన్స్ లో పంపిణీ చేశారు. సౌత్ ఆఫ్రికా బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు గుర్రాల నాగరాజు మాట్లాడుతూ ఈరోజు రజతోత్సవ వేడుకల సందర్భంగా మిస్ వరల్డ్ సౌత్ ఆఫ్రికా, జోలిజ్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్ మాతో పటు పాల్గొన్నారు ,ఈరోజు పంపిణీ కోసం మాతో చేరడం మాకు గౌరవంగా ఉందన్నారు. సమీప పోలీస్ స్టేషన్ విక్టిమ్ ఎంపవర్మెంట్ సెంటర్‌లో కార్య వర్గ సభ్యులతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. వారి ద్వారా పేదలకు ప్రతి సంవత్సరం శీతాకాలములో దుప్పట్ల పంపిణీ జరుగుతుందని ఆయన వివరించారు. సౌత్ ఆఫ్రికా పోలీస్ సభ్యులు మాట్లాడుతూ బీఆర్ఎస్ శాఖ 7 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆ శాఖ సభ్యులను అభినందిస్తున్నామని అన్నారు. దీని వల్ల వివిధ రకాలుగా శీతాకాలంలో సహాయం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కమిటీ సభ్యులు నరేందర్ రెడ్డి మేడసాని, హరీష్ రంగ,అరవింద్ చీకోటి, జ్యోతి వాసిరెడ్డి, శిరీష కట్ట, వెంకట్ రావు, సౌజన్ రావు, శివా రెడ్డి, సాయి వేముల, రాజ్ నామ, సాయి కిరణ్ నల్ల, వూరే వంశీ, సందీప్ రెడ్డి, రమణ అంతటి ,నిర్మల్ నాని ,సుధీర్ బోనం, రాజు కుప్పు,రంజిత్ కుమార్ ,లక్ష్మణ్ వెన్నపురెడ్డి, ఉమా మేహేశ్వర్,మురళి బండారు, కాశి చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆత్మరక్షణలో పాక్ నేతలు

- సింధూజలాల ఒప్పందం రద్దుతో గిలగిల
- తట్టుకోలేక పలు రకరకాలుగా ప్రేలాపనలు

**ఇస్లమాబాద్, ఏప్రిల్26 (జనంసాక్షి) :** పహల్గాం దాడి వెనుకున్న కీలక సూత్రధాని పాక్‌కు ఝలకిచ్చేందుకు భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా దయాది దేశానికి భాతర్ గట్టి షాకే ఇచ్చింది. రాబోయే ముప్పును తలుచుకుని పాక్ రాజకీయ నేతలు మొదలు సామాన్యుల వరకూ ఇప్పుడు వణికి పోతున్నారు. అయినా మేకపోతు గాంభీర్యంతో బీరాలు పలుకుతున్నారు. చిక్కులు తప్పవని చింతిస్తున్నారు. ప్రధాని మోదీ బీహార్‌లో చేసిన ప్రసంగం తరువాత పాక్ నేతలు తమ నోటికి పనిచెప్పడం మొదలెట్టారు. ఉగ్రవాదులను ప్రపంచం అంచులవరకూ వెంటాడి అంతమొందిస్తామని ప్రధాని మోదీ బీహార్‌లో ప్రసంగించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులను, వారికి మద్దతు ఇచ్చే వారిని వదిలిపెట్టేది లేదని గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారత్ చర్యలు పాక్‌కు భారీ షాకిచ్చాయనేందుకు సూచనగా అక్కడి పీపీపీ పార్టీ నేత బిలావాట్ భుట్టో జర్దారీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సింధూ నదీలో నీరు ప్రవహించకపోతే పాక్ ప్రత్యర్థుల రక్తం పారుతుందంటూ బిలావాల్ నోరు పారేసుకున్నారు. సింధూ నాగరికత పరిరక్షకులం తామే అంటూ భారత్‌కు హెచ్చరికలు జారీ చేశారు. సింధూ నది మాదే. ఎప్పటికీ మాదే. నదిలో నీరైనా పారుతుంది లేదా వారి రక్తమైనా పారుతుంది. పాకిస్థాన్ గానీ అంతర్జాతీయ సమాజం కానీ ఈ యుద్ధ కాంక్షను అస్సలు సహించదు. వేల ఏళ్ల నాటి సింధూ నాగరికతకు తాము వారసులమని మోదీ అంటుంటారు. కానీ ఈ సంస్కృతికి పరిరక్షకులము మేమే. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని అంటూ ఓ ర్యాలీలో ప్రగల్భాలు పలికారు. భారత్‌తో ఉద్రిక్తతలు మరింత ముదిరేలా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు. అంతకు మునుపు, పాక్ రక్షణ శాఖ మంత్రి కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్‌ల మధ్య సింధూ, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తూర్పున ఉన్న బియాస్, రావీ, సట్లజ్ నదుల్లోని నీళ్లపై హక్కులు భారత్‌కు, సింధూ నది, ఛెనాబ్, ఝెలమ్ నదుల నీళ్లు పాక్‌కు దక్కాయి. అయితే, పహల్గాం దాడి తరువాత పాక్ తగిన గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతో ఉన్న భారత్ ఈ ఒప్పందం అమలును నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ క్రమంలో సింధూ నది నీటిని భారత్ దిగువన ఉన్న పాక్‌కు విడుదల చేయకపోతే దాయాది దేశానికి షాక్ తప్పదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి

- దాతల సహాయంతో అంత్యక్రియలు



**టేకుమట్ల, ఏప్రిల్ 27 (జనంసాక్షి):** వడదెబ్బతో ఒకరు మృతి చెందగా, దాతల సహాయంతో అంతక్రియలు నిర్వహించారు. హృదయ విదారకమైన ఈ సంఘటన గరిమిళ్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గరిమిళ్లపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజేందర్ వడదెబ్బకు గురై శనివారం ఇంటి వద్ద స్పృహ కోల్పోవడంతో సాయంత్రం 4 గంటలకు చిట్యాల ప్రభుత్వ హాస్పటల్ కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి ఇల్లు రేకుల షెడ్డు కావడంతో వచ్చే వడదెబ్బ సోకి మరణించినట్లు తెలుస్తుంది. మృతుడి భార్య వికలాంగురాలు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, అనాధలమైనమంటూ రోధించసాగారు. ఈ క్రమంలో దహన సంస్కారాలకు ఇంట్లో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో దాతల సహాయంతో ఆదివారం అంతక్రియలు పూర్తి చేశారు. అనంతరం పిల్లల భవిష్యత్తు కార్యచరణ దృష్ట్యా దాతలు ఆర్థిక సహాయం అందించాలంటూ ప్రార్థించారు.

# కాందహార్ హైజాక్ నుంచి క్రమంగా దాడులు

- పాక్‌లో తిష్టవేసి మాస్టర్ ప్లాన్స్ వేస్తున్న టెర్రర్ గ్రూపులు
- హఫీజ్ సయిాద్ ఇందులో మాస్టర్ మైండ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్25 (జనంసాక్షి) :** కాందహార్ విమానం హైజాక్ ఘటనను ఏ భారతీయుడు మరచిపోడు. నేపాల్ వెళ్లిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేయించి, జైలు నుంచి విడుదలయిన ఉగ్రవాదులంతా పాక్‌లోనే ఉన్నారు. వారే తదుపరి అనేక టెరరర్ దాడులకు మూలకారుకులు. ముంబై మారణకాండ లాంటి ఘటనలకు కారకుడైన హఫీజ్ సయిాద్.. టెర్రరిస్టులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి పోషిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఈ టెర్రరిస్టు బృందం కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతేడాది సోనమార్గ్, బూతాపత్రీ, గండేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలు పంచుకుంది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ కూడా కన్నుమూశారు. అయితే, గత డిసెంబర్‌లో ఈ టెర్రరిస్టు బృందానికి చెందిన జునైద్ అహ్మద్ భట్ అనే లష్కర్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుపెట్టాయి. మిగిలిన వారు ఎలాగోలా తప్పించుకుని, సమీప అడవుల్లోకి పారిపోయారు. భారీ దాడి చేశాక ఈ ఉగ్రమూకలు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోతాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థానీ హ్యాండర్ల నుంచి తదుపరి ఆదేశాలు అందే వరకూ అక్కడి అడవుల్లోనే తలదాచుకుంటారని తెలిపాయి. తాజా దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఎల్‌ఈటీ చీఫ్ హఫీజ్ సయిాద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు నియంత్రణలోని వారే అని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వీరికి పాక్ మిలిటరీతో పాటు- ఐఎస్ఐ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. బైసరన్ లోయలో మూడు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న ఉగ్రమూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. పోలీసుల కథనాల ప్రకారం, ఓ ప్రాంతంలో ఐదు మందిని, మరో మైదాన ప్రాంతంలో ఇద్దరిని, లోయ సరిహద్దు వద్ద మిగతా వారిని ఉగ్రవాదులు బలి తీసుకున్నారు. ఫెన్సింగ్ దాటి పారిపోగలిగిన వారు ఈ దాడి నుంచి తప్పించుకోగలిగారు. మరోవైపు, దాడికి పాల్పడిన వారి రేఖాచిత్రాలను జమ్మూ కశ్మీర్ పోలీసులు విడుదల చేశారు. వీరిలో ఇద్దరు పాకిస్థానీలు కాగా మరొకరు స్థానిక అనంత్‌నాగ్ జిల్లా వాస్తవ్యుడు. నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ.20 లక్షల నజరానాను కూడా పోలీసులు ప్రకటించారు. సమీప అడవుల్లో ఉగ్రవాదులు తలదాచుకున్న స్థావరాలను గురువారం భద్రతా దళాలు గుర్తించాయి. వారి జాడ కనిపెట్టేందుకు భద్రతా దళాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయి. భౌతికమైన దాడులే కాకుండా పాక్ గుండెను దెబ్బతీసేలా చర్యలకు భారత్ పూనుకుంది. సింధునదీ జలాల నిలిపివేత ఇందులో ప్రధానమైనదని చెప్పాలి. ఎందుకంటే జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రసంస్థ టీఆర్ఎఫ్ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది టూరిస్టుల మరణించారు. దీంతో ప్రజలు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరేబియా సముద్రంలోకి భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రవేశించింది. ఇది ప్రస్తుతం పాకిస్తాన్ దిశలో ఉంది. భారత నేవీ సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఖచ్చితంగా ఛేదించే పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించింది. ఇదిలా ఉంటే, మరోవైపు భారత వైమానిక దళం తన కీలకమైన సైనిక విన్యాసాలను చేపట్టింది. ఎక్సర్సైజ్ ఆక్రమన్ పేరు భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. గురువారం సెంట్రల్ సెక్టార్‌లో పెద్ద ఎత్తన వార్ గేమ్ ఎక్సర్సైజ్ నిర్వహించింది. పర్వతాలు, భూతల లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యాలపై దృష్టి పెట్టింది. ఈ ఎక్సర్సైజ్‌లో రాఫెల్ యుద్ధ వివానాలు పాల్గొన్నాయి. ఇందులో లాంగ్ రేంజ్ దాడులు, శత్రు స్థావరాలపైన దాడుల వంటి వాటిని నిర్వహించాయి. వైమానిక దళాని చెందిన కీలక ఆస్తులు పలు వైమానిక స్థావరాల నుంచి తూర్పు వైపుగా తరలించినట్లు- తెలుస్తోంది. పంజాబ్ అంబాలాలో, పశ్చిమ బెంగాల్ హాషిమారాలో వైమానిక దళం రెండు రాఫెల్ స్క్వాడ్రన్లను మోహరించింది.

# పోలీసుల సేవలు అమోఘం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** పోలీసుల సేవలు అమోఘం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గిరిజన గ్రామలైన అసలమాడా, బిర్సాయిగూడ, గంగుపటేల్ గూడా, బెజ్జల, భోగడ గూడా, లింగపటేల్ గూడా, గంపలపల్లి, గంటల గూడా, లాస్పుటలగూడా, దొడ్డి గూడా, నరసాపూర్, అబ్బపూర్, రాంగూడ, కడెంబెర్గుడా, రోడగూడా, పల్లెవగూడ, ఎల్లయ్యగూడా గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. గిరిగ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న పోలీసుల కృషిని అభినందించారు. ఉచిత వైద్య సేవలు మాత్రమే కాకుండా సుమారు రెండు లక్షలపై వ్యయంతో ఉచిత మందులు సైతం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే వినోద్ కు గిరిజనులు గుస్సాడి నృత్యాలతో స్వాగతం పలికి, గుస్సాడి అందించారు. అనంతరం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని అన్నారు. ముఖ్యంగా గంజాయి పండించడం, సేవించడం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని అన్నారు. సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి సత్వరంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు గాని, డయాల్ 100కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈకార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం ఎస్సై సౌజన్య, వైద్య బృందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పాక్‌లో దాడులకు భారత్ వ్యూహం

- పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు
- పాక్‌కు తిరిగి చేరుకుంటున్న పౌరులు

**ఇస్లామాబాద్, ఏప్రిల్25 (జనంసాక్షి) :** పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ పూర్తి యుద్ధానికి బదులుగా, విస్తృత ఉగ్రవాద దాడిని ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. మా సమాచారం ప్రకారం, భారతదేశం పూర్తి యుద్ధానికి బదులుగా పాకిస్తాన్ అంతటా విస్తృత ఉగ్రవాద దాడులను ప్లాన్ చేస్తోంది. ఆ ఉగ్రవాద దాడుల్ని తిప్పికొట్టేందుకు మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాము. అయితే, అలా జరిగితే, అది ప్రతిఫలంగా ఉంటుంది. పాక్ పౌరులు సురక్షితంగా లేకుంటే, వారిపై దాడి జరిగితే, భారత పౌరులు సురక్షితంగా ఉండరు. భారత్ చేసిన దాడి కారణంగా ఒక్క పాకిస్తాన్ పౌరుడు మరణించినా, భారతదేశం భారీ మూల్యం చెల్లించేలా చేస్తాం అని ఆసిఫ్ అన్నారు. పాకిస్తాన్ తన సార్వభౌమాధికారం, భద్రతకు ఏదైనా ముప్పు కలిగితే దృఢమైన ప్రతిస్పందన ఎదుర్కుంటారని భారత్‌కి వార్నింగ్ ఇచ్చింది. భారత్ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి పహల్గామ్ వంటి సంఘటనల్ని వాడుకుంటుందని పాకిస్తాన్ జాతీయ భద్రతా కమిటీ- సమావేశం తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. సింధు జలాల ఒప్పందం రద్దుని యుద్ధ చర్యగా పాకిస్తాన్ అభివర్ణించింది. పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిన తర్వాత పాకిస్తాన్ లోలోపల భయపడుతూనే, భారత ప్రతీకారాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎల్ఓసీ వద్ద పాకిస్తాన్ తన సైన్యాన్ని మోహరించింది. పాక్ ప్రధాని షెహజాబ్ షరీఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. దీని తర్వాత, భారత్‌పై ప్రతీకార చర్యలకు పాల్పడింది. భారత విమానాలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేయడంతో పాటు- ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపేస్తున్నట్లు, వాణిజ్యాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే,భారత్‌లో పర్యటిస్తున్న అనేక మంది పాకిస్థాన్ జాతీయులు పంజాబ్‌లోని అటారీ వాఘా సరిహద్దు గుండా తమ దేశానికి తిరుగు ప్రయాణమయ్యారు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్న తర్వాత సార్క్ వీసా పథకం ద్వారా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ వాసుల్ని 48 గంటల్లోగా తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్ర ప్రభుత్వం కోరిన విషయం తెలిసిందే. దీంతో వివిధ కారణాల దృష్ట్యా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ జాతీయుల్లో కొందరు గురువారం అటారీ-వాఘా సరిహద్దు గుండా వెనక్కు వెళ్లిపోయారు. తమ బంధువులను కలుసుకునేందుకు 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని, ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కరాచీకి చెందిన ఓ కుటుంబం తెలిపింది. కేంద్ర ఆదేశాల మేరకు బుధవారం అధికారులు అటారీ- వాఘా సరిహద్దును మూసివేశారు.

# రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలి



- ఐలాపురం రైతుల కష్టాలు తీర్చాలి
- మాజీ శాసనసభ్యులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

**మిర్యాలగూడ ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామం వద్ద మోరి నెంబర్ 197,స్థంభం నెంబర్ 110వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేసి గిరిజన రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ సందర్భంగా గిరిజన రైతులతో కలిసి అండర్ పాస్ ఏర్పాటు చేయడానికి రైతులు కోరుకుంటున్నటువంటి 197 మిని బ్రిడ్జి తూము వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలాపురం గ్రామానికి చెందినటువంటి రైతులు రైల్వే ట్రాక్ అవతల పొలాలు ఉండటం వలన ఇంతకాలం అనేక ఇబ్బందులు పడి రాకపోకలు కొనసాగించడం జరిగింది. ఇప్పుడు డబల్ ట్రాక్ ఏర్పాటు చేస్తుండడంతో ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని, వాటిని దాటాలంటే 5 కిలోమీటర్ల దాటి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, కావున గిరిజన రైతుల సౌకర్యార్థం ఆ ప్రాంతంలో అండర్పాస్ లేదా ఎల్ సి గేట్ ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని వారు రైల్వే డిపార్ట్మెంట్ వారిని కోరారు. వాటి వలన రైతులు పండించే పంటకు రవాణా సౌకర్యం కలిగి అప్రమత్తంగా పంటలను సమయానికి మార్కెట్ కి తరలించే అవకాశం ఉంటుందని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి రవి నాయక్ మండల కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి కృష్ణ, రూప్లా, వెంకటేశ్వర్లు, నాగు, కుమారి, హనుమా, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి

- విద్యతోనే సమూల మార్పు
- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుంది
- ఇంటర్ బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం బేగంపేట టూరిజం ప్లాజా లో ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల, బీసీ హాస్టల్ విద్యార్థుల సత్కార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ లో మంచి ర్యాంకులు సాధించిన 162 మంది విద్యార్థులను జ్ఞాపిక, శాలువ, సర్టిఫికెట్ తో పాటు పదివేల రూపాయల నగదు బహుమతితో మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "విద్యార్థి సంఘ నాయకుడిగా మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించాల్సిందే. ఈ సత్కారం ద్వారా మిగతా విద్యార్థులు నేను కూడా ర్యాంకులు తెచ్చుకోవాలి అని స్ఫూర్తి పొందాలి. విద్యార్థులు తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలి. అధికారులు నిరంతర పర్యవేక్షణ తో వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని, డైట్ చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచిన మంచి ర్యాంక్ లు సాధించడంతో విద్యార్థులు మీ తల్లిదండ్రుల, గ్రామ గౌరవంతోపాటు సంస్థ గౌరవాన్ని కాపాడారని తెలిపారు. ఇది అక్కడికే పరిమితం కాదు.. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలన్న లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. జీవితంలో గొప్ప స్థానానికి వెళ్లాలంటే హార్డ్ వర్క్ తో పాటు, స్పీకింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించుకోవాలి. సమస్య వస్తే ఎలా అధిగమించాలి అని నైపుణ్యాన్ని నేర్చుకోవాలని, ఈ మూడు స్కిల్స్ ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని, మంచి ప్రతిభ కనబరిచిన వారికి సత్కారం చేస్తామని, రిజల్ట్ తక్కువ వచ్చిన పాఠశాలపై కూడా రివ్యూ చేస్తామని, వారిలో మార్పు తీసుకొస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికలతో ముందుకు పోద్దాం. 327 గురుకులాల్లో 700కి పైగా హాస్టల్ లలో అబ్బురపడేలా ఫలితాలు రావాలని, విద్యార్థులకు చదువుతో పాటు వారికి ఆసక్తి గల క్రీడల్లో, లలితకళల్లో ప్రావీణ్యం సంపాదించేలా కరిక్యూలం యాక్టివిటీస్ ఉండేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొస్తున్నామని, స్పోర్ట్స్‌లో సైతం విద్యార్థులు రాణించాలని, మే 10 నుండి జరిగే 150 దేశాలు పాల్గొంటున్న అందాల పోటీల ప్రారంభోత్సవ వేడుకల్లో మీకు కూడా ఆహ్వానం ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. అక్కడ జరిగే పోటీలు ప్రత్యక్షంగా చూసే అవకాశం ఇస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు. గురుకులాల మీద విశ్వాసం ఉంచి పంపారు.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం"అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు మాట్లాడుతూ గతంలో ర్యాంక్ లు అంటే కేవలం కార్పొరేట్ కాలేజీలకే పరిమితం అనే విధంగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. బీసీ గురుకుల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర సగటు కంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉంది. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలి. అందుకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, ఉన్నతాధికారులు అలోక్ కుమార్, చంద్రశేఖర్, ఇందిరా, తిరుపతి, సంధ్య తదితర ఉన్నతాధికారులు, ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంటలను ధ్వంసం చేసిన గ్రీన్ ఫీల్డ్ అధికారులు

**కొదుమూరులో రైతు ఫోన్ కాల్ తో స్పందించిన డిప్యూటీ సీఎం**
**పంట ఇంటికి వచ్చేవరకు రోడ్డు పనులు ఆపాలని జిల్లా కలెక్టర్, ఆర్డిఓలకు ఆదేశాలు**





**చింతకాని, ఏప్రిల్ 27(జనం సాక్షి) :**

చింతకాని మండల పరిధిలో వందనం, కోదుమూరు, నేరడ, నాగిలిగొండ , ప్రొద్దుటూరు, మీదగా వెళుతున్న నాగపూర్ టు అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి పనులు ఎన్హెచ్ అధికారులు పంట చేతికి వచ్చిందని కూడా చూడకుండా కొదుమూరు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆదివారం ధ్వంసం చేశారు. దీంతో రైతులు విషయం తెలుసుకొని పంటపొలాల వద్దకు వెళ్ళగా గ్రీన్ ఫీల్డ్ హైవే ఎన్హెచ్ అధికారులు మొక్కజొన్న పంటను నేలమట్టం చేశారు. రైతులు లబోదిబోమంటూ ఒక్కరోజు గడువు ఇచ్చిన పంట ఇంటికి తీసుకెళ్తామని ప్రాధేయపడిన వినకొండ ఎన్ హెచ్ అధికారులు రైతులను భారీ పోలీస్ బందోబస్తు తో నెట్టు వేసి పంట పొలాలను ధ్వంసం చేశారని కొదుమూరు గ్రామానికి చెందిన నీరుడు రాంబాబు, వేముల శ్రీనివాస్ అనే రైతులు తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అక్కడ రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు శరవాణి తో రైతు ఫోన్ చేయడంతో డిప్యూటీ సీఎం బట్టి వెంటనే స్పందించారు అన్నారు. రైతులు తమ పంటలను గ్రీన్ ఫీల్ అధికారులు బుల్లోజర్లతో, జెసిపిలతో, లారీలతో తొక్కిస్తూ నేలమట్టం చేశారని, పంట ఇంటికి తీసుకెళ్లే వరకు కొద్ది రోజులు గడువు ఇవ్వాలని తెలపగా డిప్యూటీ సీఎం వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజేమిల్ ఖాన్ తో శరవాణిలో మాట్లాడి గ్రీన్ ఫీల్ హైవే పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రైతులు పంటలు ఇంటికి చేరే వరకు పనులు వేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం రైతులతో గ్రీన్ ఫీల్డ్ అధికారులతో సమావేశమై సమస్య పరిష్కరించాలని రైతులు యొక్క పంట ధ్వంసం చేసినందుకుగాను పంట నష్ట పరిహారం చెల్లించాలని తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పెంట్యాల అప్పారావు, కొల్లి సీతయ్య, వేముల సతీష్, రైతు సంఘం నాయకులు కూచిపూడి రవి, గ్రామ రైతులు పెంట్యాల వెంకటేశ్వర్లు నారపోగు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# తడిసిన వడ్లు..
## రైతుకు అపార నష్టం



**మాగనూర్ లో గాలివాన భీభత్సం**
**హైవేపై కూలిన చెట్లు..**
**గ్రామాల్లో విరిగిపడిన స్థంబాలు**

**మాగనూర్(జనంసాక్షి)**

: నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం గాలివాన భీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా తీవ్ర గాలులు భారీ వర్షం రావడంతో జాతీయ రహదారిపై చెట్లు కూలీ వాహనాల రాకపోకలు చాలా సేపు అంతరాయం కలిగింది. వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అలాగే ఉన్న పలంగా వర్షం కురియడంతో వడ్లు సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో కల్లాలవద్ద వడ్లు మొత్తం తడిసిపోయి రైతులకు అపార నష్టం వాటిల్లింది. గ్రామాల్లోనూ గాలి వాన భీభత్సం సృష్టించడంతో చెట్లు కరెంటు

స్తంభాలు విరిగిపడి కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. వర్షంలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొని న్యాయం చేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నిరుపేద ఒంటరి మహిళకు చేయూత



**గోదావరిఖని (జనంసాక్షి) :**

స్థానిక అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించే 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ దాత మీసాల సతీష్‌కుమార్ సతీమణి మీసాల అశ్లేష జన్మదినాన్ని పురస్కరించుకొని, సతీష్‌కుమార్ ఆర్థిక సహకారంతో ఆదివారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన మామిడాల లక్ష్మి అనే ఒంటరి మహిళకు నెలకి సరిపడ కిరాణా సామాగ్రి, 25కిలోల రైస్‌బ్యాగ్, పండ్లు, సుమారు 2500 రూపాయల సామాగ్రిని అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ అందించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మపరివార్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ,అమ్మ పరివార్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్విరామంగా గిఫ్ట్ ఏ స్మైల్ అనే ఒక కార్యక్రమంతో ఎవరైతే నిరుపేదలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి నెలకు సరిపడా కిరాణా సామాగ్రిని అందించడం జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమన్ని సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ ఇంకా ఎవరైనా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసేవారు ఉంటే అమ్మపరివార్ సంస్థను సంప్రదించవలసినదిగా నిర్వాహకులు తెలిపారు.

# లారీలో పట్టుబడిన 30 కేజీల గంజాయి

**లారీతో పాటు..**
**ముగ్గురు వ్యక్తుల అరెస్ట్**



**బూర్గంపహాడ్ ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం ఐటిసి కంపెనీ పార్కింగ్ యాడ్ లో నిలిచి ఉన్న లారీలోనుండి 30 కేజీల గంజాయిని హైదరాబాద్ కు చెందిన ఎస్ టి ఎఫ్ బి టీం ఎక్సైజ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఐటిసి పేపర్ మిల్లు కోసం అవసరమైన ముడి సరుకు కర్రను తీసుకు వస్తున్న లారీ డ్రైవర్ శివ ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకొస్తున్న అర్జున్ ఎక్కించుకొని భద్రాచలం తీసుకువచ్చాడు. ఈ సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై నాగరాజు మిగతా సభ్యులు కలిసి ఐ టి సి పార్కింగ్ యార్డులో నిలిచి ఉన్న లారీని తనిఖీలు చేయగా అందులో 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. డ్రైవర్ శివ తో పాటు గంజ్ ఒరిస్సాకు చెందిన అర్జున్ గంజాయి వ్యాపారి కలిసి పలుమార్లు ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకువచ్చి భద్రాచలంలో అమ్మకాలు చేపట్టినట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. ఎప్పటి లాగానే ఈసారి కూడా తీసుకువచ్చిన గంజాయిని ఎస్టిఎఫ్ పోలీసులు పట్టుకోవడంతో గంజాయి అక్రమ రవాణా దారుల గుట్టురట్టు అయింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.15 లక్షలు, సీజ్ చేసిన లారీ విలువ 20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. డ్రైవర్ శివ గంజాయిని తీసుకొచ్చిన అర్జున్ మరో వ్యక్తి ప్రహ్లాదును గంజాయిని, లారీని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. గంజాయి పట్టుకున్న ఎస్టిఎఫ్ బీ టీం ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్ రెడ్డి, బీ టీం ఇంచార్జ్ ప్రదీప్ రావులు అభినందించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



**అమీన్పూర్, ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. అమీన్పూర్ ఎస్సై సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శ్రీవాణి నగర్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడని సమాచారం వచ్చింది అక్కడికి వెళ్లి చూడగా సుమారు 55 సంవత్సరాల వయసు గల వృద్ధుడు అనారోగ్యంతో పడి ఉన్నాడు. అతన్ని చికిత్స కోసం పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**రేవల్లి, ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

: వనపర్తి జిల్లా కేంద్రంలోని హరిజన్ వాడకు చెందిన బండారు శేఖర్ తన స్వంత పని నిమిత్తం బుద్దారం గ్రామం వెళ్లి వస్తున్నాడు. తాడిపర్తి గ్రామ శివారులో గొల్లోన్ని మిట్ట దగ్గర వనపర్తి డిపోకు చెందిన టీఎస్ 32 జడ్ 0021 నంబర్ గల బస్సు వనపర్తి నుండి పెద్ద కొత్తపల్లివైపు ఎదురుగా వెళ్తున్న బస్సును ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందారు. మృతునికి ఇద్దరు మగ కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భార్య శిరీష పిర్యాదు

మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం వనపర్తి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించామని గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

## ఉత్తమ సేవలకు అత్యున్నత పురస్కారం

**ఎస్ఐ ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్ కు నగదు రివార్డ్**



**పెద్దపల్లి, ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారం లభించింది. గంజాయి కేసులో నిందితుడు ఎస్ఆర్ఎస్ పి కెనాల్ లో దూకి పారిపోతుండగా ప్రాణాలకు తెగించి కెనాల్ లో దూకి నిందితుడిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్న రామగుండం కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ ఎస్సై యు. ఉపేందర్ కు రాష్ట్ర డిజిపి జితేందర్ నగదు రివార్డు అందజేశారు. శనివారం హైదరాబాదులోని డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ఉపేందర్,కానిస్టేబుల్ సంపత్ లకు నగదు రివార్డ్ అందజేశారు. విధి నిర్వహణలో నిందితుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్నందుకు డిజిపి జితేందర్ తో పాటు నార్కోటిక్స్ ఏడిజి సందీప్ శాండిల్యలు ఎస్సై ఉపేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. రివార్డ్ లు అందుకున్న టాస్క్ ఫోర్స్ ఎస్ఐ ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్ లకు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఏడిజి పర్సనల్ అనిల్, నార్కోటిక్స్ ఎస్పీ చెన్నూరి రూపేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

# కేసీఆర్ వీటికి సమాధానం చెప్పాల్సిందే..

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**



**హైదరాబాద్ (జనంసాక్షి)**

రజతోత్సవ సంబరాలు జరుపుకుంటున్న వేళ తెలంగాణ సమాజం అడుగుతున్న ప్రశ్నలకు మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పలు ప్రశ్నలు వేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా ఒక ప్రకటనలో తెలిపారు. '15 నెలలుగా ప్రతిపక్ష నేతగా ప్రజల్లోకి రాకుండా, చట్టసభలకు వెళ్లకుండా ఫాంహౌజ్ కే పరిమితమై.. 25 ఏండ్ల పార్టీ పండగ చేసుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రజలకు తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలి. ఏ నీళ్లు, నిధులు, నియామకాల కోసమైతే తెలంగాణ సమాజం పోరాటం చేసిందో.. వాటిని పదేళ్లలో ఎందుకు పట్టించుకోలేదో ప్రజలకు చెప్పాలి. మీ గులాబీ పండుగ.. పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసినందుకా సమాధానం ఇవ్వాలి? ఇంటికో ఉద్యోగం అన్నాము, కనీసం ఊరికో ఉద్యోగం ఇవ్వలేకపోయామనా? ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి యుద్ధభూములుగా నిలిచిన యూనివర్సిటీల్లో మీ పాలనలో ఒక్క పోస్ట్ కూడా ఎందుకు భర్తీ చేయలేదో చెప్పాలి. పదేళ్లలో బీసీల రిజర్వేషన్లు పెంచకుండా సబ్బండ వర్గాలను ఎందుకు మోసం చేశారో చెప్పాలి? 10 ఏళ్లుగా దళితుడిని సీఎం చేస్తానని దళిత బిడ్డలను ధగా చేసినందుకా? పదేళ్లలో Scవర్గీకరణను చేయలేక, మోసం చేశామనా? తొలి కేబినెట్ లో మహిళా మంత్రి లేకుండానే పాలన సాగించి నందుకా? డబుల్ బెడ్ రూం ఇండ్లని ఇల్లు పీకి పందిరేసినందుకా? కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టి, ప్రజల నెత్తిన అప్పుల భారం మోపినందుకా? సిరిగల తెలంగాణాను పదేళ్లలో అప్పుల తెలంగాణగా మార్చినందుకా? ముందు తెలంగాణ సమాజానికి అన్నింటికి సమాధానం చెప్పాలి' అని పేర్కొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**దాతల సహాయంతో అంతక్రియలు**



**టేకుమట్ల ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

అనాధలుగా మారిన ముగ్గురు పిల్లలు. ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు... జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం వడదెబ్బకు గురై మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే గర్మిళ్ల పల్లి గ్రామానికి చెందిన అంబాల పోషాలు కుమారుడు రాజేందర్ శనివారం ఇంటి వద్ద స్పృహ కోల్పోవడంతో సాయంత్రం 4 గంటలకు చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక హాస్పటల్ కు తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి ఇల్లు రేకుల షెడ్డు కావడంతో వచ్చే వడదెబ్బ సోకి మరణించినట్లు తెలుస్తుంది. మృతుడి భార్య వికలాంగురాలు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె అనాధలమైనమంటూ రోధిస్తున్నారు. ఈ క్రమంలో దహన సంస్కారాలకు ఇంట్లో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో దాతల సహాయంతో ఆదివారం అంతక్రియలు పూర్తి చేశారు. అనంతరం పిల్లల భవిష్యత్తు కార్యచరణ దృష్ట్యా దాతలు ఆర్థిక సహాయం అందించాలంటూ ప్రార్థించారు.

## రాజన్న ఆలయ అభివృద్ధిపై శృంగేరి వెళ్లిన ప్రభుత్వ విప్, అధికారులు.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై ఆదివారం శృంగేరి పీఠం చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎండో మెంట్ అధికారులు ఆదివారం శృంగేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై శృంగేరి పీఠాధిపతి తో పూర్తిస్థాయిలో నమూనా చిత్రాలను చూపించడం జరిగిందని వారి ఆదేశాల మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి చేపడుతామన్నారు. ఆయన వెంట దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్,దేవాదాయ కమిషనర్ శ్రీధర్,ఎండోమెంట్ సలహాదారు గోవిందా హరి, ఆర్ అండ్ బి సిఈ రాజేశ్వర్ రెడ్డి,ఆలయ ఈవో వినోద్ రెడ్డి,ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, అర్చకులు శరత్, సురేష్,శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ శర్మ,ఏఈ రామకిషన్ రావు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు

# అన్నదాతల సంక్షేమే ప్రభుత్వ లక్ష్యం



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 27(జనంసాక్షి)**

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సంగెం మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ అవుతుందని, ధాన్యం నగదు తో పాటే బోనస్ 500 రూ అదనంగా ఇస్తున్నామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని,రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందని, దానితో సన్న రకం వరిసాగు భారీగా పెరిగింది అన్నారు. గత ఏడాది రబీ తో (2023-2024)పోలిస్తే ప్రస్తుత (2024-25) రబి సీజన్ సన్నాల సాగు విస్తీర్ణం 68 శాతం పెరిగిందని, మొత్తం 50.61 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. మండల కేంద్రంలో వరిసాగు విస్తీర్ణం 6300 ఎకరాలు అని, సన్న రకాల సాగు విస్తీర్ణం 5670 ఎకరాలు అని, దొడ్డు రకాల సాగు విస్తీర్ణం 630 ఎకరాలు అని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీలు,



గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికపరంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు.

# మక్తల్ ప్రాంతంలో అకాల వర్షం బీభత్సం

## ఇద్దరు మృతి, పంటలకు నష్టం

**మక్తల్, ఏప్రిల్ 27 (జనంసాక్షి)**





తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండలు కొనసాగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. మక్తల్ పట్టణ పరిసర గ్రామాల్లో ఉదయం నుండి పొడి వాతావరణం ఉండగా, ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ అకాల వర్షం కారణంగా వరి పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి వాతావరణం చల్లగా ఉండటంతో రైతులు తమ వరి పొలాలను కోయడానికి వరి కోత మిషన్ల కోసం ఎదురు చూస్తుండగా, ఇంతలోనే వర్షం కురవడంతో వారి ఆశలు నీరుగారిపోయాయి. మక్తల్ మండలం ఉప్పర్ పల్లి గ్రామంలో పిడుగుపాటుకు మేస్త్రి ఆంజనేయులు (34) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున వారికి తప్పకుండా సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఘటనా స్థలంలో ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నారు. మరో విషాదకర సంఘటనలో, కురువ కురుమూర్తి దాదనపల్లి గ్రామంలో పిడుగుపడి కురువ హనుమంతు కుమారుడు మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈ అకాల వర్షాలు, పిడుగు పాటు సంఘటనలు మక్తల్ ప్రాంతంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# 3న 'పేట'లో మెగా జాబ్ మేళా



## జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ నడుం బిగించిందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట కూరగాయల మార్కెట్ రోడ్డులో ఉన్న ఎస్.ఆర్.గార్డెన్స్ లో మే 3వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం నారాయణపేటలో రాజ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో చదువులు పూర్తి చేసిన యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 50 ప్రముఖ ఎం.ఎన్.సీ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ ఆవిష్కరణలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ గౌడ్, హనుమంతు, వై.సంతోష్, శివరాజ్, ఎం.సంతోష్, నరేష్ గౌడ్, కృష్ణ, చామకూర నగేష్, వంశీరెడ్డి, గోపాల్, అశోక్, వెంకటరావు తదితరులు ఉన్నారు.

# కర్రెగుట్టలో భారీ సొరంగం

## గుర్తించిన భద్రతా బలగాలు

## మావోయిస్టుల ఆచూకీ కోసం గాలింపు

**హైదరాబాద్ (జనంసాక్షి)**



గత వారం రోజులుగా కర్రె గుట్టలలో భద్రతా బలగాలు కూబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.. ఈ ఆపరేషన్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజాపూర్, తెలంగాణ సరిహద్దు కర్రె గుట్టలలో భారీ సొరంగాన్ని భద్రతా బలగాలు గుర్తించారు. ఈ సొరంగంలో ఒక ప్రాంతం నుంచి మరో మార్గం ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా ఉందని భద్రతాదళాలు చెబుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సొరంగాన్ని స్థావరంగా చేసుకొని మావోయిస్టులు దాడులకు తెగబడ్డారని పేర్కొన్నాయి. అయితే, ఈ సొరంగంలో సరైన గాలి నీరు వాతావరణం ఉంది.. అంతే కాకుండా ఇక్కడ విశాలమైన ప్రాంతం కూడా ఉందన్నారు. ఈ సొరంగంలో 1000 మంది పట్టేంత స్థలం ఉందని అధికారులు వెల్లడించారు. కాగా, కర్రెగుట్ట కొండల్లో నక్సలైట్లపై కొనసాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. ఎండ వేడిమి, 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య శ్రమించి.. ఎట్టకేలకు వారి స్థావరానికి చేరుకోగలిగారు. అయితే భద్రతా దళాలు అక్కడికి చేరుకోకముందే మావోయిస్టులు తమ స్థావరాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ఎందుకంటే ఇక్కడ వారు ఉన్నట్టు ఆనవాళ్లు దొరికాయి. ఈ గుహలో చాలా రోజుల పాటు వెయ్యి మందికి పైగా ఆశ్రయం పొందవచ్చని చెప్పుకొచ్చారు. ఈ సొరంగానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీకరించారు. ఇక, పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. ఈ కూంబింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నక్సలైట్లు ఆహారం, మంచి నీటి కోసం వెంపర్లాడినట్లు తెలుస్తుంది. నక్సలైట్లు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి సుమారు 4 నెలల పాటు రేషన్‌తో కర్రెగుట్ట కొండలలో క్యాంప్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ.. భద్రతా బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టడంతో.. ఆ రేషన్ కూడా వారికి ఉపయోగపడలేదు.. కొండలపై నుంచి దిగితే సైనికుల తూటాలకు బలి అవుతారనీ, భయంతో కొండలపైనే ఎక్కువ కాలం దాక్కుని ఉంటే డీహైడ్రేషన్ వల్ల చనిపోతామనే భయం వారిని వెంటాడుతుంది. మరోవైపు, నక్సలైట్లు దాక్కున్న కొండలను మొత్తం స్వాధీనం చేసుకునే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని భద్రతా దళాలు పట్టుదలతో ఉన్నాయి. ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు చొరవ చూపాలంటూ ఇటీవల నక్సలైట్లు ప్రెస్ నోట్ విడుదల చేశారు. అయితే, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కోట్లాది రూపాయల రివార్డు ఉన్న వాళ్లందరు కర్రెగుట్టల్లో తలదాచుకుంటున్నారని భద్రతా దళాలు చెబుతున్నాయి. కాగా, 160 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కర్రెగుట్టలను స్వాధీనం చేసుకునేందుకు భద్రత బలగాలు హెలికాప్టర్ ను ఉపయోగించి దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే 40 మంది మావోయిస్టు చనిపోయినట్లు సమాచారం వస్తున్నప్పటికీ దానిని ఇప్పటి వరకు భద్రతా బలగాలు అధికారికంగా ధృవీకరించలేదు.

# పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు



**శివ్వంపేట, ఏప్రిల్ 27 (జనంసాక్షి)**

: మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత, శివంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్ రాంరెడ్డి మరోసారి తన మానవత దృక్పథాన్ని చాటుకున్నారు. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులు వెంకట్రాంరెడ్డితో వారి గోడును వెల్లబోసుకున్నారు. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు అడగగానే తనవంతుగా సహాయంగా ఒక్కొక్కరికి 2 వేల రూపాయల చొప్పున 4 గురికీ మొత్తం 8 వేల రూపాయలను ఆదివారం అందజేశారు. ఆ తర్వాత వారికి నెలకు సరిపడే నిత్యవసర సరుకులు కూడా ఆయన అందజేశారు. మీకు ఏ ఆపద వచ్చినా తాను అండగా నిలుస్తానని పాక్స్ చైర్మన్ వారికి మనో ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు షఫీయోద్దీన్, మాజీ సర్పంచ్ తాటి కిష్టయ్య, నాయకులు నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దుర్గారెడ్డి, తిరుపతి రెడ్డి, రాజు, సీవీఆర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ లో వంతడుపుల రఘు అదుర్స్



## కాంస్య పథకాన్ని సాధించిన చెల్పూర్ వాసి

**హుజూరాబాద్, ఏప్రిల్ 27 ( జనం సాక్షి) :**

ఇటీవల హిమచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్, హ్యామర్ త్రో విభాగంలో చెల్పూర్ గ్రామానికి చెందిన వంతడుపుల రఘు సత్తా చాటి కాంస్య పథకం సాధించారు. త్వరలో సింగపూర్ లో జరిగే అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలలో పాల్గొనబోతున్నాడు. జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ కాంస్య పథకం సాధించిన వంతడుపుల రఘును గ్రామస్తులు, స్నేహితులు అభినందిస్తున్నారు. ఆదివారం గ్రామంలో రఘును ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సామల ప్రతాప్ రెడ్డి, కోడిగూటి ప్రవీణ్, గుడిపాటి జయపాల్ రెడ్డి. సామల వెంకట్ రెడ్డి, రంజిత్ రెడ్డి, విద్యసాగన్, సురేష్, సాయికృష్ణ, నాగరాజు, వంశీ, తరుణ్, శివ స్నేహిత్, కార్తీక్ పాల్గొన్నారు

# పేదలకు అండగా మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని మహాదేవపూర్ కు చెందిన కొండపల్లి మధునయ్య కు రూ. 2.50 లక్షలు ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. మధునయ్య నిమ్స్ ఆస్పత్రిలో న్యూరో కి సంబంధించిన అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2.50 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు ఆదివారం వారికి ఎల్ఓసి మంజూరు కాపీని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సదరు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# తాళాలు వేసిన ఇండ్లలో దొంగల బీభత్సం..

**గంగారావుపేట ఏప్రిల్ 27 (జనం సాక్షి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నాగంపేట గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు తాళం వేసి ఉన్న 10 ఇళ్లలో చోరీకి పాల్పడి దాదాపు 6 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ. 25 నుంచి 30 వేల నగదును వెతికెళ్ళినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగం పేట గ్రామంలో తాళం వేసి ఉన్న గురుక లక్ష్మి ఇంట్లో లాప్టాప్, మంగలి పొల్తూరి అంజయ్య ఇంట్లో రెండు తులాల బంగారం, 30 తులాల వెండి దొంగలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి క్లూస్ టీం తో ఇళ్లను పరిశీలించి, ఆధారాలు సేకరించారు. బాధితుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

# కర్రెగుట్ట ప్రాంతంలో నరమేధాన్ని ఆపాలి

## ఆదివాసి జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

## సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.నరేష్

**గోదావరిఖని (జనంసాక్షి) :**




కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని ఆదివాసి జాతిని హనం చేస్తున్న ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 27, 28 రెండు రోజుల పాటు సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం గోదావరిఖనిలో పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.నరేష్ మాట్లాడుతూ.. చత్తీస్ ఘడ్-తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల కర్రెగుట్ట గత నాలుగైదు రోజులుగా యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నదనీ, ఈ సరిహద్దు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసి, గిరిజనులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారనీ, ఇప్పటికీ హెలికాప్టర్స్, డ్రోన్ ల ద్వారా దాదాపు 20 వేల మంది సాయుధ పోలీస్ బలగాలు అక్కడ తిష్ట వేయగా, ప్రతిరోజు ఎన్‌కౌంటర్స్ జరుగుతున్నాయన్నారు. గత రాత్రి నుండి పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో 40 మందికిపైగా మావోయిస్టులు, ఆదివాసీలు హతమైనట్లు ప్రసార,ప్రచార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయనీ. ఈ అడవులన్నీ బాంబుల మోతలతో తల్లడిల్లుతున్నాయనీ, తెలంగాణ రాష్ట్రంలోని వెంకటాపూర్, వాజేడు, ములుగు ప్రాంతాల్లో నూ వేలాదిగా పోలీసు బలగాలు మోహరించి ఉన్నాయనీ కర్రెగుట్టపై ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రెండు బేస్ క్యాంపుల నుండి ఇటు తెలంగాణ, అటు చత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లోని అడవి ప్రాంతాల్లో ముఖ్యంగా ఆదివాసులను వందలాదిగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారనీ, అమాయకుల్కెన వీరిని కాల్చి చంపి మావోయిస్టులుగా చిత్రించే ప్రమాదం ఉన్నదన్నారు. కర్రెగుట్ట ప్రాంతం నుండి అన్ని రకాల సాయుధ పోలీస్ బలగాలని వెంటనే ఉపసంహరించాలని, అరెస్టు చేసిన ఆదివాసి గిరిజనులని వదిలిపెట్టాలని, ఆపరేషన్ కగార్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు ఇటీవలి కాలంలో శాంతి చర్చలకు తాము సిద్ధమని పదేపదే ప్రకటిస్తున్నా కేంద్ర ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదనీ. పైగా నేడు కర్రెగుట్ట అడవుల్లో ఎన్నడు లేని విధంగా నరమేధాన్ని కొనసాగిస్తున్నదన్నారు. దేశ వ్యాపితంగా

మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని మేధావుల, ప్రజాస్వామిక, ఆలోచనా పరుల నుండి పెద్ద ఎత్తున డిమాండ్ ముందుకొస్తున్న వాస్తవాన్ని ఇప్పటికయినా గుర్తించి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్ట బేస్ క్యాంపులను వెంటనే ఎత్తివేయాలని లేనియెడల దేశం జరుగు ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసన ఆందోళన కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఏ వెంకన్న, బి.అశోక్, చిలుక శంకర్, ఈదునూరి రామకృష్ణ, ఐ రాజేశం, కొంద్ర మొగిలి, గుండేటి మల్లేశం బి.బుచ్చమ్మ, ఈ మంగ, ఎర్ల రవికుమార్, బి.కొమరయ్య, ఎం.కాంతయ్య, ఎస్.ప్రసాద్, ఆర్.రాయమల్లు,వి రాజనర్సు,ఓ సుధాకర్, దుర్గం పోచయ్య, స్వామి, నారాయణ, ప్రవీణ్. తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**చౌటుప్పల్, ఏప్రిల్ 27(జనం సాక్షి):**



ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్ కోరారు. భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ , మండల అధ్యక్షులు కడారి కల్పన యాదవ్,కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో వర్షంతో తడిసిన ధాన్యంను బీజేపీ నాయకులు పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా దూడల బిక్షంగౌడ్ మాట్లాడుతూ ధాన్యం రాశుల నుండి వర్షపు నీటితోపాటు వరి ధాన్యం కూడా కాలువలలో కొట్టుకుపోయి రైతులు నష్టపోయారన్నారు. ధాన్యం పోసిన రైతులకు పట్టాలు సరిగ్గా ఇవ్వకపోవడం , కొందరికి అసలే పట్టాలు ఇవ్వకపోవడం వలన అకాల వర్షంతో పూర్తిగా తడిచి రైతులు నష్టపోయే అవకాశముందన్నారు. రైతులు వరి ధాన్యం ఇక్కడికి తెచ్చి 15 రోజులు దాటుతున్నా కొనుగోలులో జాప్యం చేయడంతో ఈ నష్టం జరుగుతుందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో కంచర్ల గోవర్ధన్ రెడ్డి , చినుకని మల్లేశం యాదవ్ , ఊడుగు వెంకటేశం గౌడ్ , ఉబ్బు బిక్షపతి ,కట్ట కృష్ణ ,కడారి ఐలయ్య , దిండు భాస్కర్ , వనం ధనంజయ , రాధారపు సత్తయ్య, కడవేరు పాండు తదితరులు పాల్గొన్నారు

# ఉగ్రదాడికి నిరసనగా రేపు పెద్దపల్లి బంద్

## ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుల ప్రకటన



**పెద్దపల్లి,ఏప్రిల్ 27(జనంసాక్షి) :**

ఈ నెల 22న కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పహల్గామ్ లో యాత్రికులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడి చేసి 28 మందిని చంపిన ఘటనను పెద్దపల్లి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమల్ కిషోర్ శారడ, సయ్యద్ మస్రత్, కోశాధికారి కొమురవెల్లి జయప్రకాష్ ఖండిరచారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను నిరసిస్తూ ఈనెల 29 న మంగళవారం పెద్దపల్లి బందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బందులో పాల్గొనాలని కోరారు. లారీ అసోసియేషన్, ఆటో యూనియన్, కూరగాయల మార్కెట్, ఆటోలు, వ్యాన్ అసోసియేషన్, ఇతర ఇండస్ట్రీ సంస్థలు బందుకు మద్దతు ప్రకటించారని తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు బందు పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాడూరి వినోద్ కుమార్, దేవరకొండ రాజు, వనపర్తి శ్రీనివాస్, కొత్తపల్లి సత్యనారాయణ ,తాహెర్ ఖాన్,లక్ష్మీనారాయణ, అఖిల్,ఖరీం ,యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆసుపత్రి వైద్యుల ఘనత

## తెలంగాణలో మొట్టమొదటి పేగు మార్పిడి శస్త్రచికిత్స

## అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో వైద్యులు విజయవంతంగా పేగు మార్పిడి శస్త్రచికిత్స చేశారు. తెలంగాణలో జరిగిన మొట్టమొదటి పేగు మార్పిడి శస్త్రచికిత్స ఇదే. షార్ట్ గట్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 40 ఏళ్ల ఓ రోగి ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో చేరాడు. ఈ సిండ్రోమ్‌తో బాధపడేవారికి పేరెంటల్ న్యూట్రిషన్ సపోర్ట్ అవసరమవుతుంది. ఆ రోగి సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లు, మేజర్ సెంట్రల్ వెయిన్స్ థ్రాంబోసిస్‌తో పదే పదే బాధపడ్డాడు. అతడికి అక్యూట్ సుపీరియర్ మెసెంటెరిక్ ఆర్టరీ మూసుకుపోయిన కారణంగా పేగులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో గతంలో అతడి చిన్న పేగు, కుడి పెద్దపేగులో కొంత భాగాన్ని తొలగించడానికి శస్త్రచికిత్స కూడా జరిగింది. డ్యూడెనోజెజునల్ ఫ్లెక్చర్ నుంచి ఉండే ప్రాక్సిమల్ జెజునమ్‌లో 30 సెంటీమీటర్లు మాత్రమే బాగుంది. దీంతో, ఈ నెల 19న ఉస్మానియా వైద్యులు కాడవెరిక్ చిన్న పేగు మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఇప్పుడు ఆ రోగి సాఫ్ట్ డైట్‌ను తినగలుగుతున్నాడు. అతడి ఇలియోస్టోమీ కూడా సరిగ్గా పనిచేస్తోంది. శస్త్రచికిత్స చేసిన తర్వాత ఏడో రోజు చెకప్ ప్రొసీజర్ (ఎండోస్కోపీ) చేశారు. శస్త్రచికిత్స ద్వారా మార్పిడి చేసిన పేగు లోపలి భాగం ఆరోగ్యంగా, సాధారణంగా కనిపించింది. బయాప్సీ (చిన్న కణజాల నమూనాను తీసుకుని చేస్తారు)లో కూడా కొత్త పేగు బాగా పనిచేస్తోందని తేలింది.

**ఉస్మానియా డాక్టర్లకు సీఎం రేవంత్ అభినందనలు**

హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని పేగు మార్పిడి ఆపరేషన్ ను విజయవంతం చేసిందుకు సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. షార్ట్ గట్ సిండ్రోమ్ తో బాధపడుతున్న 40 ఏళ్ల వ్యక్తి ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో చివరికి ఉస్మానియా ఆసుపత్రికి వచ్చాడు. ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఆ వ్యక్తికి శస్త్ర చికిత్స చేసేందుదు ముందుకు వచ్చారు. దేశంలోనే తొలిసారిగా పేగు మార్పిడి ఆపరేషన్ ను విజయవంతం చేయడం విశేషం. ప్రస్తుతం ఆ వ్యక్తి కోలుకుంటున్నాడు. ద్రవ ఆహార పదార్థాలను సులభంగా తీసుకోగలుగు తున్నాడు. ఈ ఆపరేషన్ ఒక్క తెలంగాణలోనే యావత్ భారత దేశంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లోని వైద్య రంగంలోని మొట్టమొదటి విజయవంతమైన పేగు మార్పిడి ఆపరేషన్ గా నిలిచింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ చారిత్రాత్మక విజయం మన రాష్ట్రానికే కాదు.. దేశానికే గర్వకారణం అన్నారు. వైద్య బృందాన్ని అభినందిస్తూ పబ్లిక్ హెల్త్ కేర్ రంగంలో ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్యులు కొత్త బెంచ్ మార్క్ ను నెలకొల్పారని కొనియాడారు.




# మహిళా సాధికారతతోనే సామాజిక ఎదుగుదల

## పీఏసీ చైర్మన్ అరికెపూడి

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** సమాజంలో సగభాగమైన మహిళ అన్ని రంగాలలో రాణిస్తుందని, మహిళల ఆర్థిక స్వావలంబనతోనే వారి కుటుంబ ఎదుగుదల, తథానుగుణంగా సామాజిక అభ్యున్నతి సాధ్యపడుతుందని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధి జవహర్ నగర్ కాలనీలో గల ఆల్ కైర్ కార్యాలయంలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టైలరింగ్, మెహింది డిజైనింగ్, కంప్యూటర్ శిక్షణ తరగతులను పూర్తి చేసుకున్న స్థానిక మహిళలు, యువతులకు చైర్మన్ అరికెపూడి తన చేతుల మీదుగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు, మహిళలకు వివిధ రంగాలలో శిక్షణను అందించి వారిని నిష్ణార్థులుగా తీర్చిదిద్ది తమ కాళ్లపై తాము నిలబడేలా చేసి ఆర్థిక స్వావలంబనకై ఆల్ కైర్ సంస్థ ఎనలేని కృషి చేస్తుందని, ఈ సందర్భంగా అల్ కైర్ సంస్థ ప్రతినిధులను తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. మహిళలకు టైలరింగ్, మెహింది డిజైనింగ్, కంప్యూటర్ తదితర రంగాలలో ప్రత్యేక శిక్షణను ఇచ్చి సర్టిఫికెట్లను అందించడంతోపాటు వారు ఉపాధిని సైతం పొందేలా ప్రోత్సాహకాన్ని అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు మార్గాన్ని సుగమం చేయడం గొప్ప విషయం అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు చాలామంది ఇంటి వద్దనే ఉంటుంటారని, అలాంటివారికి అల్ కైర్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి ఉపాధిని కల్పించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, మహ్మద్ ముబషీర్, అహ్మద్, మహమ్మద్ వకీల్ అహ్మద్, మహ్మద్ బేగ్, అక్బర్ ఖాన్, యూసఫ్ పాషా, నజీర్ ఖాన్, అక్తర్ ఖాన్, జుబేర్ బేగ్, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలు పేద ప్రజలకు వైద్య సేవలు ఉచితంగా అందించాలి

## పిఏసి చైర్మన్ అరికెపూడి



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** నగరంలోని కార్పొరేట్ వైద్య సంస్థలు సామాజిక సేవా బాధ్యతలో భాగంగా తప్పకుండా పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సేవలు అందించడం ద్వారా సమాజ ఉన్నతికి తోడ్పాటునందించాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు చందానగర్ డివిజన్ దీప్తి శ్రీ నగర్ పరిధి పిజెఆర్ ఎన్ క్లేవ్ రోడ్డులోగల శిరీష నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీప్తి శ్రీనగర్ పిజార్ ఎంక్లేవ్ రోడ్డులో ఉన్న శిరీష నర్సింగ్ హోమ్ వైద్యులు పేద ప్రజల ఆరోగ్యం నిమిత్తం స్వచ్ఛందంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిరీష నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, ఉచిత మెగా వైద్య శిబిరం ఆర్థికంగా వెనుకబడిన రోగులకు ఎంత ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సదరు ఉచిత వైద్య శిబిరం దీప్తి శ్రీనగర్ కాలనీ వాసులకు, పరిసర ప్రాంతాల పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. క్యాన్సర్ మహమ్మారిని మొదటి దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత క్యాన్సర్ స్క్రినింగ్ పరీక్ష వలన ప్రజలకు సాంత్వన చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీప్తి శ్రీ నగర్, పిజెఆర్ ఎన్ క్లేవ్ పరిసర ప్రాంతాల్లో చాలామంది నిరుపేదలు, మధ్యతరగతికి చెందినవారు నివసిస్తుంటారని, అందువల్ల ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మధ్యతరగతి కుటుంబీకులకు పలు వైద్య సేవలు అందుకోవడానికి ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. అదేవిధంగా ఉచిత మెగా వైద్య శిబిరంలో గుండె సంబంధిత పరీక్షలు, రక్త పరీక్షలు, జనరల్, దంత వైద్యం, బీపీ, షుగర్, గైనకాలజీ,ఆర్థో, ఈసిజి, ఇఎన్టి వంటి సేవలు అందుబాటులో ఉంచడం, వాటిని నిరుపేద వర్గాలు సద్వినియోగం చేసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం అభినందనీయమని, వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం చాల గొప్ప విషయమని పీఏసీ చైర్మన్ అరికపూడి పునరుద్ఘాటించారు. కార్పొరేటు వైద్య సంస్థలు తప్పకుండా సామాజిక బాధ్యత కోణంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించాల్సిన బాధ్యతను ఆయన గుర్తు చేశారు. మానవతా దృక్పథంతో ఉచితంగా మందులు పంపిణిచేసి పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంపై పలువురు రోగులతో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కిరణ్, శిరీష మరియువైద్య సిబ్బంది, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎస్ గిరికి మహారాష్ట్ర రత్న అవార్డు

## గ్రామ ప్రజల అభినందనల వెల్లువ




**తాండూరు (జనంసాక్షి)** మహారాష్ట్రలో తాండూరు నియోజకవర్గం యాలాల మండలానికి చెందిన వాసికి మహారాష్ట్ర రత్న అవార్డు అందజేశారు. యాలాల మండలం పగిడిపల్లికి చెందిన ఎఫ్ఎస్ గిరి. గత కొన్ని ఏళ్ల క్రితం చిన్నతనంలోనే ఎఫ్ఎస్ గిరి మహారాష్ట్ర ప్రాంతానికి వలస వెళ్లారు. ఎంతో కష్టపడి అక్కడే స్థిరపడి వృద్ధిలోకి వచ్చారు. కొన్నేళ్ల నుంచి మహారాష్ట్ర ప్రాంతంలో కాలేజీ విద్యాసంస్థలు నడిపడిపిస్తున్నారు. దాదాపు 5 కాలేజీలు నడిపిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తుచేశారు.ఏఎంఈ, బీఎస్సీ, అవిషన్ ఇన్సుట్యూట్ ద్వారా ఇందిర ఇన్సుట్యూట్ ఆఫ్ ఏయిర్ క్రాఫ్ట్ ఇంజనీరింగ్ కాలేజీ వ్యవస్థాపకులు ఉన్నారు. ఎఫ్ఎస్ గిరి అందిస్తున్న సామాజిక సేవ, విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషికిగాను అక్కడి శాలిని ఫౌండేషన్ అండ్ సెలబ్రిటీ ఇండియా న్యూస్ ప్రతినిధులు ఎఫ్ఎస్ గిరికి మహారాష్ట్ర రత్న అవార్డుతో సత్కరించారు. ఈ విషయం తెలుసుకున్న యాలాల మండలంలోని సోంతూరు ప్రజలు ఎఫ్ఎస్ గిరిని అభినందించారు. ఎఫ్ఎస్ గిరి జుంటుపల్లిలోని రామస్వామి భక్తుడు కూడా. ఆయన ఆశీర్వాదంతోనే యాలాల నుంచి మహారాష్ట్రకు వలస వెళ్లి ఉన్నత వ్యక్తిగా ఎదిగారని గ్రామస్తులు గుర్తు చేశారు.

# కుంట్లూరులో దగ్ధమైన ఇండ్లకు లక్ష రూపాయలు ఇవ్వాలి

## గుడిసెలు వేసుకున్న వారందరికి పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించివ్వాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** అబ్దుల్లాపూర్‌మెట్టు, కుంట్లూరులో జరిగిన ఘోరమైన అగ్నిప్రమాదంలో ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణ సహాయం క్రింద లక్ష రూపాయలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెంట్ రెవెన్యూ పరిధిలోని కుంట్లూరు వద్ద గల రావినారాయణ రెడ్డి కాలనీలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని సాంబశివరావు పరిశీలించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఈ ఘోర అగ్నిప్రమాదంలో దాదాపు 300ల వరకు గుడిసెలు కాలి పోయాయని, గ్యాస్ సిలెండర్స్ పేలడం వలన ప్రమాద తీవ్ర ఎక్కువైందని అన్నారు. గుడిసెలు వేసుకున్న వారందరూ కష్టజీవులని, ఇండ్లలలో పనిచేసేవారు, ఆటోలు నడిపేవారని పేర్కొన్నారు. భూ మాఫియా నుంచి ఈ భూమిని రక్షించి పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నీడన రాష్ట్రంలోని వేరువేరు ప్రాంతాల నుంచి వచ్చి గుడిసెలు వేసుకున్నారని ఇప్పుడు ఆ గుడిసెలు కాలి పోవడం వలన వీధిన పడ్డారని అన్నారు. కలెక్టర్,రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిశీలించారని, కలెక్టర్ తక్షణ సహాయం క్రింద ఆరున్నర వేలు ఇస్తామన్నారని, ఇంకా ప్రభుత్వంతో ఇంకా కొంత ఇప్పిస్తామని చెప్పారన్నారు. ఈ డబ్బు ఏమాత్రం సరిపోదని, ఆపదలో వున్న వారిని ఆదుకోవాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపైన ఉన్నదని వారు పేర్కొన్నారు. పార్టీ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకువెళ్ళి పూర్తి నష్టపరిహారం ఇప్పిస్తానని అన్నారు. ఈ భూమిని భూమాఫీయాలు కొట్టేయ కుండా పార్టీ అడ్డుకున్న దని, ఈ కేసు కోర్టులో ఉన్నదని ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని తెలిపారు. ఇక్కడ కరెంట్, మంచినీటి వసతి లేదని, రోహింగ్యాలకు సైతం మంచినీరు ఇస్తున్నామని, మన రాష్ట్ర ప్రజలకు ఇవ్వకుండా ఉండటం దురదృష్టకరమని, ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచించాలని అన్నారు. ఇక్కడ దాదాపు 100 ఎకరాలలో 8 వేల మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారందరికి పట్టాలు ఇచ్చి మౌళిక వసతులు కల్పించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# సజీవ సాక్ష్యాలు.. వెలిశాల స్థూపాలు



విప్లవాలకు పురిటిగడ్డ.. ఎందరో మావోయిస్టు అమరవీరుల జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యం.. అక్కడ వారందరి గుర్తుగా స్తూపాలు ఉంటాయి.. విగ్రహాలు కూడా నిర్మించారు.. మరోవైపు పోలీసులు ఆనాటి కాలంలో ఏర్పాటు చేసిన శాంతి స్తూపం సైతం దర్శనమిస్తుంది.. ఓవైపు అమరవీరులను స్మ రించుకునే స్తూపం.. మరోవైపు శాంతికినిలయంగా ఉండాలంటూ చెప్పేస్తూపం ఆ ఊరి ప్రత్యేకత.. అదే టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామం.. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చల ప్రతినిధిగా వెళ్లిన మావోయిస్టు అగ్రనేత గాదర్ల రవి అలియాస్ గణేశ్ స్వగ్రామం ఇదే కావడం విశేషం...

## విప్లవాలకు బీజం వేసిన ఊరు

## ఒకప్పుడు మావోల అమరుల స్తూపాలుంటే

## పోలీసులు ఇక్కడ శాంతిస్తూపం నిర్మించారు

## ఇది వెలిశాల ఊరు ప్రత్యేకత

పోలీసులు మావోయిస్టుల చర్యలను ఖండిస్తూ లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ ప్రత్యేకంగా శాంతిస్తూపం నిర్మించారు.

**టేకుమట్ల, ఏప్రిల్ 27 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామం ఒకప్పుడు మావోయిస్టులకు పుట్టినిల్లుగా పేరుగాంచింది. ఒకే కుటుంబం నుండి ముగ్గురు సోదరులు విప్లవ బాట పట్టి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదగిన చరిత్ర కూడా ఈ ఊరికి ఉంది. ఈ నేపథ్యంలో అప్పట్లో పోలీసులు ఈ ఊరిపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారు. మావోయిస్టులు లొంగిపోవాలని అనేక ప్రయత్నాలు చేశారు. ఒకానొకప్పుడు అటు పోలీసులు, ఇటు మావోల చర్యలతో ఈ ప్రాంత గ్రామాలన్నీ అట్టుడికేవి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. అనేక ప్రయత్నాలు జరిపిన



### స్తూపాల వెలిశాల..

అటు పోలీసులు, ఇటు మావోయిస్టుల చర్యలతో అట్టుడికిన ఈ గ్రామంలో బంధుమిత్రుల కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన స్తూపాలతో వెలిశాల కాస్త స్తూపాల వెలిశాలగా మారింది. 2001లో గాదర్ల రమేశ్ అలియాస్ నవీన్ దామెర సమీపంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృ తిచెందగా... బంధుమిత్రుల కమిటీ, అమరుల కుటుంబసభ్యులు కలిసి గ్రామంలో నవీన్ స్మారకార్థం స్తూపం నిర్మించారు. అదే ఏడాది ఏటూరునాగారం ప్రాంతంలో పోలీసులు ప్రయాణిస్తున్న బస్సును మావోయిస్టులు పేల్చివేశారు. వెలిశాలకు చెందిన గాదర్ల రవి అలియాస్ గణేశ్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని భావించి అప్పటి చిట్యాల సీఐ శ్యాంసుందర్ రెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్ స్వచ్ఛందంగా వచ్చిన డబ్బులు సుమారు రూ. 2లక్షల వ్యయంతో 2002లో శాంతిస్తూపాన్ని నిర్మించి, అక్కడి ప్రాంగణాన్ని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. మావోయిస్టులు ఎలాంటి ఘటనలకు పూనుకోకూడదని, లొంగిపోయి స్వేచ్ఛా జీవితాన్ని గడపాలని కోరుతూ నిర్మించిన శాంతిస్తూపాన్ని అప్పటి మావోయిస్టు నేత తండ్రితో ప్రారంభోత్సవం చేయించారు. తదనంతరం అనుసాన్ పల్లి వద్ద జరిగిన ఎన్ కౌంటర్ కు నిరసనగా మావోయిస్టులు శాంతిస్తూపాన్ని పేల్చేయగా స్వల్పంగా ధ్వంసం అయింది. కాగా పోలీసులు దానికి మరమ్మతులు చేసి బాగు చేశారు. గ్రామానికి చెందిన గాదర్ల సారయ్య అలియాస్ ఆజాద్ సుమారు 30ఏళ్ల పాటు అజ్ఞాతంలో పని చేసి మిలిటరీ ప్లాటూన్ కమిటీ కమాండర్, కేంద్రకమిటీ సభ్యుడిగా కొనసాగుతూ.. 2008 ఏప్రిల్ లో ఏటూరు నాగారంలోని కంతనపల్లి అడవిలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందాడు. ఆయన స్మారకార్థం కుటుంబ సభ్యులు గ్రామంలో 2009లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన విగ్రహాన్ని అప్పట్లో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేయగా తిరిగి నిర్మించి అవిష్కరించారు.

### ఇప్పటికీ ఉద్యమంలోనే..

వెలిశాలకు చెందిన గాదర్ల కుటుంబంలో ముగ్గురు సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లగా గాదర్ల సారయ్య అలియాస్ ఆజాద్ ఎన్ కౌంటర్ లో మృతిచెందాడు. మరో సోద రుడు గాదర్ల అశోక్ అలియాస్ జనార్ధన్ అనారోగ్య కారణాలతో పోలీసులకు లొంగిపోయి స్వేచ్ఛా జీవితం గడుపుతున్నాడు. మరో సోదరుడు గాదర్ల రవి అలియాస్ గణేశ్ ఇప్పటికీ ఉద్యమంలోనే కొనసాగుతున్నాడు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో మావోయిస్టుల తరపున చర్చల ప్రతినిధిగా గణేశ్ పాల్గొన్నాడు. మారిన పరిస్థితుల కనుగుణంగా గణేశ్ రాష్ట్రాన్ని విడిచి పొరుగు రాష్ట్రాల్లో కొనసా గుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా అటు పోలీసులు, ఇటు మావోయిస్టుల చర్యలతో అట్టుడికిన వెలిశాలలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం ఉన్నప్పటికీ, నాటి స్తూపాలు మాత్రం ఆనాటి చర్యలకు జ్ఞాపకాలుగా మిగిలాయి. రాష్టంలో ఎక్కడా లేని విధంగా పోలీసులు శాంతికి చిహ్నంగా శాంతి స్తూపం నిర్మించడం ఇక్కడ ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు.







# స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కొనసాగింపు

2025 ఏప్రిల్‌లో భారత స్టాక్ మార్కెట్ అస్థిరత మదుపరులకు ఆందోళన కలిగిస్తోంది. సెన్సెక్స్ 588.90 పాయింట్లు తగ్గి 79,212.53 వద్ద, నిఫ్టీ 207.35 పాయింట్లు పడిపోయి 24,039.35 వద్ద ముగిశాయి. స్మాల్, మిడ్-క్యాప్ షేర్లు 3-4% నష్టపోయాయి. మదుపరులు బంగారం, బాండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ అస్థిరతకు భారత్-పాక్ ఉద్రిక్తతలు, గ్లోబల్ ట్రేడ్ వార్, రూపాయి బలహీనత, ఆర్థిక మందగమనం కారణాలు. భారత్-పాక్ ఉద్రిక్తతలు: ఏప్రిల్ 22, 2025న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ రూ.9.7 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. రాజకీయ అనిశ్చితి మదుపరులలో భయాన్ని రేకెత్తించింది.

యూఎస్ టారిఫ్‌లు (ఎలక్ట్రానిక్స్, ఆటో భాగాలు) మరియు చైనా 34% రీటాలియేటరీ టారిఫ్‌లు గ్లోబల్ మార్కెట్లను అస్థిరపరిచాయి. భారత ఎగుమతులు (టెక్స్‌టైల్స్, కెమికల్స్) ప్రభావితమయ్యాయి. రూపాయి బలహీనత: రూపాయి ఒక డాలర్‌కు 85.70-85.75 వద్ద ట్రేడ్ అయింది. ఎఫ్‌పిఐ రూ.61,000 కోట్లను ఉపసంహరించారు, యూఎస్ డాలర్ బలపడటం, ట్రెజరీ రాబడులు కారణం. ఆర్‌బిఐ జోక్యం పరిమిత విజయం సాధించింది. 2024-25లో జిడిపి వృద్ధి 6.4% (ఆర్‌బిఐ అంచనా 6.6% కంటే తక్కువ). ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, తక్కువ వినియోగ వ్యయం విశ్వాసాన్ని దెబ్బతీశాయి. నిఫ్టీ 50 కంపెనీలు 5% ఆదాయ వృద్ధి నమోదు చేశాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగం నష్టాలను చవిచూసింది, నిఫ్టీ ఫైనాన్షియల్ ఇండెక్స్ మార్చి 2025లో 9% పెరిగినప్పటికీ స్థిరత్వం అనిశ్చితం. ఐటి రంగం గ్లోబల్ టెక్ ఖర్చు తగ్గడంతో సవాళ్లను ఎదుర్కొంది. ఆటో రంగం టారిఫ్‌లు, డిమాండ్ తగ్గుదలతో దెబ్బతింది. రిటైల్ రంగం 12.91% తగ్గింది, వినియోగదారుల సెంటిమెంట్ బలహీనతను సూచిస్తుంది.




మదుపరులకు సూచనలు

జాగ్రత్తగా వ్యవహరించండి. బంగారం, ఫిక్స్‌డ్-ఇన్‌కమ్ సెక్యూరిటీలు స్థిరత్వం ఇస్తాయి. బలమైన ఫండమెంటల్స్ ఉన్న కంపెనీలలో పెట్టుబడి, డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో నిర్వహించండి. చారిత్రకంగా, భారత మార్కెట్ క్రాష్‌ల తర్వాత రికవరీ అయింది. మార్చి 2025 నాటికి, ఈక్విటీ సూచీలు 7% లాభపడ్డాయి, బ్యాంకింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో ఆసక్తి కనిపించింది. సెన్సెక్స్ మధ్య-2025 నాటికి 78,500, ఏడాది చివరికి 80,850కి చేరవచ్చని అంచనా. రికవరీ అసమానంగా ఉంటుంది, దీర్ఘకాల వృద్ధి భారత ఆర్థిక ఫండమెంటల్స్‌పై ఆధారపడుతుంది.

ఈ సేల్‌లో ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, హోమ్ అప్లయన్సెస్, కిచెన్ ఎసెన్షియల్స్, హోమ్ డెకర్ మరియు మరెన్నో కేటగిరీల్లో భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ సేల్‌పై ఆసక్తి ఎక్కువగా ఉంది, ఎందుకంటే స్మార్ట్‌ఫోన్లు, ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు వంటి ఉత్పత్తులపై ఆకర్షణీయమైన ఆఫర్లు ఉంటాయి. సేల్‌లో సాధారణంగా 70-80% వరకు డిస్కౌంట్లు, బ్యాంక్ ఆఫర్లు, నో-కాస్ట్ ఇఎంఐ ఆప్షన్లు, ఎక్స్ఛేంజ్ డీల్స్ మరియు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉంటాయి.




# వచ్చే వారం రానున్న ఐపీఓలు

స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలక అలర్ట్ వచ్చేసింది. వచ్చే వారం (ఏప్రిల్ 28) నుంచి మార్కెట్లోకి కొత్త ఐపీఓలు రాబోతున్నాయి. ఏథర్ ఎనర్జీ ఐపీఓ సహా ఇంకొన్ని వస్తున్నాయి. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం.

**ఏథర్ ఎనర్జీ ఐపీఓ:** మెయిన్‌బోర్డ్ విభాగం నుంచి వస్తున్న ఈ ఇష్యూ విలువ రూ. 2,981.06 కోట్లు. ఇది ఏప్రిల్ 28న ప్రారంభమై, ఏప్రిల్ 30న ముగుస్తుంది. మే 2న షేర్ల కేటాయింపు, మే 6న షేర్లు బిఎస్ఈ, ఎన్ఎస్ఈలో జాబితా చేయబడతాయి. ఈ ఐపీఓలో బిడ్డింగ్ ధర బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 304-321. లాట్ సైజు 46.

**ఐవేర్ సప్లైచైన్ సర్వీసెస్ ఐపీఓ:** ఈ ఇష్యూ సైజు రూ.27.13 కోట్లు, ఏప్రిల్ 28న ప్రారంభమై, ఏప్రిల్ 30న ముగుస్తుంది. ఇందులో మీరు ఒక్కో షేరుకు రూ.95 ధరకు 1200 లాట్‌లో బిడ్ చేయవచ్చు. ఇష్యూ ముగిసిన తర్వాత, మే 2న కేటాయింపు జరుగుతుంది. షేర్లు మే 6న బిఎస్ఈ, ఎస్ఎంఈ లో లిస్ట్ చేయబడతాయి. ఈ ఇష్యూలో 28.56 లక్షల కొత్త షేర్లు మాత్రమే ఉంటాయి.

**అరుణయ ఆర్గానిక్స్ ఐపీఓ:** ఇది కూడా ఏప్రిల్ 29న ప్రారంభమవుతుంది. దీని బిడ్డింగ్ షేరుకు రూ. 55-58 మధ్య ఉంటుంది. రూ. 2,000 లాట్స్ తీసుకోవాలి. ఈ ఐపీఓ పరిమాణం రూ.33.99 కోట్లు. మే 5న షేర్ల కేటాయింపు, మే 7న షేర్లు బిఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టింగ్ ఉంటుంది. ఈ ఐపీఓ ద్వారా రూ.30.51 కోట్ల విలువైన 52.60 లక్షల కొత్త షేర్లు, రూ.3.48 కోట్ల విలువైన 6 లక్షల షేర్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

**కెర్నిక్ ఇండస్ట్రీస్ ఐపీఓ:** ఈ ఇష్యూ పరిమాణం రూ. 8.75 కోట్లు. ఈ ఐపీఓ ఏప్రిల్ 29న ప్రారంభమై, మే 6న ముగుస్తుంది. మే 7న షేర్ల కేటాయింపు ఉంటుంది. ఈ ఐపీఓలో బిడ్డింగ్ ధర షేరుకు రూ. 25, లాట్ సైజు 6000. ఇష్యూ ముగిసిన తర్వాత, మే 9న షేర్లు బిఎస్ఈ, ఎస్ఎంఈ లో షేర్లు లిస్ట్ చేయబడతాయి.

**వ్యాగన్స్ లెర్నింగ్ ఐపీఓ:** రూ. 38.38 కోట్ల ఈ ఇష్యూ మే 2న ప్రారంభమై, మే 6న ముగుస్తుంది. కేటాయింపు మే 7న ఉంటుంది. షేర్లు మే 9న బిఎస్ఈ, ఎస్ఎంఈలో లిస్ట్ కానున్నాయి. ఈ ఐపీఓ ధర బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 78-82. లాట్ సైజు 1600 షేర్లు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 610 | ₹ 59.2 |
| వరంగల్ | ₹ 612 | ₹59.4 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 99,150 (24 క్యారెట్లు) | ₹ 90,020 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹90,020 (22 క్యారెట్లు) | ₹98,210 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,11,900



## ఏథర్ ఎనర్జీ ఐపీఓ

2025 ఏప్రిల్‌లో భారత స్టాక్ మార్కెట్ గణనీయమైన అస్థిరతను ఎదుర్కొంటోంది, సెన్సెక్స్ 588.90 పాయింట్లు తగ్గి 79,212.53 వద్ద, నిఫ్టీ 207.35 పాయింట్లు పడిపోయి 24,039.35 వద్ద ముగిశాయి. ఈ సందర్భంలో, ఏథర్ ఎనర్జీ, భారతదేశంలో ప్రముఖ ఎలక్ట్రిక్ టూ-వీలర్ తయారీ సంస్థ, తన ఐపీఓను ఏప్రిల్ 28, 2025న ప్రారంభించడానికి సిద్ధమవుతోంది, ఇది 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి మెయిన్‌బోర్డ్ ఐపీఓగా గుర్తించబడుతోంది. ఏథర్ ఎనర్జీ ఐపీఓ రూ.2,980.76 కోట్ల బుక్-బిల్ట్ ఇష్యూ, ఇందులో 8.18 కోట్ల ఈక్విటీ షేర్ల ఫ్రెష్ ఇష్యూ (రూ.2,626 కోట్లు) మరియు 1.11 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ (రూ.354.76 కోట్లు) ఉన్నాయి. షేరు ధర శ్రేణి రూ.304 నుంచి రూ.321గా నిర్ణయించబడింది, కనీస లాట్ సైజు 46 షేర్లు, రిటైల్ ఇన్వెస్టర్లకు కనీస పెట్టుబడి రూ.13,984 (కట్-ఆఫ్ ధర వద్ద రూ.14,766). ఐపీఓ ఏప్రిల్ 28 నుంచి 30 వరకు ఓపెన్ అవుతుంది, షేర్ల అలాట్‌మెంట్ మే 2, 2025న ఖరారు కానుంది, మరియు బిఎస్ఈ, ఎన్ఎస్ఈలో మే 6, 2025న లిస్టింగ్ అవుతుంది.

## జీవిత బీమా పాలసీదారులకు రైడర్లతో మరింత రక్షణ

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. హఠాత్పరిణామాలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండటమే ఉత్తమ వ్యూహం. ఆపద నుంచి రక్షించే కవచాల్లో బీమా ఒకటి. అది ఉంటే మీకే కాదు.. మీ కుటుంబ భవిష్యత్‌కూ ధీమా. అయితే, ఏ బీమా పథకమైనా కొన్ని సందర్భాల్లో పాలసీదారును ఆకస్మిక అవసరం నుంచి గట్టెక్కించలేకపోవచ్చు. అలాంటప్పుడే రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీని విస్తరించే అదనపు ఫీచర్ల జోడింపే రైడర్. ఇవి పాలసీ పరిధిని విస్తృతపరచడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ పరిగణించాల్సిన పాలసీ. పాలసీదారు పాలసీ గడువు కాలంలో దురదృష్టవశాత్తు మరణిస్తే.. తన కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసాను కల్పిస్తుంది. టర్మ్ పాలసీ ద్వారా ఎంత మేర బీమా కవరేజీ కలిగి ఉండాలన్నది వ్యక్తి లేదా కుటుంబ అవసరంపై ఆధారపడి ఉంటుంది.

# రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350

భారత్‌కు చెందిన ప్రముఖ టూవీలర్ తయారీ కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ పాపులర్ మోడల్ అయిన హంటర్ 350 అప్‌డేట్ వెర్షన్‌ను భారత్‌లో రిలీజ్ చేసింది. ముంబయి, ఢిల్లీల్లో 'హంటర్స్‌హుడ్' ఫెస్టివల్ నిర్వహించి.. హంటర్ 350 బైక్‌ని లాంచ్ చేసింది. ఈ బైక్ రియో వైట్, టోక్యో బ్లాక్, లండన్ రెడ్ రంగుల్లో అందుబాటులో ఉండనున్నది. పాత మోడల్‌తో పోలిస్తే ఇందులో పలు మార్పులు చేసింది. మెరుగైన రైడింగ్ కోసం ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, ట్రిప్పర్ నావిగేషన్ పాడ్, టైప్-సీ యూఎస్‌బీ సపోర్ట్ అందించింది.

గ్రౌండ్ క్లియరెన్స్‌ని 10 ఎంఎంకి పెంచింది. అలాగే, రియర్‌లో సస్పెన్షన్‌లో సైతం మార్పులు చేసింది. దాంతో పాటు సీట్ కంఫర్ట్ ఉండేలా మార్పులు చేసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ రేంజ్‌లో స్లిప్పర్-అసిస్ట్ క్లచ్ ఉన్న తొలి బైక్ ఇదే కావడం విశేషం. అయితే, కంపెనీ ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లోని 349సీసీ, ఎయిర్-ఆయిల్ కూల్డ్, జే సిరీస్ ఇంజిన్‌ను యథాతథంగా కొనసాగించింది. ఈ బైక్ 5 స్పీడ్ గేర్‌బాక్స్‌తో రానున్నది. 20.2 బీహెచ్‌పీ పవర్ వద్ద 27 ఎన్ఎం టార్క్‌ని ఉత్పత్తి చేయనున్నది. ఇక ఈ బైక్ మూడు వేరియంట్లలో అందబాటులో ఉండనున్నది. ఫ్యాక్టరీ బ్లాక్ ధర రూ.1,49,900గా నిర్ణయించింది. రియో వైట్, డాపర్ గ్రే వేరియంట్ రూ.1,76,750కి అందుబాటులో ఉంటుంది. ఇక టోక్యో బ్లాక్, లండన్ రెడ్, రెబెల్ బ్లూ వేరియంట్ బైక్ రూ.1,81,750గా తెలిపింది. అయితే, ఇవన్నీ ఎక్స్‌షోరూం ధరలు (చెన్నై) మాత్రమే. ఈ హంటర్ 350 బైక్ కోసం రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్లతో పాటు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని.. త్వరలోనే బైక్‌ల డెలివరీలు ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది.







## అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్ 2025

అమెజాన్ ఇండియా తన అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే షాపింగ్ ఈవెంట్‌లలో ఒకటైన గ్రేట్ సమ్మర్ సేల్ 2025ను మే 1, 2025 నుంచి ప్రారంభించనుంది. ఈ సేల్ మధ్యాహ్నం 12 గంటలకు అధికారికంగా ప్రారంభమవుతుంది, అయితే అమెజాన్ ప్రైమ్ సభ్యులకు 12 గంటల ముందు, అంటే ఏప్రిల్ 30 అర్ధరాత్రి నుంచి ఈ సేల్‌లోని డీల్స్‌ను యాక్సెస్ చేసే అవకాశం ఉంటుంది. ఈ సేల్ సాధారణంగా 5-7 రోజుల పాటు కొనసాగుతుంది, అయితే ఖచ్చితమైన ముగింపు తేదీని అమెజాన్ ఇంకా ప్రకటించలేదు.

# క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగా కాదు : ఉక్రెయిన్



రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా, క్రిమియాపై రష్యా నియంత్రణను అమెరికా గుర్తించిందని.. ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. తాజాగా ఈ విషయంపై ఉక్రెయిన్ స్పందిస్తూ.. అమెరికా చేసిన శాంతి ప్రతిపా దనలో క్రిమియాపై రష్యా అధికారం ఉంటుందని పేర్కొనడం తమను షాక్కు గురిచేసిందని పేర్కొంది. క్రిమియాను తామెన్నటికీ రష్యాలో భాగంగా గుర్తించమని.. అమెరికా ప్రతిపాదనను అంగీకరించబోమని తేల్చిచెప్పింది. అమెరికా ప్రతిపాదనకు అసలు అర్థమే లేదని జెలెన్ స్కీ పార్టీ శాసనసభ్యుడు ఒలెక్సాండర్ మెరెట్కో అన్నారు. క్రిమియాను రష్యా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని.. దానిని ఆ దేశానికి పూర్తిగా ఇచ్చేయడం అసాధ్యమని పేర్కొన్నారు.

దీనికి తమ దేశ రాజ్యాంగంలో మార్పులు చేయాల్సి ఉంటుందని.. దేశవ్యాప్తంగా ప్రజల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. క్రిమియాను వదులుకోవడం అంటే తమ అధ్యక్షుడు జెలెన్స్కకి రాజకీయ ఆత్మహత్యతో సమానమని అన్నారు. దీనివల్ల ఆయన భవిష్యత్తులో ఎన్నో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అంతే కాకుండా దీనిని తమ దేశంలో రాజద్రోహంగా పరిగణిస్తారని.. ఉక్రెయిన్ ప్రభుత్వం ఎప్పటికీ అటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు.. ఉక్రెయిన్ ప్రభుత్వం రాజకీయంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తాము ఈ పోరాటాన్ని ఎన్నటికీ ఆపబోమని ఉక్రెయిన్ సైనిక అధికారులు పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయారని.. వారి త్యాగాలకు ఫలితం కచ్చితంగా తమ దేశ ప్రజలకు దక్కాలని అన్నారు. దక్షిణ ఉక్రెయిన్ నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా .. వ్యూహాత్మక ప్రాంతం. 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడిన ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని చెప్పారు. అయితే, ఉక్రెయిన్పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్ కు సూచించారు. శనివారం వాటికన్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమైన అనంతరం ట్రంప్ రష్యా అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. పుతిను యుద్ధం ఆపాలన్న ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదన్న విషయం తనకు అర్థమవుతోందని అన్నారు.




## సినీ ఇండస్ట్రీలో డ్రగ్స్ కలకలం

### ఇద్దరు దర్శకులు అరెస్ట్

మలయాళ చిత్రపరిశ్రమలో గత కొన్ని రోజులుగా డ్రగ్స్ కలకలం సృష్టిస్తోంది. డ్రగ్స్ తీసుకుంటున్నారనే ఆరోపణలతో ఇప్పటికే నటుడు షైన్ టామ్ చాకోను అరెస్ట్ చేయగా, తాజాగా మరో ఇద్దరు దర్శకులను అరెస్ట్ చేశారు. దర్శకులు ఖలీద్ రెహమాన్, అష్రఫ్ హంజాతో పాటు వారి స్నేహితుడు షలీఫ్‌ను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేయగా, వెంటనే బెయిల్పై బయటకు వచ్చారు.దర్శకుల అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి కొచ్చిన్ ఎక్సైజ్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే వారి దగ్గర నుంచి కొద్ది మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురు వ్యక్తులు కొన్నేళ్ల నుంచి గంజాయి తీసుకుంటున్నారని ప్రాథమిక విచారణలో తేలిందని అన్నారు. సినిమాకు సంబంధించిన చర్చల్లో భాగంగా వారంతా ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ను వారికి ఎవరు సప్లై చేస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, మలయాళంలో ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకున్న 'జింఖానా' చిత్రానికి ఖలీద్ రెహమాన్ దర్శకత్వం వహించారు. 'తమాషా' చిత్రానికి అష్రఫ్ హంజా దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

# అమెరికా మంత్రి బ్యాగ్ చోరీ..దొంగ అరెస్ట్!



అమెరికాలో దేశ అంతర్గత భద్రతకు బాధ్యత వహించే డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్రటరీ క్రిస్టీ నియోమ్ ఖరీదైన బ్యాగ్ని ఓ దొంగ అపహరించాడు. దాదాపు వారం రోజుల పాటు పోలీసులు జల్లెడ పట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ నెల 20న క్రిస్ట నియోమ్ తన కుటుంబంతో కలిసి ఈస్టర్ పార్టీ కోసం శ్వేత సౌధానికి సమీపంలో ఉన్న 'ది క్యాపిటల్ బర్గర్ రెస్టారంట్కు వెళ్లారు. అదే సమయంలో ఓ వ్యక్తి ముదురు రంగు దుస్తులు, బేస్బాల్ క్యాప్, ముఖానికి సర్జికల్ మాస్క్ పెట్టుకొని లోపలికి వచ్చాడు. ఒక్కసారి చుట్టూ చూసి.. నియోమ్ పక్క టేబుల్పై కూర్చొని.. బ్యాగ్ను అపహరించుకుపోయాడు. అది ఖరీదైన గూచి బ్రాండ్ బ్యాగ్. దాని ధర 4,400 డాలర్లు (రూ.3.76 లక్షలు). అందులో 3,000 డాలర్ల (రూ.2.56లక్షలు) నగదు, ఆమె పాస్పోర్టు, డీహెచ్ఎస్ బ్యాడ్జ్, అపార్ట్మెంట్ తాళం చెవులు, రహస్య పత్రాలు ఉన్నాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ రెస్టారంట్కు చెందిన సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తి కదలికలు గుర్తించి అరెస్ట్ చేశారు.

ఈ ఘటనపై నియోమ్ ఇటీవల ఓ పాడ్కాస్ట్లో మాట్లాడుతూ "ఈ ఘటనతో నేను షాక్కు గురయ్యాను. నా బ్యాగ్ను కాలి పక్కనే పెట్టుకున్నాను. ఓ వ్యక్తి వచ్చి.. పక్కనే కూర్చొని కాలితో దానిని కొన్ని అడుగుల దూరం లాగి.. దానిపై కోట్ వేసి తీసుకొని వెళ్లిపోయాడు. ఇలాంటి ఘటనల్లో సామాన్య ప్రజలు బాధితులుగా ఉంటారనే విషయం నాకు అర్థమైంది" అని పేర్కొన్నారు. నిందితుడు ప్రొఫెషనల్ దొంగ అని ఆమె వెల్లడించారు. అరెస్ట్ అయిన దొంగ ఈస్ట్ కోస్ట్ గ్యాంగ్ సభ్యుడని అధికారులు చెబుతున్నారు. ఈ ముఠా అత్యంత విలువైన వస్తువులను తస్కరించడంలో దిట్ట అని వెల్లడించారు. నియోమ్కు రక్షణగా ఎప్పుడు సాధారణ దుస్తుల్లో సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఉంటారు. వారు కూడా దొంగతనం జరిగే సమయంలో అదే రెస్టారంట్లో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎస్పీ ఎంపీ కాన్వాయ్‌పై టైర్లు విసిరివేత

లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ కాన్వాయ్‌పైకి కొంత మంది వ్యక్తులు టైర్లు విసిరారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంఘటన వల్ల కొంతమంది వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఈ సంఘటనపై మండిపడ్డారు. ఎస్పీకి చెందిన దళిత ఎంపీ రామ్‌జీ లాల్ సుమన్, రాజ్‌పుత్ రాజు రాణా సంగపై పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలపై కర్ణి సేన ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో గత నెలలో ఆగ్రాలోని ఆయన ఇంటిపై దాడి జరిగింది. కాగా, శనివారం మధ్యాహ్నం రాజ్యసభ ఎంపీ రామ్‌జీ లాల్ సుమన్ కాన్వాయ్ రోడ్డుపై వెళ్తుండగా కర్ణి సేనకు చెందిన వ్యక్తులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఆయన కాన్వాయ్‌పైకి టైర్లు, రాళ్లు విసిరారు.

## 2028లోనూ మాదే అధికారం: డీకే శివకుమార్



**బెంగళూరు:** బాజపా, జేడీ(ఎస్) లపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికార పీఠం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కానీ, వారి ప్రయత్నాలు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డీకే ఈ వ్యాఖ్యలు చేశారు.

"ప్రజలు మాకు అందించిన ఆదరణను మరచిపోలేం. రాష్ట్రంలో పరిపాలన బాగుందని ప్రశంసలు వస్తున్నాయి. మా ప్రభుత్వం ఇటీవల రూ.4 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ను ప్రవేశపెట్టింది. అందరికీ సమాన హక్కులు, జీవితం అనే ఉద్దేశంతో దీన్ని ప్రవేశపెట్టాం. అన్ని వర్గాల వారిని ఏకతాటి పైకి తీసుకొచ్చేందుకు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. గతంలో మహిళలు, యువత, రైతుల అభివృద్ధి కోసం భాజపా, జేడీ(ఎస్) ఏం చేశాయి" అని డీకే శివకుమార్ ప్రశ్నించారు. "ఏదో ఒకటి చేసి మా ప్రభుత్వాన్ని కూల్చేయాలని కుట్రలు చేస్తున్నారు. దాని గురించి ఇంకా కలలు కంటూనే ఉన్నారు. రెండు పార్టీలు ఒక కూటమి ఏర్పాటు చేసుకున్నాయి. మరో నాలుగు పార్టీలు చేరినా మాకు నష్టం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మీరు అనుకున్నది మాత్రం నెరవేరదు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది." అని ధీమా వ్యక్తం చేశారు.

## పహల్గామ్‌లో మళ్లీ సందడి

### ఉగ్రదాడి తర్వాత పెరిగిన పర్యాటకుల తాకిడి

శ్రీనగర్: ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది మరణించిన జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో తిరిగి సందడి నెలకొన్నది. ఉగ్రదాడి జరిగిన ఐదు రోజుల తర్వాత పర్యాటకుల తాకిడి పెరిగింది. వేసవిలో కశ్మీర్ అందాలను ఆస్వాదించేందుకు టూరిస్టులు మళ్లీ పహల్గామ్ బాటపట్టారు. ఆదివారం విదేశీయులతోపాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన టూరిస్టులతో 'లిటిల్ స్విట్జర్లాండ్'గా పేరొందిన ఈ ప్రాంతం కళకళలాడింది. అయితే ఉగ్రదాడి జరిగిన బైసరన్ గడ్డి మైదానం ప్రాంతాన్ని మూసివేశారు. కాగా, ఉగ్రదాడి తర్వాత పహల్గామ్‌ను సందర్శించిన టూరిస్టుల్లో ఎలాంటి భయం కనిపించలేదు. ఉగ్రదాడుల వంటివి ఎక్కడైనా జరిగే అవకాశం ఉందని కొందరు తెలిపారు. 'ఆ సంఘటన ముగిసిపోయిందని మేం భావిస్తున్నాం. అందుకే ఇక్కడకు రావాలని నిర్ణయించాం' అని చెప్పారు. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ గ్రూప్ మద్దతు ఉన్నందున తాము భయపడటం లేదని మహారాష్ట్రకు చెందిన ఒక బృందం తెలిపింది. 'మనం భయపడాల్సిన పనిలేదు. ఏం జరుగాలో అది జరుగుతుంది' అని ఆ గ్రూప్‌లోని ఒకరు అన్నారు.



## కుమార్తెను చంపి.. తల్లి ఆత్మహత్య

ముంబై: ఒక మహిళ తన కుమార్తె గొంతునొక్కి చంపింది. ఆ తర్వాత ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడింది. ఆమె భర్త ఫిర్యాదుతో పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఘన్సోలీ ప్రాంతంలో నివసించే 26 ఏళ్ల ప్రియాంక కాంబ్లే దారుణ నిర్ణయం తీసుకున్నది. ఏప్రిల్ 23న రాత్రి వేళ నిద్రిస్తున్న ఆరేళ్ల కుమార్తె వైష్ణవి గొంతునొక్కి హత్య చేసింది. ఆ తర్వాత సీలింగ్‌కు ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, ఈ సమాచా రం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. తల్లీ, కుమార్తె మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొంతునొక్కడం వల్ల ఆరేళ్ల బాలిక మరణించినట్లు నిర్ధారణ అయ్యింది. అయితే అధిక బీపీతో బాధపడుతు న్న తన భార్య మానసిక ఒత్తిడికి గురవుతున్న దని ప్రియాంక భర్త పోలీసులకు తెలిపాడు. ఈ నేపథ్యంలో ఆమె ఈ దారుణానికి పాల్పడి ఉంటుందని చెప్పాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గడువులోపు భారత్‌ను వీడకుంటే గట్టి చర్యలు

- గడువులోగా పాకిస్తాన్ జాతీయులు వెళ్లకుంటే జైలు శిక్ష
- జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం
- పహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ వార్నింగ్



**న్యూఢిల్లీ (జనంసాక్షి)** :పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ దౌత్యచర్యలు మొదలుపెట్టింది. ఈ చర్యల్లో భాగంగా "సింధు జలాల ఒప్పందం" రద్దు చేసింది. పాక్ జాతీయులకు వీసాలు రద్దు చేయడంతో పాటు డెడ్‌లైన్ లోగా వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్తానీయులను గుర్తించి, వెంటనే బహిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాలను ఆదేశించారు. అన్ని రకాల వీసాల ఉన్నవారు ఏప్రిల్ 26 వరకు దేశం విడిచి వెళ్లాలని, వైద్య వీసాలు కలిగిన వారు 29లోగా వెళ్లాలని భారత్ ఆదేశించింది. ఈ మేరకు భారత్-పాక్ సరిహద్దు "అట్టారీ-వాఘా" బోర్డర్ పాక్ వెళ్లావారితో కిటకిటలాడుతోంది. ఒక వేళ, గడువులోగా భారత్ విడిచివెళ్లకుంటే సదుర పాక్ జాతీయుడిని అరెస్ట్ చేసి విచారించి, మూడు ఏళ్ల వరకు జైలు శిక్ష లేదా గరిష్ఠంగా రూ. 3 లక్షల జరిమానా లేదా రెండింటిని శిక్షగా విధించవచ్చు. ఏప్రిల్ 04న కొత్తగా అమలులోకి వచ్చి ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025 ప్రకారం.. గడువు ముగిసిపోవడం, వీసా షరతుల్ని ఉల్లంఘించడం, నిషేధిత ప్రాంతాలను అతిక్రమించడం వంటివి చేస్తే ఈ శిక్షలు విధించవచ్చు.

"(ఏ) విదేశీయుడైనా, వీసా జారీ చేయబడిని కాలానికి మించి భారతదేశంలో ఏదైనా ప్రాంతంలో ఉన్నా లేదా సెక్షన్ 3లోని నిబంధనల్‌ని ఉల్లంఘించినా, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రాలు లేకుండా భారత్‌లో ఉన్నా, వీసా ఉల్లంఘనలకు కారణమయ్యే ఏదైనా చర్యకు పాల్పడినా, (బి) సెక్షన్లు 17,19 కాకుండా ఈ చట్టంలోని ఏదైనా ఇతర నిబంధనల్ని లేదా దాని కింద చేసిన ఏదైనా నియమాన్ని, ఆదేశాన్ని లేదా చట్ట ప్రకారం ఇచ్చిన ఏదైనా సూచనను, ఆదేశాన్ని ఉల్లంఘించినా 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ.3 లక్షల వరకు జరిమానా లేదా రెండు శిక్షలు విధించే అవకాశం ఉంది" అని చట్టం చెబుతోంది.

# మాయగాళ్ల 'బంగారు' మాటలు నమ్మారో నిండా మునిగినట్లే..!

హైదరాబాద్ (జనంసాక్షి)



బంగారం ధర రికార్డు స్థాయికి చేరింది. రానున్న రోజుల్లో తగ్గుతుందా! పెరుగుతుందా! అనేది చర్చనీయాంశంగా మారింది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ ఉన్న ఈ ఆలోచనను సొమ్ము చేసుకునేందుకు మాయగాళ్లు రంగ ప్రవేశం చేశారు. తక్కువ ధరకే పుత్తడి అంటూ నమ్మించి అందిన కాడికి కొట్టేసి ముఖం చాటేస్తున్నారు. హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర మాయగాళ్ల ముఠా నకిలీ బంగారం అంటగట్టే మోసాలకు పాల్పడుతున్నట్టు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే ప్రకటనలు చూసి నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

బంధువులు దుబాయ్ నుంచి వచ్చేటప్పుడు బంగారం బిస్కెట్లు తీసుకొస్తున్నారని, కావాలంటే తక్కువ రేటుకే ఇస్తానని చెప్పి ఇటీవల ఓ వ్యక్తి వ్యాపారిని మోసగించాడు. 'మా బంధువులు దుబాయ్ నుంచి వస్తున్నారు. వాళ్లు వచ్చేటప్పుడు బంగారం బిస్కెట్లు తెస్తామని చెప్పారు. 10 గ్రాములు రూ.65-70 వేలు పడుతుందన్నారు. అడ్వాన్స్‌గా కొంతిస్తే మీకే రిజర్వ్ చేస్తానంటూ ఓ వ్యక్తి వ్యాపారితో బేరసారాలాడాడు. పరిచయస్తుడు కావటంతో రూ.5.50 లక్షలు చేతికిచ్చాడు.

అందరితో అదే స్టోరీ : రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవటంతో వ్యాపారికి అనుమానం వచ్చింది. దీంతో చుట్టుపక్కల ఆరా తీశాడు. చాలా మంది వద్ద నుంచి ఇదే స్టోరీ చెప్పి సొమ్ములు వసూలు చేసి ముఖం చాటేసినట్టు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగదు విషయం బయటకు పొక్కుతుందనే ఉద్దేశంతో కాలనీ పెద్దల వద్ద పరిష్కరించుకునేందుకు సిద్ధమయ్యా'మంటూ నగర శివారుకు చెందిన ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. నగదు డిపాజిట్ చేస్తే 5, 10, 20 గ్రాముల బంగారు నాణెం ఇస్తామంటూ కొన్ని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు గాలం విసురుతున్నాయి.

ఏపీ, తమిళనాడు, మధ్యప్రదేశ్‌కు చెందిన కొన్ని ముఠాలు వ్యాపారులు, గృహిణులను తేలికగా బురిడీ కొట్టిస్తున్నాయి. పాత బంగారం దొరికిందంటూ బంగారు కడ్డీలను చూపుతారు. ఓ వైపు అసలు బంగారం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. తక్కువ ధరకు వస్తుందని చాలా మంది వీటిని కొంటున్నారు. కొన్నిసార్లు పురాతన నాణేలను అంటగట్టి మాయమవుతున్నారు. దృష్టిమరల్చి చోరీలు, మోసాలకు పాల్పడే ముఠాకు కిలేడీలు సూత్రదారులు. జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా మోసాలకు పాల్పడటం వీరి ప్రత్యేకత.

# టెక్నికల్ ప"రేషాన్"

హైదరాబాద్ (జనంసాక్షి)




కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. లబ్ధిదారులుగా ఎంపికైన వారు ఎంతగానో సంతోషించారు. నూతన కార్డుదారులకు ఉగాది నుంచే సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. విడుద లైన జాబితాలో పేర్లున్నటువం టి లబ్ధిదారులు రేషన్ కోసం దుకాణా లకు వెళ్తే కొందరికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. కొందరి పేర్లు రక్తసంబంధీకులకు సంబంధించిన పాత కార్డుల్లో నమోదవుతున్నాయని సమాచారం. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు పాతకార్డుల్లో ఉన్నటువంటి తమ వారి పేర్లను తొలగించకుండానే దరఖాస్తులు చేశారు. వీటికి ఆధార్ లింకు ఉండటం వల్ల కొత్తకార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారందరి పేర్లు పాతకార్డుల్లోని సభ్యుల సరసన చేరిపోయాయి. దీంతో కార్డులు వచ్చినప్పటికీ బియ్యం పొందలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని ధన్వాడ పట్టణానికి చెందిన శాంతమ్మ, రాజులు భార్యాభర్తలు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. రేషన్ కార్డు కోసం పలుమార్లు దరఖాస్తులు సమర్పించిన మీదట ఎట్టకేలకు ఇటీవల మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. సంతోషంతో ఈ నెలలో బియ్యం కోసం రేషన్ షాప్పుకు వెళ్లగా మీకు కార్డు రాలేదని, కుటుంబ సభ్యుల పేర్లన్నీ మీ మరిది కార్డులోకి వెళ్లిపోయాయని చెప్పారు. ఆయన నిన్ననే వచ్చి బియ్యాన్ని తీసుకెళ్లారని చెప్పడంతో శాంతమ్మ ఒక్కసారిగా హతాశురాలయ్యింది. ధన్వాడకే చెందిన ఓ యువకుడు దామరగిద్ద గ్రామానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకు న్నాడు. ఇద్దరి పేరుతో కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. సంతోషపడ్డ ఆ యువకుడు ఈ నెలలో బియ్యం కోసం రేషన్ షాప్పుకు వెళ్లగా మీ కార్డు రాలేదని తిప్పి పంపారు. నిశితంగా పరిశీలించగా ఈయన భార్య పేరు దామరగిద్దలోని తల్లిదండ్రుల రేషన్‌కార్డులో ఉండటంతో ఇతడి పేరు సైతం అదే కార్డులో నమోదైంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వచ్చే నెలలోగా సరి చేస్తామని వివరించారు. వచ్చే నెలలోనైనా పాతరేషన్ కార్డుల్లో నమోదైన పేర్లను తొలగించి కొత్త కార్డుల్లో నమోదు చేస్తూ రేషన్ అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రస్తుతం కొత్తకార్డుదారులు అందరూ మే నెల రేషన్ బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు.

**కొత్త రేషన్ కార్డుదారుల జాబితాల్లో సమస్యలు సాంకేతిక కారణంగా రేషన్ అందని వైనం వచ్చే నెలలోగా సరిచేస్తామంటున్న అధికారులు**

# పేదల పెన్నిధి మాజీ మంత్రి ఎమ్మెస్సార్

## తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర.. ఎమ్మెస్సార్ కు ఘన నివాళి..

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 27 (జనంసాక్షి)



: రాజకీయంలో ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవయే పరమావధిగా మాజీ మంత్రి ఏం సత్యనారాయణ రావు నిరంతరం పాటు పడ్డారని, ఆ మహానేత సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు కొనియాడారు. ఆదివారం రోజు మాజీ మంత్రి ఎమ్మెస్సార్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ లోని డిసిసి కార్యాలయంలో ఆ మహానేత చిత్రపటానికి రాజేందర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరు కాగా, పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ... ఎం.సత్యనారాయణ రావు రాజకీయాల్లో నిజాయితీ గా నిస్వార్థంగా పేదల సంక్షేమానికి నిరంతరం పాటు పడ్డారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎమ్మెస్సార్ లాంటి నేతలు చాలా అరుదుగా ఉంటారనీ, తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన అంచలంచలుగా ఎదిగారని గుర్తు చేశారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మూడుసార్లు ఎంపీగా, సుప్రీంకోర్టులో సీనియర్ కౌన్సిల్ తోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆర్టీసీ చైర్మన్ గా అనేక పదవులు అలంకరించి వాటికి వన్నె తెచ్చిన నేత ఎమ్మెస్సార్ అని పేర్కొన్నారు. అనేక ఉన్నత పదవులు అలంకరించిన ఏమాత్రం గర్వం లేకుండా అందరితోనూ ఆప్యాయత గా ఎమ్మెస్సార్ వ్యవహరించే వారని కొనియాడారు.

ఎమ్మెస్సార్ సేవలను కరీంనగర్ జిల్లా ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెస్సార్ వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళు లర్పించామని తెలిపారు.

# లీకేజీని అరికట్టిన అధికారులు

## అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎండీ అశోక్ రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి)



జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం-4 రెడ్ హిల్స్ పరిధిలోని మొజాంజాహి మార్కెట్ లో లీకేజీని అధికారులు అరికట్టారు. మొజాంజాహి మార్కెట్ సమీపంలో, 350 డయా ఎంఎం పైప్ లైన్ పై సరఫరా సమయంలో లో నీటి లీకేజీ గుర్తించారు. ఇదే విషయం ఉన్నతాధికారులు రద్దీ రహదారిపై ఉండడం.. మలకుంట రోడ్, రిసాలా అబ్దుల్లా, ఒస్మాన్‌గంజ్, శంకర్‌బాగ్, టాప్ ఖానా ప్రాంతాలలో సుమారు 700 ఇళ్లకు నీటి సరఫరా ప్రభావితం కాకుండా లీకేజీని తక్షణమే అరికట్టాలని నిర్ణయిం చారు. ఈ లీకేజీ గుర్తించిన ప్రదేశం ప్రధాన రహ దారిపై ఉండడం, చాలా రద్దీగా ఉండే ప్రధాన రోడ్డులో మధ్య భాగంలో ఉంది ఉండడంతో ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పోలీస్ అధికారులతో సమన్వ యంతో పనులు చేపట్టి కేకేజీని సమస్య పరిష్కరిం చారు. ప్రధాన రహదారిపై ఉన్న పనులు చేపట్టి లీకేజీని సమస్య పరిష్కరిం చి సరఫరా పునరుద్ధరిం చిన అధికా రులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాగే కష్టపడి పనిచేయాలని సూచించారు. సీజీఎం, జీఎంతో సహా మొత్తం బృందం చేసిన పని నిజంగా అభినందనీయమైనది అన్నారు.

# 12 తులాల బంగారం అపహరణ

## తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, ఏప్రిల్ 27 (జనం సాక్షి):



ఉద్యోగరీత్యా నాగపూర్ వెళ్తున్న తన కూతురిని హైదరాబాద్ లో ట్రావెలింగ్ బస్సు వద్దకు తీసుకువెళ్లి సెండాఫ్ ఇచ్చి రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం వేసిన ఇంటి తాళాలు విరగొట్టి ఇంట్లోని 12 తులాల బంగారు నగలను అపహరణ చేసిన ఘటన జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు అశోక్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3 లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్ల పట్టణానికి చెందిన శ్రీనివాసమూర్తి తమ కూతురు నాగపూర్ లోని ఓ కంపెనీలో ఉద్యోగం రావడంతో తమ కూతురికి ఉద్యోగరీత్యా నాగపూర్ పంపేందుకు ట్రావెలింగ్ బస్సు వద్దకు వెళ్లి సెండాఫ్ ఇచ్చేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి 7 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు కూతురికి సెండాఫ్ ఇచ్చి రాత్రి 12:30 గంటల సమయానికి ఇంటికి వచ్చి చూడగా తాళం వేసిన ఇంటికి తాళాలు విరగొట్టి ఇంటి పరిసరాల్లో కారం పొడి చల్లి ఉంది. ఈ విషయాన్ని గమనించిన శ్రీనివాసమూర్తి వెంటనే 100 కి డయల్ చేయగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. పోలీసుల సమక్షంలో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంటి లోని బీరువా తాళాలు విరగొట్టి బీరువాలోని 12 తులాల బంగారు నగలను దొంగలించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్ ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. జిల్లా కేంద్రం నుండి క్లూస్ టీం ను రప్పించి చోరీకి పాల్పడ్డ వారి ఆధారాల కొరకు అన్వేషణ చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జడ్చర్ల పట్టణంలో రోజు ఏదో ఒక చోట చోరీలు జరగడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పిడుగుపాటుకు 15 పొట్టేలు, ఎద్దు మృతి

## రహదారిపై చెట్టును తొలగించిన పోలీసులు

మల్దకల్ ఏప్రిల్ 27(జనంసాక్షి)





జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామం నుండి బురెడ్డిపల్లి వైపు వెళ్లే రోడ్డు మార్గంలో బొట్లమారి తిప్ప దగ్గరలోని ఓ రైతు పొలంలో ఆలూరు బుడ్డన్నకు సంబంధించి 15 పొట్టేలు మేత మేస్తుండగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున పిడుగు(ఉరుము) పడటంతో 15 పొట్టేలు మృత్యువాత పడ్డాయి. దీనికి సంబంధించి రైతు ఆలూరు బుడ్డన్న కన్నీటి పర్యంతంతో మీడియాకు తెలుపుతూప్రకృతి వైపరీత్య ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంలో పిడుగుపాటుకు 15 పొట్టేలు మృత్యువాత పడ్డాయని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. వీటి విలువ ఒక్కో పొట్టేలుకు సంబంధించి ? 20,000 ఉండగా మొత్తానికి కలిపి ? 3 లక్షల విలువ ఉంటుందని బాధితుడు తెలిపారు. మల్దకల్ గ్రామానికి చెందిన పుర తిమ్మప్ప ఎద్దు పిడుగు పాటుకు మృతి చెందింది. ఐజ గద్వాల్ రహదారిపై పెద్ద చెట్టు రోడ్డుపై విరిగిపడడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడారు. హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయక్, నిత్య పూజయ పూజయ్య స్పందించి చెట్టును జెసిపితో తొలగించారు.

# ధాన్యం కొనుగోలులో సమస్యలకు టోల్ ఫ్రీ

ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 27(జనంసాక్షి)



**జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం**

జిల్లాలో ప్రస్తుత వేసవిలో ధాన్యం అమ్మకాలలో రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు నెలకొని ఉంటే, వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారి కార్యాల యం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, టోల్ ఫ్రీ నెంబర్ 9347416178 కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్ కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, నిర్ణీత వేళల్లో టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ధాన్యం అమ్మకాలలో ఏమైనా సమస్యలు ఉంటే, కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 9347416178 కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని సూచించారు. వచ్చిన ఫిర్యాదు లను స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని అన్నారు. ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు ఉంటే సెల్ నెంబర్ : 9347416178 కు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. జిల్లా లోని రైతుల సౌకర్యార్థం నెలకొల్పిన కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కరంలో జాప్యం తగదు

కామారెడ్డి, ఏప్రిల్ 27 (జనంసాక్షి)




రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో పాలకులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలోని వశిష్ట కాలేజీలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ జిల్లా కన్వీనర్ కృష్ణమాచారి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని, ఇళ్ళ స్థలాల విషయంలో చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై పాత్రికేయుల పోరాటం తప్పదని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్ గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఒక్కటే జర్నలిస్టులకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడుతుందని అన్నారు. రాను రాను జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక, మరోవైపు దాడులు,అవమానాలు పెరిగిపోతున్నాయని సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పాలకుల పక్షం కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంద్ర నవీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, తాటికొండ కృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలను పరిష్కరించాల్సివుందని, హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ జరుపబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఫెడరేషన్ జిల్లా నాయకులు కృష్ణమూర్తి, మోహన్, బి. ప్రవీణ్ గౌడ్, కరుణాకర్, జమాల్ పూర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**పాలకుల నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధం కావాలి**

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**నూతన కార్యవర్గం ఎన్నిక**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షుడుగా బి. ప్రవీణ్ గౌడ్, కార్యదర్శిగా కె.కరుణాకర్, ఉపాధ్యక్షులుగా జమాల్ పూర్ లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, బి.రాకేష్, సంయుక్త కార్యదర్శులుగా సుంకరి సంజీవ్, మామిండ్ల లింగం, కోశాధికారిగా పి.రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి స్వాతి, బల్వంత రావు, ధనావత్ రాము తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.




# వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, ఏప్రిల్ 27 (జనంసాక్షి)



వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యపై ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే బెల్లంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని అన్నారు. కార్పొరేట్ వైద్య సేవలను ప్రజల చెంతకే తెచ్చే ఉద్దేశంతో ఉచిత ఆర్థోపెడిక్ సేవలను అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఈమెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కామినేని ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు, కామినేని ఆసుపత్రి వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

# మంధాన, ప్రతీకా సూపర్ షో!

## శ్రీలంకపై టీమిండియా ఘన విజయం

- భారత బౌలర్ల ఆధిపత్యం
- ప్రతీకా రావల్ అర్ధసెంచరీ
- స్మృతి మంధాన అజేయ ఇన్నింగ్స్
- సిరీస్‌లో శుభారంభం




శ్రీలంక మహిళల జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, భారత బౌలర్లు ఆదిలోనే ఒత్తిడి సృష్టించారు. శ్రీలంక బ్యాటర్లు భారత బౌలర్ల దాడి ముందు నిలబడలేకపోయారు. దీప్తి శర్మ, రాజేశ్వరి గైక్వాడ్, మరియు పూనమ్ యాదవ్‌లతో కూడిన భారత బౌలింగ్ యూనిట్ శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌ను కట్టడి చేసింది. శ్రీలంక జట్టు 40 ఓవర్లలో కేవలం 150 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు, రాజేశ్వరి 2 వికెట్లు తీసుకుని శ్రీలంకను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.

151 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత ఓపెనర్లు ప్రతీకా రావల్ మరియు స్మృతి మంధాన అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. ప్రతీకా రావల్ 50 పరుగులతో అర్ధసెంచరీ సాధించి, జట్టుకు బలమైన పునాది వేసింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఆకర్షణీయమైన కవర్ డ్రైవ్‌లు మరియు లాఫ్టెడ్ షాట్‌లు ఆకట్టుకున్నాయి. స్మృతి మంధాన, తన సహజ స్టైల్‌లో, శ్రీలంక బౌలర్లపై దాడి చేసింది. ఆమె 45 పరుగులతో అజేయంగా నిలిచి, భారత్‌ను విజయతీరానికి చేర్చింది. ఈ జోడి మధ్య వచ్చిన 100ం పరుగుల భాగస్వామ్యం భారత విజయాన్ని సుగమం చేసింది. కేవలం 25 ఓవర్లలోనే భారత్ లక్ష్యాన్ని ఛేదించి, 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

**కీలక ఆటగాళ్లు:**

ప్రతీకా రావల్: 50 పరుగులతో (7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

స్మృతి మంధాన: 45లి పరుగులతో అజేయ ఇన్నింగ్స్ ఆడి, జట్టును విజయతీరానికి చేర్చింది.

దీప్తి శర్మ: 3 వికెట్లతో శ్రీలంక బ్యాటింగ్‌ను కుప్పకూల్చింది.

ఈ విజయం భారత మహిళల జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. ట్రై-నేషన్ సిరీస్‌లో ఈ శుభారంభం జట్టుకు మంచి ఊపునిచ్చింది. స్మృతి మంధాన నాయకత్వంలో జట్టు సమతుల్యంగా కనిపిస్తోంది, బ్యాటింగ్ మరియు బౌలింగ్ రెండింటిలోనూ బలంగా ఉంది. శ్రీలంక జట్టు ఈ మ్యాచ్‌లో పోరాడే స్ఫూర్తిని కోల్పోయినట్లు కనిపించింది, ముఖ్యంగా బ్యాటింగ్ వైఫల్యం వారిని దెబ్బతీసింది.




# ముంబై ఐదో విజయం

## జస్‌ప్రీత్ బుమ్రా యొక్క విధ్వంసకర బౌలింగ్

### లఖ్‌నవూ బ్యాటింగ్ వైఫల్యం

ఐపీఎల్ 18 సీజన్లో తొలుత తడబడ్డ ముంబయి ఇండియన్స్ ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా లఖ్ నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్లో ముంబయి 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హార్దిక్ సేనకు వరుసగా ఇది ఐదో గెలుపు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో లఖ్నవూ సరిగ్గా 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (34* 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సు), నికోలస్ పూరన్ (27బీ 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సు), ఆయుష్ బదోని (35* 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సు), డేవిడ్ మిల్లర్ (24* 16 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఐడెన్ మార్క్రమ్ (9), రిషబ్ పంత్ (4), అబ్దుల్ సమద్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (4/22) లఖ్ నవూ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో మారమ్ను ఔట్ చేసి లఖ్ నవూకు గట్టి షాక్ ఇచ్చిన బుమ్రా.. 16 ఓవర్ లో మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్ (0)ని పెవిలియన్కు పంపాడు. ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అదరగొట్టాడు. విల్ జాక్స్ 2, కోర్బిన్ బాష్ ఒక వికెట్ పడగొట్టారు. లఖ్ నవూకు 10 మ్యాచ్లో ఇది ఐదో ఓటమి.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన ముంబయి.. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (58* 32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సు), సూర్యకుమార్ యాదవ్ (54, 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సు) అర్ధ శతకాలతో చెలరేగడంతో భారీ స్కోరు సాధించింది. ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్సుగా మలిచి ఊపుమీద కనిపించిన రోహిత్ శర్మ (12* 5 బంతుల్లో) త్వరగానే నిష్క్రమించాడు. విల్ జాక్స్ (29బీ 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తిలక్ వర్మ (6), హార్దిక్ పాండ్య (5) నిరాశపర్చారు. చివర్లో నమన్ ధీర్ (25* 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సు), కోర్బిన్ బాష్ (20* 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. లఖ్ నవూ బౌలర్లలో మయాంక్ యాదవ్ 2. అవేశ్ ఖాన్ 2, దిగ్వేశ్ సింగ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. బుమ్రాతో పాటు, ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు, మిచెల్ మార్ష్‌తో సహా కీలక వికెట్లు తీసి, లఖ్‌నవూ ఛేజింగ్‌ను ఇబ్బందిపరిచాడు. విల్ జాక్స్ తన స్పిన్‌తో పూరన్, పంత్, బదోనీలను ఔట్ చేసి, ముంబై విజయంలో కీలక పాత్ర పోషించాడు.

### గురువును మించిన శిష్యుడు

**ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆలస్యంగా అడుగుపెట్టిన జస్ప్రీత్ బుమ్రా రికార్డులు బద్ధలు కొడుతున్నాడు. యార్కర్లతో బెంబేలెత్తిస్తున్న ఈ స్పీడ్‌స్టర్ ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పాడు. తనకు మెంటార్, గురువు అయిన లసిత్ మలింగను వెనక్కి నెట్టాడీ పేస్ గుర్రం. తద్వారా ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడు. వాంఖడేలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. లక్నో ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్‌ను ఔట్ చేసి.. 171 వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. దాంతో, మలింగ రెండో స్థానానికి పడిపోయాడు. తన వైవిధ్యమైన బౌలింగ్ యాక్షన్‌తో బ్యాటర్లను వణికించే బుమ్రా 2013 నుంచి నుంచి ముంబైకి ఆడుతున్నాడు. మలింగతో కలిసి ఆడిన ఈ పేసర్ ఇప్పుడు అతడి రికార్డును బ్రేక్ చేశాడు.**




### ముంబై యొక్క ప్లేఆఫ్ ఆశలు

ఈ విజయం ముంబై ఇండియన్స్‌కు వరుసగా ఐదో విజయంగా నమోదైంది, ఇది జట్టు యొక్క ఆత్మవిశ్వాసాన్ని మరియు నికర రన్ రేట్‌ను (0.673) గణనీయంగా పెంచింది. హార్దిక్ పాండ్యా నాయకత్వంలో, ముంబై సీజన్ ఆరంభంలో ఒడిదొడుకులను అధిగమించి, ప్లేఆఫ్ రేసులో బలమైన దూకుడు చూపిస్తోంది. లఖ్‌నవూ, మాత్రం, ఈ ఓటమితో పాయింట్ల టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది, వారి నికర రన్ రేట్ (-0.054) ఆందోళన కలిగిస్తోంది.

### లఖ్‌నవూ బ్యాటింగ్ వైఫల్యం

**216 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన లఖ్‌నవూ ఆరంభంలోనే ఒడిదొడుకులను ఎదుర్కొంది. ఐడెన్ మార్క్‌రమ్ (9)ను బుమ్రా తొలి ఓవర్‌లోనే ఔట్ చేయగా, మిచెల్ మార్ష్ (34), నికోలస్ పూరన్ (27), ఆయుష్ బదోనీ (35) ఆశాజన కంగా ఆడినప్పటికీ, పెద్ద స్కోరు చేయలేకపోయారు. విల్ జాక్స్ (3 వికెట్లు) పూరన్, రిషభ్ పంత్‌లను ఒకే ఓవర్‌లో ఔట్ చేసి, లఖ్‌నవూ మధ్య క్రమాన్ని కుప్పకూల్చాడు. ఫలితంగా, లఖ్‌నవూ 161 పరుగులకే ఆలౌట్ అయింది.**

### రికెల్టన్-సూర్యకుమార్ బ్యాటింగ్ దాడి

**ముంబై బ్యాటింగ్‌లో రియాన్ రికెల్టన్ (58, 32 బంతులు, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరియు సూర్యకుమార్ యాదవ్ (54, 28 బంతులు, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అద్భుత హాఫ్ సెంచరీలతో వాంఖడే ప్రేక్షకులను అలరించారు. రోహిత్ శర్మ (12) త్వరగా ఔట్ అయినప్పటికీ, ఈ జోడి మిడిల్ ఓవర్లలో దూకుడుగా ఆడి, లఖ్‌నవూ బౌలర్లపై ఒత్తిడి పెంచారు. నమన్ ధీర్ (28) మరియు కార్బిన్ బాష్ (22) చివర్లో చెలరేగడంతో ముంబై 215/7 స్కోరు సాధించింది.**

### మాల్దీవ్స్‌లో చిల్ అవుతున్న సన్‌రైజర్స్ ఆటగాళ్లు..

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఎట్టకేలకు మూడో విజయంతో మురిసిపోయింది సన్‌రైజర్స్ హైదరాబాద్. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. ఈ విక్టరీని కమిన్స్ సేన ప్రకృతి అందాలతో అలరారే మాల్దీవ్స్‌లో సెలబ్రేట్ చేసుకుంటోంది. తదుపరి మ్యాచ్‌లో కమిన్స్ బృందం మే2న గుజరాత్ టైటాన్స్‌ను ఢీ కొట్టనుంది. కీలకమైన ఈ పోరుకు ఐదు రోజులు ఉండడంతో ఆరెంజ్ ఆర్మీ స్క్వాడ్ అంతా మాల్దీవ్స్‌లో వాలిపోయారు. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్‌లు కుటుంబంతో వెళ్లారు. అక్కడి రిసార్ట్ నిర్వాహకులు సన్‌రైజర్స్ ఆటగాళ్లకు తమ సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. కనుచూపుమేర నీలి సముద్రంతో ఆహ్లాదకరంగా ఉన్న మాల్దీవ్స్‌లో హైదరాబాద్ క్రికెటర్లు సేదతీరుతున్న వీడియోను హైదరాబాద్ ఫ్రాంచైజీ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

### ఒలింపిక్స్ కోసం

**పసిడి పతకంపై కన్నేసిన చైనా క్రికెట్ జట్టు..**




ఒలింపిక్స్‌లో వందలకొద్దీ పతకాలు కొల్లగొట్టే దేశాలు చాలానే. అథ్లెటిక్స్ నుంచి టేబుల్ టెన్నిస్ వరకూ ప్రతి పోటీలో స్వర్ణం సాధించే ఆసియా దేశం చైనా ఈసారి క్రికెట్ మీద గురి పెట్టింది. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్ వేదికగా జరగబోయే విశ్వక్రీడల్లో ఏకంగా పసిడి పతకంమే లక్ష్యంగా పెట్టుకుందట చైనా. అందుకోసం క్రికెట్ టీమ్‌ను సిద్ధం చేస్తోంట. ఈ విషయాన్ని ఆదివారం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా వెల్లడించాడు. 'దాదాపు శతాబ్దం తర్వాత క్రికెట్‌కు మళ్లీ ఒలింపిక్స్‌లో చోటు దక్కనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించడమే ఆలస్యం అన్ని దేశాలు సన్నాహాల్లో మునిగిపోయాయి. ఆసియా దేశం చైనా కూడా క్రికెట్ టీమ్‌ను సిద్ధం చేసుకుంటోంది. ఈరోజుల్లో టీ20లకు ఆదరణ చాలా ఉంది. ఫ్రాంచైజ్ క్రికెట్ ద్వారా ఏటా వందల కోట్ల వ్యాపారం సాగుతోంది. ఈ టీ20 బిజినెస్ మరింత పెరగనుంది' అని స్టీవ్ వా తెలిపాడు.

### క్రికెటర్ల భద్రతకు 'వజ్ర సూపర్ షాట్'




పహల్గామ్ ఉగ్రదాడి యావత్ భారతదేశం ఉలిక్కిపడింది. టెర్రరిస్టల అటాక్‌తో అప్రమత్తమైన భారత సైన్యం పలు ప్రాంతాల్లో భద్రతను పెంచింది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్‌లో ఆటగాళ్ల భద్రత కోసం 'వజ్ర సూపర్ షాట్' అనే సరికొత్త అస్త్రాన్ని ఉపయోగిస్తోంది. దాంతో, మ్యాచ్ సమయంలో డ్రోన్ల ద్వారా గగనతల దాడుల్ని నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇంతకూ ఈ పరికరం ఎలా పని చేస్తుందంటే..? వజ్ర సూపర్ షాట్ అనేది ప్రత్యేకమైన యాంటీ డ్రోన్ పరికరం. డ్రోన్ దాడులను సమర్థంగా అడ్డుకునే ఈ అస్త్రాన్ని భారత్‌కే చెందిన 'బిగ్ బాంగ్ బూమ్ సొల్యూషన్స్' అనే ప్రైవేట్ కంపెనీ తయారు చేసింది. ఈ డివైజ్‌ను సులువుగా వెంట తీసుకెళ్లవచ్చు. దీని సాయంతో మైదానంలో డ్రోన్ దాడులను నివారించడం సాధ్యమేనంటు న్నారు నిపుణులు. ఈ పరికరం నాలుగు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న శత్రు డ్రోన్‌లను పసిగట్టగలదు. భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంకపై అద్భుత విజయం సాధించి, అభిమానులను ఉత్తేజపరిచింది. కొలంబోలో జరిగిన మహిళల ట్రై-నేషన్ సిరీస్‌లో తొలి వన్డే మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్, మరియు ఫీల్డింగ్‌లో అసాధారణ ప్రదర్శన కనబరిచి, సిరీస్‌లో శుభారంభం చేసింది.



**బంగారు తల్లీ కొన్ని మంచి నీళ్లు తీసుకురామ్మా అని అన్నం తింటున్న తల్లి మూడుసార్లు పిలిచినప్పటికీ పదో తరగతి పూర్తి చేసిన ఆ కుమార్తె పలకలేదు. దీంతో బాధపడిన తల్లి చివరకు గట్టిగా మందలించడంతో ఏంటమ్మా సెలవుల్లోనైనా నన్ను ప్రశాంతంగా ఉండనీయవు అంటూ చేతిలోని సెల్ఫోన్ పక్కన పడేసి వెళ్లిపోయింది. కానీ తల్లికి నీళ్లుమాత్రం ఇవ్వలేదు.**

# పిల్లలకు నైపుణ్యాలు నేర్పించండి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంట్లో మొక్కలకు నీరు పోయమని ఇంటర్మీడియట్ చదువుతున్న కొడుకును తండ్రి చెప్పారు. ఆ మాట చెవిన పెట్టని కుమారుడిపై తండ్రి గట్టిగా అరవడంతో ఫోన్‌లో లీనమైన అతడు ఇంట్లో ఉంటే ఇలాగే ఏదో ఒక పని చెప్తారంటూ చిరాకుపడుతూ విసుగ్గా ద్విచక్రవాహనంపై ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు.

**సెలవులు జీవన నైపుణ్యాలకు నెలవులు :**

ఇదీ పది, ఇంటర్ ఎగ్జామ్స్ రాసి సెలవుల్లో ఉన్న కొంతమంది పిల్లల వ్యవహార శైలి. పిల్లల ప్రవర్తనతో తల్లిదండ్రుల హృదయం ఆవేదన చెందుతోంది. చదువుతున్నారని ఇన్నాళ్లు వారికి ఏ పని చెప్పకుండా వదిలేస్తే మొదటికే మోసం వచ్చిందని వాపోతున్నారు. పుట్టినప్పటి నుంచీ మాటలు నేర్పడంతోపాటు నడక, ప్రవర్తన తల్లిదండ్రుల నుంచి అలవడినట్లే జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్) కూడా అలవాటు చేసుకోవాలి.

ఇంటికి దూరంగా : పదో తరగతి, ఇంటర్ పూర్తయిందంటే పై చదువుల కోసం ఇంటికి దూరంగా వెళ్లాల్సి వస్తోంది. ఇంట్లో మాదిరిగా అక్కడ కూర్చున్న చోటుకే అన్నీ తెచ్చిపెట్టే అమ్మా నాన్నలు ఉండరు. ఏ అవసరమైనా ఏదైనా వారే చూసుకోవాల్సి ఉంటుంది. కనీస పనులు చేయలేక బద్దకించేటువంటి విద్యార్థులు కొందరు హాస్టళ్లలో ఉండి చదవలేక మారాం చేస్తుంటారు. బలవంతంగా చదివించినట్లయితే అనవసర ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటుతో ఇతర సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంటుంది.

**పుస్తకంలో చేర్చినవే :**

ఈ కృత్యాలను 3-5వ క్లాస్ల విద్యార్థులకు నిర్దేశించిన పని పాఠ్య పుస్తకాల్లో చేర్చినవే. ఎక్కడా వాటిని బోధించినటువంటి సందర్భం కనిపించదు. ఇళ్లల్లోనూ పాటించినటువంటి దాఖలాలు లేవనే చెప్పాలి. ఐదో తరగతి స్థాయిలో నేర్చుకోవాల్సిన జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్) డిగ్రీ వచ్చినప్పటికీ అలవడటం లేదు.



**ఇవి అలవడుతాయి :**

లైఫ్ స్కిల్స్తో బాధ్యత, సాయపడే గుణం, ఆత్మవిశ్వాసం, సంఘటిత శక్తి విలువ, విచక్షణా జ్ఞానం(కామన్ సెన్స్) వంటివి అలవడతాయి.

**సహజసిద్ధంగా, అనుకరణలో నేర్చుకోవాల్సిన స్కిల్స్**

**కిచెన్ రూం :** కూరగాయలు శుభ్రపరచడం, కట్ చేయడం, వండటం, వంటింటి గట్టు తుడవడం, పాత్రలను శుభ్రపర్చడం, భోజనం వడ్డించడం లాంటివి.

**నిద్రించే గది :** నిద్ర మేల్కొగానే బెడ్‌షీట్లు మడతపెట్టడం, బెడ్ సర్దడంతో పాటు అల్మారాలో దుస్తులు ఓ క్రమపద్ధతిలో అమర్చడం, లైట్లు, ఫ్యాన్లను తుడవడం లాంటి పనులు.

**హాలు :** టీవీ, ఇతర అలంకరణ సామగ్రిని క్లీన్గా తుడవడం, బుక్కు ఓ క్రమ పద్ధతిలో పెట్టడం, సోఫా కవర్లు, కుర్చీలను సర్దడం లాంటి పనులు.

**బాత్‌రూమ్ :** టూత్ బ్రష్‌లు, సబ్బులు, పేస్ట్ లాంటివి సరైన స్థలంలో పెట్టడం, బాత్‌రూమ్‌లు, శౌచాలయం కడగటం.



పరిసరాల శుభ్రంగా ఉంచడం : బూజు దులపడం, మొక్కలకు నీరు పోయడం, దోమలు ఇతర కీటకాలు ఆశ్రయం పొందకుండా చెత్త, మురుగు నీటిని తొలగించడం.

**మార్కెట్ :** ఇంటికి కావాల్సినటువంటి సరకులు, కూరగాయలను తీసుకురావడం, ధరలు, నాణ్యత విషయంలో తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తలు.

**సంస్కారం :** ఇంటికి వచ్చినటువంటి వారిని ఆదరించడం, వారిని పలకరించడం లాంటి పనులు.

# మామిడి మాయాజాలం ఆరోగ్యానికి ముప్పు



*వేసవి కాలం రాగానే పండ్ల మార్కెట్లు రంగురంగుల మామిడి పండ్లతో కళకళలాడుతుంటాయి. "పళ్లల్లో రారాజు" అని ముద్దుగా పిలుచుకునే ఈ పండు కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, ఈ మధ్యకాలంలో "అంతా మాయాబజార్" అన్న చందంగా, సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతుల్లో మామిడి పండ్లను త్వరగా పండించేస్తున్నారు. ఇలాంటి "పైపూతలు" పూసిన పండ్ల వల్ల ప్రజల ఆరోగ్యం "ఆగం" అవుతోందని ఆరోగ్య నిపుణులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో, మామిడి పండ్లను కృత్రిమంగా ఎలా పండిస్తున్నారు, వాటి వల్ల కలిగే నష్టాలేమిటి, వాటిని ఎలా గుర్తించాలి, ఈ విషయంలో చట్టాలు ఏం చెబుతున్నాయి, అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమిటో "కళ్లకు కట్టినట్టు" విశ్లేషిద్దాం.*

**అధికోత్పత్తి రాష్ట్రాలివే!**

భారతదేశంలో మామిడి పండ్ల ఉత్పత్తి "ఏటికేడాది గాలివాటం" లా ఉంటుంది కానీ సగటున చూస్తే మాత్రం రెండు కోట్ల టన్నుల పైనే "పంట పండుతుంది". ఇక రాష్ట్రాల విషయానికొస్తే, ఉత్తరప్రదేశ్ "తలమానికంగా" మొదటి స్థానంలో నిలుస్తుంది. దేశంలో పండే ప్రతి నాలుగు మామిళ్లలో ఒకటి అక్కడ "పచ్చగా కళకళలాడుతూ" ఉంటుంది. మాలిహాబాద్, లక్నో, సహరాన్‌పూర్ ప్రాంతాల మామిడికైతే "నోరూరించని వారుండరు"..ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ "రెండవ స్థానంలో తనదైన ముద్ర" వేస్తుంది. కోస్తా జిల్లాల్లో మామిడి సాగు "పువ్వుల్లో తేనె" లా విస్తరించి ఉంటుంది. బంగానపల్లి, నీలం, తోతా పురి వంటి రకాలు ఇక్కడ "పలుకుబడి" కలిగినవి. కర్ణాటక కూడా "ఏమీ తక్కువ తినలేదు" అంటోంది. కోలార్, బెంగళూ రు ప్రాంతాల్లో అల్ఫోన్సో వంటి రకాలు "పండగ చేసుకుంటాయి". బీహార్ కూడా "తానూ ఉన్నానంటూ" తన ఉనికిని చాటుకుంటుంది. గంగా మైదాన ంలో రకరకాల మామిళ్లు "గుబాళిస్తాయి". తెలంగాణ కూడా మామిడి ఉత్పత్తిలో "పోటీ పడుతోంది". నల్లగొండ, ఖమ్మం ప్రాంతాల్లో మామిడి తోటలు "కనుచూపు మేర" కనిపిస్తాయి. తమిళనాడులో నీలం, ఇతర రకాలు "స్థానికంగా పేరు" తెచ్చుకున్నాయి. ఇక గుజరాత్ కేసర్ మామిడికి "చిరునామా" లాంటిది. భావ్‌నగర్, సూరత్ ప్రాంతాల్లో దీని "హవా" నడుస్తుంది. మహారాష్ట్రలో రత్నగిరి అల్ఫోన్సో "ఒక బ్రాండ్" అయినప్పటికీ, ఉత్పత్తిలో మాత్రం మిగతా వారికంటే కాస్త "వెనుకడుగు" వేస్తుంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా "తమ వంతు" మామిడిని పండిస్తాయి. ఇలా ఈ రాష్ట్రాలన్నీ కలిసి భారతదేశ మామిడి ఉత్పత్తిని "తారాస్థాయికి" చేరుస్తాయి. అయితే, వాతావరణం "ఒక్కోసారి ఒక్కోలా" ఉండటం వల్ల ఈ స్థానాల్లో కాస్త "మార్పులు చేర్పులు" జరుగుతుంటాయి.




**' నిగనిగల ' నిజాలివే !**

మామిడి కాయలను "నిమిషాల్లో నిప్పులు కక్కేలా" పండించడానికి వ్యాపారులు ఎక్కువగా వాడుతున్న రసాయనం కార్బైడ్, దీనినే కాల్షియం కార్బైడ్ అని కూడా అంటారు. ఇది చూడటానికి "పైకి మెత్తగా లోపల వెన్నపూస" అన్నట్లు తెల్లగా లేదా బూడిద రంగులో ఉంటుంది. ఈ కార్బైడ్‌ను మామిడి కాయల మధ్యలో పెట్టి నీళ్లు చల్లితే చాలు, "అగ్గి రాజుకున్నట్టు" ఎసిటిలీన్ అనే వాయువు విడుదలవుతుంది. ఇది సహజంగా పండ్లు పండడానికి కారణమయ్యే ఇథిలీన్ వాయువును పోలి ఉన్నప్పటికీ, "అసలు సిసలైనది కాదండోయ్ బాబూ". ఇది అనేక ఆరోగ్య సమస్యలకు "దారి చూపిస్తుంది".

**' అమ్మో ' నిషేధిత రసాయనాలా ?**

కొంతమంది వ్యాపారులు "తక్కువ ఖర్చు ఎక్కువ లాభం" అనే సూత్రంతో నిషేధిత రసాయనమైన ఇథిఫోన్‌ను కూడా అధిక మోతాదులో వాడుతున్నారు. ఈ రసాయనాన్ని మామిడి పండ్లు ముగ్గేందుకు ప్రత్యక్షంగా ఉపయోగించడానికి అనుమతి లేదు. ఇది కూడా ఇథిలీన్‌ను విడుదల చేస్తుంది, కానీ దీని అధిక వినియోగం పండ్ల నాణ్యతను "మట్టి కొట్టేలా" చేస్తుంది. ఆరోగ్యానికి "చేటు చేస్తుంది". భారతదేశంలో పండ్లను సహజంగా పండించడానికి అనుమతించిన ఏకైక "అస్త్రం" ఇథిలీన్ గ్యాస్. కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాల వాడకాన్ని నివారించడానికి ఇథిలీన్ ఆధారిత పద్ధతులను అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

ఇది సహజమైన హార్మోన్, ఆరోగ్యానికి "ఏమీ కాదు". కానీ కార్బైడ్, ఇథిఫోన్ వంటి వాటి వాడకం "ఖచ్చితంగా నేరం". ఇథిలీన్ గ్యాస్‌ను మాత్రమే సురక్షితమైన పద్ధతిగా అనుమతించారు. అది కూడా నిర్దిష్ట మోతాదులో ఉండాలి. ఇథిఫోన్‌ను పొడి రూపంలో చిన్న సాచెట్‌లలో ప్యాక్ చేసి పండ్లతో నేరుగా సంబంధం లేకుండా ఉపయోగించవచ్చు. ఈ సాచెట్‌లు ఇథిలీన్ గ్యాస్‌ను విడుదల చేస్తాయి. తద్వా రా పండ్లు పండుతాయి. అయితే, ఇథిఫోన్‌ను నేరుగా పండ్లపై చల్లడం లేదా అధిక మోతాదులో ఉపయోగించడం ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలకు విరుద్ధం. ఎఫ్ఎస్ఎస్ఎఐ చట్టాల ప్రకారం కాకుండా విరుద్ధంగా వీటిని వాడితే "మూల్యం చెల్లించక తప్పదు". ఈ విషయంలో కోర్టులు కూడా "తమ వంతు బాధ్యత" నిర్వర్తించాయి. కాల్షియం కార్బైడ్ వాడకాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఢిల్లీ హైకోర్టు దీనిని విషం ఇవ్వడంతో సమానమని "తీర్పు చెప్పింది". ఇతర రాష్ట్రాల కోర్టులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాయి.

**అనారోగ్యం ఫుల్ :**

కార్బైడ్, ఇథిఫోన్ వంటి "కంటికి కనపడని శత్రువులతో" పండించిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యం "గుల్ల" అవుతుంది. కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి "విషపు కుంపట్లు" ఉంటాయి. వీటి ప్రభావంతో తలనొప్పి, కళ్లు తిరగడం, వికారం, వాంతులు, కడుపు నొప్పి, అతిసారం వంటి సమస్యలు "చుట్టుముడతాయి". దీర్ఘకాలికంగా ఇది నాడీ వ్యవస్థను "కుప్పకూల్చే" ప్రమాదం ఉంది. గర్భిణులు, పిల్లలపై దీని ప్రభావం "నిప్పుతో చెలగాటం" లాంటిది. కొన్ని అధ్యయనాల ప్రకారం, కార్బైడ్ క్యాన్సర్‌కు కూడా "నాంది పలకవచ్చు". ఇక ఇథిఫోన్ అధిక మోతాదులో వాడితే చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కడుపులో మంట వంటి "నరకం" చూడాల్సి వస్తుంది. ఇది కాలేయం, మూత్రపిండాలపై కూడా "తిరుగులేని" ప్రభావం చూపుతుంది.

# రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- దశలవారీగా పెండింగ్ అంశాల పరిష్కారం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్ (జనంసాక్షి) : రిటైర్డ్ ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యానికి సహకారం అందిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన టీజీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షిక సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 90 ఏళ్లు నిండిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ తో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థ మేలు కోసం రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం, సంస్థ పరిరక్షణ.. ఈ మూడు అంశాలే ప్రాధాన్యాలుగా సంస్థ ముందుకు పోతోందని స్పష్టం చేశారు. ఏడాది కాలంలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూనే.. కొత్త బస్సుల కొనుగోలు చేపట్టినట్లు వివరించారు. కొత్త బస్సులకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలను చేపడుతున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టి సాధిస్తోందన్నారు. తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ వన్ సంస్థగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అనంతరం సజ్జనర్ మాట్లాడుతూ.. రిటైర్డ్ అధికారులకు, ఉద్యోగులకు సంస్థపైనా ప్రేమ, అభిమానం ఎక్కువగా ఉంటుందని, పదవీ విరమణ పొందాక కూడా ఆర్టీసీ బాగు కోసం పరితపిస్తుంటారని అన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సలహాలు, సూచనలతో సంస్థలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టామని తెలిపారు. ఆర్టీసీ రెగ్యులర్ అధికారులు, సిబ్బందితో పాటు రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. టీఎస్‌ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. తార్నాక ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో తమ సమస్యలను రిటైర్డ్ ఆర్టీసీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగవేందర్ రావు, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ సీతరాం బాబు, ట్రెజరరీ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిచినో సంస్థతో తెలంగాణ భాగస్వామ్యం మరింత బలోపేతం

**జపాన్‌లోని ఒసాకా నగరంలో నిచినో రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించిన చిన్నారెడ్డి బృందం**



హైదరాబాద్, ఏప్రిల్ 27 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నా రెడ్డి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపీ (ఐఏఎస్), వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఓఎస్డీ శ్రీధర్ వాసిరెడ్డితో కలిసి జపాన్‌లోని ఒసాకా నగరంలో నిచినో రీసెర్చ్ సెంటర్‌ను ఆదివారం సందర్శించారు. ప్రపంచంలో ప్రముఖ అగ్రో కెమికల్ సంస్థలలో ఒకటైన నిచినో తమ పురోగతిని, పురుగుల మందులు, శిలీంధ్ర నాశకాలు, కల్మష నివారకాలు వంటి పరిశోధనలపై నూతన ఆవిష్కరణలను వివరించి, అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన వారి పరిశోధనా కేంద్రాన్ని ప్రదర్శించారు. డా. జి. చిన్నా రెడ్డి ప్రతినిధి బృందం డా. కజుహికో మోటోబాకి, డా. ప్రశాంత్ కి, నిచినో బృందానికి సాదర స్వాగతం పలికి విలువైన సమాచారం కోసం జపాన్ పర్యటనకు వచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం, నిచినో సంస్థతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వ్యవసాయ అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా చిన్నారెడ్డి సారథ్యంలోని తెలంగాణ అధికారిక బృందం ముందుకు సాగుతోంది.

# ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

- ఆదర్శంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దంపతులు



**గోదావరిఖని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దంపతులకు వారసుడొచ్చాడు. గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయకు ప్రభుత్వ వైద్యులు ప్రసవం చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఏరియా ఆసుపత్రికి సంబంధించిన సీనియర్ వైద్యురాలు హెచ్వోడి అరుణ నేతృత్వంలో శిరీష, లక్ష్మి వైద్య బృందం కలెక్టర్ భార్యకు శస్త్ర చికిత్సలు నిర్వహించి పురుడు పోశారు. కలెక్టర్ భార్య విజయ గర్భవతిగా ఉన్నప్పటి నుండి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలను పొందుతుంది. ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించుకుంది. కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఇది రెండో సంతానం, మొదటి సంతానంలో కూడా కుమారుడు జన్మించగా రెండో సంతానంలో కూడా కలెక్టర్‌కు మరో వారసుడొచ్చాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ భార్యకు సక్సెస్‌గా ఆపరేషన్ జరిగి పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబరంలో ఉన్నారు. వైద్యులతో ఒక తండ్రిగా కలెక్టర్ తన ఆనందాన్ని సంతోషాన్ని పంచుకోవడం కనిపించింది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న సర్కారు ఆలోచన విధానాలను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తూచా తప్పకుండా పాటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందాలన్న ఆలోచన విధానంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. కలెక్టర్ తీరును అందరూ అభినందించారు.

# కారు ఢీకొని ముగ్గురు మృతి

- ఒకరు అక్కడికక్కడ మృతి మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి
- ఇద్దరు మంబాపూర్ గ్రామస్తులుగా గుర్తింపు



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 27 (జనంసాక్షి) :** దైవ దర్శనానికి వెళ్లి తిరిగిరాని అనంత లోకానికి వెళ్ళిపోయారు. ఆదివారం అమావాస్య సందర్భంగా కర్ణాటకలో దైవ దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ప్రమాదం. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇద్దరు మృతి చెందగా మరొక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లోని చిట్లపల్లి గ్రామ మలుపు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే పెద్దే ము ల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన శ్రీలత ఆమె కూతురు శృతి మరో గుర్తు తెలియని వ్యక్తి కొడంగల్ నియోజకవర్గం చిట్లపల్లి గ్రామ మలుపు దగ్గర బీజాపూర్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రం గానుగాపూర్ లో ఆదివారం అమావాస్య సందర్భంగా దైవదర్శనం ముగించుకొని స్వగ్రామమైన మంబాపూర్ కు బయలుదేరి కారులో ప్రయాణిస్తుండగా వారి కారును కొడంగల్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న బొలెరో కారును ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటి అయిన కొడంగల్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాద వార్త తెలియగానే కొడంగల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారిని గుర్తించారు. మంబాపూర్ కు చెందిన శ్రీలత తమ కుటుంబ సభ్యులతో గత కొంతకాలంగా హైదరాబాదులో నివాసం ఉంటూ జీవనోపాధి గడుపుతుంది. వారం రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంటిదగ్గర తన భర్త క్రిష్టప్పను ఇద్దరు పిల్లలను వదిలి చిన్న కూతురు శృతిని తీసుకొని తన తల్లి గారి ఇంటికి వెళ్లి వస్తానని వెళ్ళింది. ఆదివారం అమావాస్య కావడంతో కారులో వీరంతా కర్ణాటకలోని గానుగాపూర్ లో దైవదర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా కొడంగల్ పట్టణం చిట్లపల్లి వద్ద బులెరా కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదంలో శ్రీలతతో పాటు ఆమె కూతురు శృతి తెలియని వ్యక్తి మృతి చెందారు. కొడంగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మరో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినందున ఆయన చిరునామా కోసం పోలీసులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రోడ్డు ప్రమాదంలో తల్లి కూతుర్లు మృతి చెందడంతో శ్రీలత భర్త కిష్టప్ప కుటుంబ సభ్యులు కన్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటనతో మంబాపూర్ లో విషాదఛాయలు అమలుకున్నాయి.

# భూదాన్ భూములకు రక్షనెక్కడా?

- ఐఏఎస్, ఐపీఎస్ లకు హైకోర్టు నోటీసులు
- అక్రమాలపై సిబిఐకి సైతం నోటీసులు జారీ
- నిషేధిత జాబితాలోకి భూదాన్ భూములు చేర్చాలంటూ మధ్యంతర ఉత్తర్వులు



రంగారెడ్డి (జనంసాక్షి) : భూమి ఇండ్లు లేని నిరుపేదలకు దక్కాల్సిన భూములపై ఐఏఎస్, ఐపీఎస్ ల కన్నుపడినట్టు ఆరోపణలు ఊపందుకున్నాయి. అధికారం చేతిలో ఉంటే దేన్నైనా మార్చొచ్చు కదా అనే ఉద్దేశంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కోట్ల రూపాయలు విలువ చేసే భూములను తమ పేరుతో పాటు తమ కుటుంబ సభ్యుల పేరు మీద కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా పొందారు. అన్యాయం జరిగి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల దృష్టికి వెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని పూర్తిగా వమ్ము చేశారనే అపవాదు నెలకొంది. న్యాయం జరగడం పక్కన పెట్టేసి భూదాన్ భూములను చరబట్టేశారు. దీనిపై హైకోర్టు ఐఏఎస్ ఐపీఎస్ లకు నోటీసులు జారీ చేయడంతో పాటు భూదాన్ భూములపై సిబిఐ విచారణ తెలపాలంటూ నోటీసులు జారీ చేయడంతో భూములు దక్కించుకున్న వారిలో భయం మొదలైంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామం సర్వేనెంబర్ 151, 182, 194 195లోని భూదాన్ భూములను కు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. భూదాన్ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో పాటు సబ్ రిజిస్ట్రర్లకు ఆదేశాలు జారీ చేసింది. భూదాన్ భూముల అక్రమాల్లో పలువురు ఐఏఎస్ ఐపీఎస్ లతో పాటు ఉన్నతాధికారులపై ఆరోపణలున్న నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉందని, దీంతో నిషేధిత జాబితాలో చేర్చాలని తమ విచక్షణధికారంతో ఆదేశిస్తున్నామని హైకోర్టు పేర్కొంది. తదుపరి ఆర్డర్స్ ఇచ్చేదాకా ఈ భూములను అన్యాక్రాంతం చేయరాదని ఏఒక్క లావాదేవిని జరపడానికి వీల్లేదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో పెద్దస్థాయిలో ఉన్నతాధికారులు ఉండడంతో పిటిషనర్ ను ఉపసంహరించుకోవడానికి పిటిషనర్ ను అనుమతించొద్దని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. అన్యాక్రాంతానికి వీల్లేదని స్పష్టం చేసింది. నాగారంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ జరపాలంటూ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకపోవడంతో సిబిఐ ఈడితో దర్యాప్తు జరిపించాలంటూ మహేశ్వరం మండలానికి చెందిన బీర్లమల్లేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ స్థానిక పోలీసులు రెవెన్యూ అధికారులతో కలిసి ఉన్నతాధికారులు ఫోర్జరీ పత్రాలు సృష్టించి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బినామి లావాదేవీలతో చట్ట విరుద్ధంగా భూదాన్ భూములను బదిలాయించారన్నారు. భూదాన్ చట్ట తెలంగాణ భూదాన్ గ్రామదాన నిబంధనలు 1965కు విరుద్ధంగా పలువురు ఐపీఎస్ ఐఏఎస్ సొంత పేర్లతో పాటు కుటుంబ సభ్యుల పేర్లతో కొనుగోలు చేశారని తెలిపారు సిపిసికి సిఎంఓ కార్యాలయంతో పాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శికి వివరాలు పంపిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తెలంగాణలో ఐఏఎస్ ఐపీఎస్ అధికారుల పాత్ర ఉన్నందున కేంద్రానికి చెందిన డిఓపిటి హోంశాఖలకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని పేర్కొన్నారు. భూముల బదలాయింపు అన్యాక్రాంతంపై భూదాన చట్టం ప్రకారం నిషేధం ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డులలో వారి పేర్లను చేర్చి పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని తెలిపారు. అక్రమాలను బయటపెట్టిన పిటిషనర్ కు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. వాదనలు విన్న కోర్టు ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములు భూదానా బోర్డుకు చెందినవన్నారు. భూదాన చట్టం ప్రకారం కేటాయింపులు వారసత్వంగా ఇవ్వవచ్చని, అంతేగాని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు. ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో పాటు మహేశ్వరం ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నందున పిటిషన్ ను ఉపసహరించుకోవడానికి పిటిషనర్ ను అనుమతించబోమని పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భూదాన్ యజ్ఞ బోర్డు సీసీఎల్ తో పాటు సిబిఐ ఈడికి నోటీసులు జారీ చేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించేది. ప్రతివాదులైన ఐఏఎస్ ఐపీఎస్ వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేయాలని పిటిషనర్ కు స్పష్టం చేసింది. దాదాపుగా 30 మందికిపైగా ఐఏఎస్, ఐపీఎస్ వారి కుటుంబ సభ్యులకు ఉన్నతాధికారులకు, ప్రైవేట్ వ్యక్తులకు హైకోర్టు నోటీసులు జారీ అయ్యాయి. తదుపరి విచారణ జూన్ 12 కు హైకోర్టు వాయిదా వేసింది.

# 6 లేన్లతో ట్రిపుల్‌ఆర్

- డీపీఆర్‌ను సవరిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ
- కొత్తగా టెండర్లు ఆహ్వానించకుండా పాతవాటితోనే..



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రాంతీయ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగాన్ని 6 లేన్లుగా నిర్మించేందుకు కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఓవైపు ట్రాఫిక్ అధ్యయనం చేపట్టడంతోపాటు మరోవైపు ప్రస్తుతం 4 లేన్లుగా ఉన్న డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను 6 లేన్లకు అనుగుణంగా సవరిస్తున్నారు. అయితే, ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినందున మళ్లీ కొత్తగా టెండర్లు ఆహ్వానించకుండా వాటినే కొనసాగించాలని నిర్ణయించారు.

## రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

ట్రిపుల్‌ఆర్‌ను 4 లేన్లతో నిర్మిస్తే భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున 6లేన్లుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆ విజ్ఞప్తికి కేంద్రం ఇటీవల సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. దీంతో కేంద్రం ఆదేశాల మేరకు ఎన్‌హెచ్‌ఏఐ ట్రిపుల్‌ఆర్‌ను 6 లేన్లుగా మారుస్తూ డీపీఆర్‌ను సవరించడంతోపాటు ట్రిపుల్‌ఆర్ మార్గంలో ట్రాఫిక్‌పై అధ్యయనం చేపట్టింది. ఉత్తర భాగం నిర్మాణానికి ఇదివరకే టెండర్లను ఇదివరకే ఆహ్వానించినందున మళ్లీ కొత్తగా పిలిచే అవకాశం లేదని, సవరించిన డీపీఆర్‌కు అనుగుణంగా ఏజెన్సీలు తమ బిడ్ డాక్యుమెంట్లను సమర్పిస్తే సరిపోతుందని అధికారులు చెప్తున్నారు.

## దక్షిణ భాగానికి డీపీఆర్

ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను రూపొందిస్తున్నది. అందుకోసం ఇటీవల ఓ ఏజెన్సీని నియమించింది. వాస్తవానికి దక్షిణ భాగం పనులను చేపట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను తయారు చేయించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

# గోడ కూలి యువకుని దుర్మరణం



**శాయంపేట, ఏప్రిల్ 27 ( జనం సాక్షి):** శాయంపేట మండల కేంద్రంలో యువకుని దుర్మరణంతో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మారేపల్లి నాగరాజు పనిచేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గోడకూలి కింద పడడంతో ఆ శిధిలాల కింద ఇరుక్కొని మరణించినట్లు తెలిపారు. అప్పటివరకు తమతో ఉన్న మనిషి మరణించడంతో కుటుంబీకుల, స్థానికుల రొధనలతో శాయంపేట మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370